


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

భారతదేశ 'సెక్యులర్' భావనను తిరగరాసే ప్రయత్నం

వ్యాసం 2వ పేజీలో

సంపుటి 09, సంచిక: 301 | గురువారం | 01-10-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఎన్నికల చోరీపై ఇండియా కూటమి ధ్వజం

# మోదీ, షా, జ్ఞానేశ్‌లను విడిచిపెట్టం బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు

**'సర్' పూర్వపు ఓటరు జాబితాలు వినియోగం ; రేపటి నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణ ఆందోళన**

(జ్ఞాన్ పాఠక్)

**న్యూఢిల్లీ :** 2026 సెప్టెంబర్ 30 ఉదయం ఢిల్లీలో కొన్ని హోర్డింగులు వెలిశాయి. వాటిని పెట్టిన వారి పేరు, ఊరు వాటిపై లేదు. వాటిని బిజెపి వారే పెట్టారని విశ్వసించబడుతున్నది. ఇండియా కూటమి సమావేశం జరగబోతుండగా, అవి ప్రతిపక్ష నాయకులపై గురిపెట్టాయి, దాని నాయకుల మధ్య విభేదాలున్నాయని ఆరోపించాయి. బిజెపి వేరుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని విమర్శించింది. అయితే దుష్ప్రచారకులకు ఆశాభంగం కలిగిస్తూ, ఇండియా కూటమి భాగస్వామ్యపక్షాల అగ్రనాయకులు లేదా వారి ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌కు, ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్'కు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో బిజెపి నాయకత్వం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు బలమైన ఐక్య సంఘటనగా ఏర్పడ్డారు.ఇండియా కూటమి సమావేశం ఇసిఐ, సిఇసి జ్ఞానేశ్ కుమార్, సర్ ఎన్నికల జాబితాలపై కేంద్రీకరించి నిర్దిష్టమైన సంయుక్త ఆందోళన కార్యక్రమం ఆమోదించింది. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాలపై కూడా గురిపెట్టి వారి రాజీనామాలు డిమాండ్ చేసింది.

ఇండియా కూటమి ఆమోదించిన నిరసన కార్యక్రమం ప్రాధాన్యత గలది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మీడియాకు ప్రకటించినట్లు, నవంబర్ 1న ఢిల్లీలో పెద్ద బహిరంగ సభ జరుగుతుంది. ప్రజల ఓటుహక్కును, ఇతర రాజ్యాంగ హక్కులను ప్రభుత్వం ఎలా లాగేసుకుంటున్నదో ప్రజలకు వివరించేందుకు కూటమి తలపెట్టిన ఐదు ర్యాలీలలో ఇది మొదటిది.ఇతర సంయుక్త కార్యక్రమం ప్రకారం, ప్రతిపక్ష ఎంపిలందరూ అక్టోబర్ 6న భారత ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్దకు ప్రదర్శనగా వెళతారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు దేశంలోని అన్ని జిల్లాల్లో "ప్రజాస్వామ్య పరిరక్షణ" సభలు జరపాలని నిర్ణయించారు.

"రాజ్యాంగంపై జరుగుతున్న దాడి" గూర్చి ఫిర్యాదు చేసేందుకై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ కోరాలని ఇండియా కూటమి నిర్ణయించింది. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి లేదా రాజీనామా చేయించాలన్న డిమాండ్‌ను సమావేశం పునరుద్ఘాటించింది. సర్ నిర్వహణపై ఎన్నికల కమిషన్ చర్యలను సమీక్షించాలని డిమాండ్ చేసింది. ఇండియా కూటమి మిత్రపక్షాలు తమ పార్లమెంటరీ వ్యూహంలో భాగంగా ఈ సమస్యలను పార్లమెంటు ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. బహిరంగ సభలు, ప్రదర్శనలతో తమ పార్లమెంటరీ కార్యాచరణను మేళవించాలని నిర్ణయించటం ముఖ్యమైన తరువాయి 8లో

## ఈ నెల 2-8 వరకు

# దేశవ్యాప్తంగా యాత్రలు

**ఇండియా కూటమి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక ఖరారు**

కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, 'సర్' వివాదంపై ఇండియా కూటమి ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' యాత్రలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు జరపాలని అన్ని పార్టీలు అంగీకరించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. మల్లికార్జున, పార్టీ మాజీ అధినేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆర్జెడీకి చెందిన తేజస్వి యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూలే, సిపిఐ ఎంపి సందోశ్‌కుమార్, సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి సహా తమ నాయకులతో మూడున్నర గంటల పాటు జరిగిన సమావేశం అనంతరం ప్రతిపక్ష కూటమి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశం అనంతరం ఇండియా బ్లాక్ నాయకులు ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో నాయకులు ఒక ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికపై నిర్ణయం తీసుకున్నారని ఖర్గే తెలిపారు. యువత, ఎన్‌జిఒలను భాగస్వాములను చేస్తూ, అక్టోబర్ 2 నుండి 8 వరకు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' యాత్రలు, జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ముందు ప్రదర్శనలు నిర్వహించాలని పార్టీలు నిర్ణయించినట్లు ఖర్గే చెప్పారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపిలందరూ ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారని ఆయన అన్నారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరి, అక్టోబర్ రెండవ వారంలో ఓటు చోరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పిస్తారని ఆయన తెలిపారు. 'మేము ఐదు భారీ ర్యాలీలు నిర్వహిస్తాము, వాటి తేదీ, ప్రదేశం త్వరలో నిర్ణయిస్తాము. దేశాన్ని నడపడానికి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజల హక్కును ప్రభుత్వం ఎలా లాక్కుంటోందో ప్రజలకు చెబుతాము' అని ఖర్గే అన్నారు. నవంబరు 1వ తేదీన తరువాయి 8లో



# సిఇసికి వ్యతిరేకంగా ఆందోళన విస్తరించాలి

**ఎన్‌డిఎ యేతర పార్టీలు, పౌరసంఘాలూ పాల్గొనాలి**

**వామపక్ష పార్టీలు పిలుపు**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన 'ఇండియా కూటమి' పరిధిని దాటి విస్తరించాలని వామపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. ఈ ఆందోళనలో ఎన్‌డిఎయేతర పార్టీలతో పాటు పౌర సంఘాలు, కళాకారులు, రచయితలు, ప్రముఖులు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చాయి. ఎన్నికల సంఘం పనితీ రు, సర్ నిర్వహణలో జరిగిన అవకతవకలపై ఉమ్మడి ఆందోళన కోసం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి ఇండియా కూటమి పార్టీల అగ్ర నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఐ(ఎం), ఇతర లెఫ్ట్ ఫ్రంట్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఆందోళనను తీవ్రతరం చేయాలని వామపక్షాలు కోరుకుంటున్నాయని, ఇండియా కూటమి వెలుపల ఉన్న పార్టీలు కూడా ఇందులో చేరతాయని ఆశిస్తున్నామని సిపిఐ నాయకుడు పి.సందోష్ కుమార్ అన్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తరువాయి 8లో

# సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దాం

**ఈ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం**

**ఎన్నికల్లో గెలిపిస్తే మంత్రివర్గంలో చోటు**

- సిరిసిల్ల సిరులకు నిలయం
- ఈ నేలను పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 'ఉరి'సిల్లగా మార్చింది
- అరడజను సార్లు కెటిఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపలేదు
- కరీంనగర్ జిల్లా ప్రజలు మూడుసార్లు కెసిఆర్‌ను ఎంపిగా గెలిపిస్తే పాలమూరుకు వలస వెళ్లారు
- సిరిసిల్ల బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం



**అంతకు ముందు సిరిసిల్ల వీధుల్లో మంత్రులతో కలిసి మూడు 3కిలో మీటర్లు పాదయాత్ర**



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల

'సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం. ఫిరంగులమై పేలుదాం. సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దాం. ఇదే మన ప్రతిజ్ఞ. రానున్న ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపాలి. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి. గతంలో కవిత ఓడితే వెంటనే కెసిఆర్ మండలి సభ్యురాలిని చేశారు. తెలంగాణ కోసం పోరాడిన విజయశాంతిని మండలి సభ్యురాలిని చేశా. కుటుంబ పాలన కావాలా? అధికార దర్పం కావాలా? ఆలోచించాలి. నాటి జోడీ వైఎస్, డిఎస్ అయితే ఈనాటి జోడీ రేవంత్, మహేశ్. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తాం' అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కరీంనగర్ పర్యటన అనంతరం హెలికాప్టర్‌లో సిరిసిల్లకు చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా ప్రభుత్వ కళాశాల మైదానికి చేరుకున్నారు. అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని రాజ్యాంగ నిర్మాతకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి నేతన్న చౌక్ మీదుగా ర్యాలీగా సభాస్థలి పాదం కలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి అలుపూ లేకుండా మూడుకిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ దారి పొడవునా ప్రజలకు అభివాదం చేశారు. సామాన్య కార్యకర్త నుంచి నాయకుల వరకు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వడివడిగా అడుగులూ వేస్తూ కాంగ్రెస్ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం నింపారు. మూడు కిలోమీటర్లు నడుస్తూ రగుడు బైపాస్ రంగినేని ట్రస్ట్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు. బహిరంగ సభాస్థలి వద్దే రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి తరువాయి 12లో

# 13 % లోటు

- ముగిసిన నైరుతి రుతుపనకాలం
- 2001 తర్వాత నాలుగో అత్యల్ప వర్షపాతం!
- 282 జిల్లాల్లో కరువు ఛాయలు

**న్యూఢిల్లీ :** భారతదేశంలో నైరుతి రుతుపవనాల కాలం (జూన్ –సెప్టెంబర్) అధికారికంగా ముగిసింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) విడుదల చేసిన వివరాల ప్రకారం 2026 వ ర్షాకాలం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అత్యంత నిరాశాజనకంగా ముగిసింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఈసారి వర్షాకాలంలో ఏకంగా 13 శాతం లోటు న మోదైంది. దేశంలో మొత్తం మీద చూస్తే సగటున 87 శాతం మాత్రమే వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఇక ఇది 2001 సంవత్సరం తర్వాత భారతదేశంలో వర్షాకాలంలో నమోదైన నాలుగో అత్యల్ప వర్షపాతంగా నిలిచింది. లాంగ్ పీరియడ్ యావరేజ్ (ఎల్‌పిఎ దీర్ఘ కాలం సగటు) ఆధారంగా 1971–2000 మధ్య కాలంలో సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది గణనీయంగా తగ్గుదల నమోదైంది. 'పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో వాతావరణ పరిస్థితులు దేశవ్యాప్తంగా వర్షపాతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ పరిస్థితి అక్టోబర్ డిసెంబర్ కాలంలో కూడా 100 శాతం కొనసాగే అవకాశం ఉంది. ఇంకా ఇది 2027 మార్చి వరకు ముగిసే సూచనలు కనిపించడం లేదు' అని భారత వాతావరణ శాఖ తరువాయి 8లో



## తెలంగాణలో 615 మి.మీ వర్షం

**17శాతం లోటు నమోదు**

ప్రకృతి ప్రకోపం రైతన్నల పాలిట శాపంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో 17శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30వతేదీ వరకు తెలంగాణలో 740.6 మిల్లీ మీటర్ల వర్షం కురువాల్సి ఉండగా, 615.5 మిల్లీమీటర్ల మాత్రమే కురిసింది. అత్యధికంగా జోగులాంబ గద్వాల 41 శాతం, హనుమకొండ , నారాయణపేట 35 చోప్పున, నల్లగొండ 34, ఆదిలాబాద్ , వరంగల్ 32 శాతం, వనపర్తి నాగర్ కర్నూల్ 31శాతం చోప్పున మహబూబ్ నగర్ 29, మేడ్చల్–మల్కాజ్‌గిరి, హైదరాబాద్ , భద్రాది కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాలు 27 చోప్పున ఖమ్మం 26, సూర్యపేట 23, జనగామ, యాద్రాది తరువాయి 8లో

09

## భారత్ 'గోల్డెన్ డే'

**ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు : ఆర్చరీలో హ్యాట్రిక్**



03



## జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలి

- 'ఎస్ఐఆర్' ప్రక్రియను నిలిపివేసి అర్హులైన ఓటర్లను తిరిగి చేర్చాలి
- వామపక్షాలు, టిజెఎస్, బిఆర్ఎస్, ప్రజాసంఘాలు భారీ నిరసన, అరెస్టులు

## జగన్, పవార్, మమత

# తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలి

- సర్ పేరుతో ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లు తొలగిస్తున్నారు
- కొచ్చి 'ఇండియా టుడే సౌత్ కాన్క్లేవ్'లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమే దేశానికి శ్రీరామరక్ష అని, గతంలో పార్టీని వీడి వెళ్లిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మమతా బెనర్జీ, శరద్ పవార్ సహా పాత కాంగ్రెస్ నాయకులందరూ తిరిగి రావాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. దేశంలో అన్ని వర్గాలను, మతాలను సమైక్యంగా ఉంచి అభివృద్ధి పథంలో నడిపించే విజన్ ఒక్క కాంగ్రెస్‌కే ఉందన్నారు. కాంగ్రెస్‌లో పనిచేసే నాయకులను కులం ప్రాతిపదికన చూడమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని, తామిద్దరం 100 శాతం కలిసి పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కేరళ రాష్ట్రం కొచ్చిలో బుధవారం నిర్వహించిన 'ఇండియా టుడే సౌత్ కాన్క్లేవ్' ప్రత్యేక సంభాషణలో డిప్యూటీ సిఎం పాల్గొన్నారు. భారతదేశం వంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగించడం ఎన్నికల సంఘం ప్రథమ కర్తవ్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికలు ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘందేనని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం తన నిష్పాక్షికతను నిరూపించుకోవాలన్నారు. 'ఎస్ఐఆర్' పేరు చెప్పి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు 40 వేల నుండి 50 వేల వరకు ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థ, ఎస్ఐఆర్, తెలంగాణ సంక్షేమ పథకాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, పెట్టుబడులు, కాంగ్రెస్ పార్టీతో తన అనుబంధం గురించి ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ఏ ఓటర్లు ఏ పార్టీకి మద్దతుగా ఉన్నారో ముందస్తుగా విశ్లేషించి, కేంద్రీకృత పద్ధతిలో ఫారమ్7 దరఖాస్తుల ద్వారా ప్రతిపక్ష మద్దతుదారుల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారని భట్టివిక్రమార్క ఆరోపించారు. తన సొంత నియోజకవర్గంతో పాటు మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ వంటి సీనియర్ నాయకులు, పలువురు పోటీదారుల పేర్లను కూడా ఓటర్ల జాబితాలో అనుమానాస్పదంగా ఉంచారని మండిపడ్డారు. సాధారణంగా 2,000 నుండి 10,000 స్వల్ప ఓట్ల తేడాతో తరువాయి 8లో



# గోధుమ, పప్పుధాన్యాల మద్దతు ధరల పెంపు

**ఆరు రబీ పంటలకు ఎంఎస్‌పి పెంచిన మంత్రివర్గం**

**న్యూఢిల్లీ:** వచ్చే మార్కెటింగ్ సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం గోధుమతోపాటు,పప్పుధాన్యాలు,నూనె గింజల మద్దతు ధరలను స్వల్పంగా పెంచింది.ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీ(సిసిఇఎ) బుధవారం న్యూఢిల్లీలో జరిపిన సమావేశంలో గోధుమతోపాటు మరో ఐదు ఇతర రబీ పంటలకు వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రతిపాదించిన కనీస మద్దతు ధరలకు ఆమోద ముద్ర వేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించారు.శీ తాకాలంలో గోధుమలే ప్రధానమైన రబీ పంట. దీంతోపాటు శనగలు వంటి కాయధాన్యాలు,ఎర్రకంది పప్పు, నువ్వులు,ఆవాలు,బార్లీ శీతాకాలం రబీ సీజన్‌లో ప్రధాన పంటలుగా ఉన్నాయి.వచ్చేనెల నుండి ఈ పంట నాట్లు జరుగుతాయి. 2027 ఏప్రిల్‌లో ఈ పంటలు కోతకు వస్తాయి.ఈ మార్కెటింగ్ సీజన్‌లో ఉత్పత్తుల కొనుగోళ్ళ ద్వారా రైతులకు సగటున దేశవ్యాప్తంగా ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50 శాతం లాభం వస్తుందని తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
01-10-2026
www.prajapaksham.in

# ఎడిట్
PEOPLE'S VIEWS

## అమెరికా దుర్మార్గం ఇరాన్ ప్రజలకు వైద్యం దూరం!

ఎన్ని రకాలుగా బెదిరించినా, ఎంతగా బాంబుల వర్షం కురిపించినా, లొంగని ఇరాన్‌ను దెబ్బతీయడానికి అమెరికా పాత విధానాన్నే కొత్తగా అనుసరిస్తున్నది. ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తూనే, వైద్య సౌకర్యాలు ప్రజలకు అందని ద్రాక్షగా మార్చే దుర్మార్గానికి దిగుతున్నది. అంతర్జాతీయ రాజకీయాల్లో ఆర్థిక ఆంక్షలు ఒక ఆయుధంగా మారడం కొత్త విషయం కాదు. ఒక దేశం తన విధానాలను మార్చాలని మరో దేశం కోరినప్పుడు, సైనిక దాడికి బదులుగా ఆర్థిక ఒత్తిడి పెంచడం, వాణిజ్యాన్ని అడ్డుకోవడం, బ్యాంకింగ్ లావాదేవీలను కష్టతరం చేయడం, దిగుమతులు ఎగుమతులపై ఆంక్షలు విధించడం వంటి మార్గాలు అనుసరించడం గతంలో అనేక సందర్భాల్లో కనిపించింది. దీని వెనుక ఉన్న వ్యూహం స్పష్టమే. ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచి, ప్రభుత్వంపై అంతర్గత ఒత్తిడి పెంచడం. దీనివల్ల ఆ దేశం తన విధానాలను మార్చుకునే పరిస్థితిని సృష్టించడం. కానీ, ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా చేసుకున్నప్పుడు దాని ప్రభావం కేవలం ప్రభుత్వాలపై పడదు. సాధారణంగా మొదట దెబ్బతినేది సామాన్య ప్రజల జీవనం. ముఖ్యంగా ఆహారం, ఔషధాలు, వైద్య పరికరాలు వంటి మౌలిక అవసరాలు ఆర్థిక ఒత్తిడికి గురైనప్పుడు, ఆంక్షలు ఒక రాజకీయ సాధనం నుంచి మానవీయ సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఇరాన్‌లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. అమెరికా నిర్దేశిస్తున్న షరతులను అంగీకరించేందుకు ఇరాన్ నిరాకరిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచే విధానాలు కొనసాగుతున్నాయి. నిత్యావసరాలతోపాటు, ఔషధాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొన్ని మందుల ధరలు మూడు రెట్లకు పైగా పెరిగినట్లు సమాచారం. కొన్ని మందులు ఫార్మసీలలో దొరకడం కూడా కష్టమవుతోంది. కిడ్నీ డయాలసిస్ రోగులకు అవసరమైన కొన్ని మాత్రల ధరలు ఇటీవలి నెలల్లో దాదాపు 350 శాతం పెరిగాయి. సాధారణ నొప్పి నివారణ మందులు కూడా అందుబాటులో లేని పరిస్థితులు కొన్నిచోట్ల కనిపిస్తున్నాయి. అనారోగ్యం ఒక వైపు, ఫలితంగా ఆదాయ నష్టం మరోవైపు సామాన్యుడి కుటుంబాన్ని అడకత్తెరలో ఉంచుతున్నాయి. దీనిని కేవలం ఇరాన్‌కు సంబంధించిన ఆర్థిక గణాంకంగా చూడకూడదు. అమెరికా అవలంభిస్తున్న అమానవీయ వ్యూహాలకు పతనమవుతున్న లేదా పతనం కానున్న దేశాలకు ఒక హెచ్చరికగా భావించాలి. ఇరాన్ తనకు అవసరమైన మందుల్లో 80 శాతానికి పైగా దేశీయంగా ఉత్పత్తి చేస్తుందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, ఈ ఉత్పత్తి పూర్తిగా స్వయం సమృద్ధి కాదు. ఔషధ తయారీకి అవసరమైన ముడి పదార్థాలు, రసాయనాలు, పరికరాలు, ఇతర ఫార్మాస్యూటికల్ భాగాల్లో గణనీయమైన భాగం దిగుమతులపై ఆధారపడి ఉంటుంది. అంటే ఒక దేశం 80 శాతం మందులను దేశంలోనే తయారు చేస్తున్నప్పటికీ, ఆ మందుల తయారీ గొలుసులోని కీలక భాగం విదేశాలపై ఆధారపడి ఉండవచ్చు. ఇక్కడే ఆర్థిక ఆంక్షల ప్రభావ తీవ్రత స్పష్టమవుతుంది. ఔషధాలపై నేరు గా ఆంక్షలు లేకపోయినా, బ్యాంకింగ్ ఆంక్షలు అంతర్జాతీయ లావాదేవీలను ప్రమాదకరంగా మారుస్తాయి.

ఇరాన్‌తో వ్యాపారం చేస్తే తమపై కూడా ఆంక్షలు పడవచ్చనే భయంతో బ్యాంకులు, ఔషధ కంపెనీలు, రవాణా సంస్థలు లావాదేవీల కు దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. చట్టపరంగా ఒక మందును ఇరాన్‌కు విక్రయించడానికి అనుమతి ఉన్నప్పటికీ, ఆ మందు కోసం చెల్లింపును బ్యాంకు ప్రాసెస్ చేయకపోతే ఆ చట్టబద్ధమైన అవకాశం ఆచరణలో అర్థరహితమవుతుంది. ఇదే ఆంక్షల వ్యవస్థలోని ప్రమాదకరమైన 'చిల్లింగ్ ఎఫెక్ట్'. యుద్ధ పరిస్థితుల్లో ఇరాన్‌లోని 40కుపైగా ఔషధ కర్మాగారాలు దెబ్బతిన్నాయి. వాటిలో క్యాన్సర్ చికిత్సలకు అవసరమైన ఔషధ సంస్థలు కూడా ఉన్నాయని సమాచారం. మరోవైపు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఫార్మసీలు తమ నిల్వలను పునరుద్ధరించుకోలేకపోతున్నాయి. బీమా సంస్థలు ఫార్మసీలకు చెల్లించాల్సిన బకాయిలు నెలల తరబడి పేరుకుపోతున్నాయి. కొన్ని అంచనాల ప్రకారం ఈ బకాయిలు వందల మిలియన్ల డాలర్లకు చేరాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇరాన్ ఫార్మసీ వ్యవస్థ బీటలు బారుతున్నది. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. చికిత్స గాలిలో దీపంలా మారింది. ఈ పరిణామాలను కేవలం ఇరాన్–అమెరికా రాజకీయ వివాదంగా చూడటం తప్పు. ఎందుకంటే, ఇలాంటి ఆర్థిక ఒత్తిడి వ్యూహాలు గతంలో వివిధ దేశాల విషయంలో అమలయ్యాయి. ఇప్పటికీ అమలవుతున్నాయి. ఇటీవల క్యూబాపై కొనసాగుతున్న అమెరికా విధానాలే ఉదాహరణ. ఒక దేశాన్ని తన రాజకీయ మార్గాన్ని మార్చుకునేలా చేయడానికి దాని ఆర్థిక సామర్థ్యాన్ని క్రమంగా దెబ్బతీయడమనే వ్యూహం అమలైనప్పుడల్లా, దాని మానవీయ పరిణామాలను కూడా సమాంతరంగా అంచనా వేయాల్సిన అవసరం ఉంది. దేశాల మధ్య విభేదాలు ఉండవచ్చు. భద్రతా సమస్యలు ఉండవచ్చు. అణు కార్యక్రమాలు, సైనిక వ్యూహాలు, ప్రాంతీయ రాజకీయాలు వంటి అంశాలపై కఠినమైన చర్చలు జరగవచ్చు. కానీ ఆ రాజకీయ పోరాటానికి ప్రజారోగ్యం బలికావడం ప్రపంచ వ్యవస్థకు ప్రమాదకరమైన సంకేతం. ఈ పరిస్థితుల్లో అందుకే తక్షణ చర్యలు అవసరం. ఈ దిశగా, అత్యవసర ప్రాణరక్షక మందులు, క్యాన్సర్ మందులు, డయాలసిస్‌కు అవసరమైన ఔషధాలు, ఇన్సులిన్, యాంటీబయాటిక్స్, మానసిక ఆరోగ్య మందులు, వ్యాక్సిన్లు వంటి వాటి కోసం అంతర్జాతీయ స్థాయిలో స్పష్టమైన, రక్షిత సరఫరా మార్గాలను ఏర్పాటు చేయాలి. మానవతా అవసరాల కోసం ఉద్దేశించిన చెల్లింపులను రాజకీయ ఆంక్షల నుంచి స్పష్టంగా వేరు చేసే బ్యాంకింగ్ వ్యవస్థను కల్పించాలి. అంతర్జాతీయ సంస్థలు ఇరాన్‌లో ఔషధ నిల్వలు, ధరలు, కొరతలను నిరంతరం పర్యవేక్షించాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ దేశాల నుంచి మందులు, ముడి పదార్థాలు దిగుమతి చేసుకునే మార్గాలను సులభతరం చేయాలి. ఔషధ తయారీకి అవసరమైన ముడి పదార్థాలను 'మానవతా సరుకులు'గా స్పష్టంగా గుర్తించి వాటి రవాణాకు ఎలాంటి అనవసరమైన ఆంక్షలు లేకుండా చూడాలి.

బీమా సంస్థలు, ఫార్మసీలు, ఆసుపత్రుల మధ్య ఆర్థిక చెల్లింపులు నిలిచిపోకుండా ప్రత్యేక ఆర్థిక మార్గాలు సృష్టించాలి. ఆర్థిక ఆంక్షల లక్ష్యం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమేనని అమెరికా వాదిస్తుండవచ్చు. కానీ ఆ ఒత్తిడి చివరకు ప్రజల ప్రాణాలపై పడితే, అది, అంతర్జాతీయ మానవతా వ్యవస్థకు ఎదురయ్యే సవాలుగా మారుతుంది. ఇరాన్‌లో తీవ్రమవుతున్న మందుల కొరత, ధరల పెరుగుదల ప్రపంచానికి ఒక హెచ్చరిక. రాజకీయ విభేదాలకు పరిష్కారాలు వెతుక్కోవచ్చు. చర్చలు విఫలమైతే కొత్త చర్చలకు మార్గాలు తెరవచ్చు. ప్రజల జీవితాలతో చెలగాటాలు ఆడడం వల్ల మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఇలాంటి అకృత్యాలకు, దుర్మార్గాలకు పాల్పడుతున్న అమెరికాపై ప్రపంచ దేశాలు ఒత్తిడి పెంచాలి. ఇరాన్, క్యూబా వంటి దేశాలపై ఆర్థికపరమైన ఆంక్షల పేరుతో, ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టే ప్రయత్నాలను ఆపాలి. నేటి ఇరాన్ సమస్య రేపు ప్రపంచ సమస్యగా మారడం ఖాయమని ప్రతి దేశం గుర్తించాలి. స్పందించాలి. ఇరాన్, క్యూబాలకు అండగా నిలవాలి. ●



### జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**జ్ఞానేశ్ కుమార్ ఒక దొంగ... ఆయన వెంటనే రాజీనామా చేయాలి. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఉద్యమం భూమి నుండి ఆకాశాన్ని అంటుతుంది. వారు(బిజెపి) బెంగాల్‌లో ఎన్నికలను దోచుకున్నారు. మేము ఇసిఐ, సుప్రీంకోర్టుకు వెళ్ళాము. ఏమీ తప్పు లేకపోతే, ఇవిఎంలను ఎందుకు ధ్వంసం చేశారు? ఎన్నికల ప్రక్రియను తారుమారు చేయడానికి సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి, ఉపయోగించారని మేము నమ్ముతున్నాము. ఇండియా బ్లాక్ చాలా ఐక్యంగా ఉంది. మేము పోరాడతాము. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి కృషి చేస్తాం. ఇది మా వాగ్దానం.**

– టిఎంసి అధినేత్రి మమతాబెనర్జీ




## అన్ని దానాలలో కెల్లా రక్త దానం మిన్న

రక్తదానం ప్రాణదానంతో సమానం. అత్యవసర సమయాలలో శస్త్రచికిత్స సమయంలో రక్తం అవసరం ఉంటుంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందక చనిపోయిన వారు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 1వ తేదీన జాతీయ స్వచ్ఛంధ రక్తదాన దినోత్సవంగా జరుపుకుంటారు. 1975 సంవత్సరంలో స్వరూప కృష్ణన్, డా.జె.జి.జొలిల చొరవతో ఈ రక్త దాన దినోత్సవం ప్రారంభం అయినది. రక్త దానం చేయాలని ప్రోత్సహిస్తూ రక్తదానం ఆవశ్యకతను తెలియ పరచడం రక్తదాన దినోత్సవం ప్రాముఖ్యతగా చెప్పవచ్చు.

**రక్త దానం ఎవరు చేయవచ్చు:** ప్రతి ఆరోగ్యవంతుడిలో సుమారు 5 నుండి 6 లీటర్ల రక్తం ఉంటుంది 18 సంవత్సరా ల నుండి 65 సంవత్సరాల లోపు ఉన్న ఎవరైనా రక్తదానం చేయడానికి అర్హులు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు సుమారు అనగా సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చు. 45 కిలోల బరువు పైన ఉన్న వారు మాత్రమే రక్త దానం చేయడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా ఒక వ్యక్తి నుండి రక్తదాత 350 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. రక్త దానం చేసే వ్యక్తిని వైద్యుల సంరక్షణలో కొన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. హైపటైటిస్ బి, హెచ్ ఐవి, రక్తహీనత , బలహీనత, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో, బాధపడేవారు రక్తదానం చేయడానికి అనర్హులు. ఒకవేళ తెలియక చేసి రక్తం ఉపయోగపడదు. రక్తదానం చేసిన వారికి పూర్తిస్థాయిలో రక్తం 21 రోజుల్లో తిరిగి ఉత్పత్తి అవుతుంది. రక్తంలో మొత్తం ఎనిమిది గ్రూపులు ఉన్నాయి. 4 నెగటివ్ గ్రూపులు, నాలుగు పాజిటివ్ గ్రూపులు. రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జిఓ నెంబర్ 184 ద్వారా ఆ రోజు స్పెషల్ క్యాజువల్ మంజూరు చేయబడుతుంది. ప్రపంచంలో అధిక మొత్తంలో 'ఒ'పాజిటివ్ వారే అధికంగా ఉన్నారు. ఒక యూనిట్ సుమారు 500 మిల్లీలీటర్లు రక్తంతో మూడు నిండు ప్రాణాలు కాపాడవచ్చు. రక్త దానం చేసే వారు మిగతా వారికన్నా చాలా చురుకుగా ఆరోగ్యంగా ఉంటారు. రక్త గ్రూపులు దేశవ్యాప్తంగా వాని శాతం ఓ పాజిటివ్ 46%, ఏ పాజిటివ్ 37శాతం, బి నెగిటివ్ 8శాతం, ఎ నెగిటివ్ 4 శాతం, నెగిటివ్ 2%, ఏ బి నెగిటివ్ ఒక శాతం. ఒక శాతం ఎబి పాజిటివ్. ఒక శాతం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రెడ్ క్రాస్ అనే అంతర్జాతీ య సంస్థ, మరియు ఆయా జిల్లాల ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న రక్తనిధి కేంద్రాలు అధిక సంఖ్యలో రక్తాన్ని సేకరిస్తున్నా యి. ప్రతి ఏటా వందలాది రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ వేల యూనిట్ల రక్తం సేకరిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాలలో రక్తదాన కేంద్రాలు ఉన్నాయి. అనేకమంది తమ జన్మదినాలు, పెళ్లి రోజును పురస్కరించుకొని కూడా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తమ మిత్రులు, బంధువులు, సన్నిహితుల ద్వారా రక్తాన్ని సేకరిస్తున్నారు. బ్లడ్ బ్యాంకులకు అందజేస్తూ తమ దాతృత్వంతో, ఉదారతను చాటుతున్నారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులలో కల్తీ రక్తమును విక్రయిస్తున్నట్లు కూడా వార్తలు వినవస్తున్నాయి. రెడ్ క్రాస్, ప్రభుత్వ రక్త నిధి కేంద్రాలలో నామమాత్రపు డబ్బులతో రక్తాన్ని విక్రయిస్తున్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కొరవడింది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కరపత్రాలు, గోడ పత్రికలు, సదస్సుల ద్వారా గ్రామ ప్రజలు యువతలో, మహిళా సంఘాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.

కామిడి సతీష్ రెడ్డి, 9848445134
75 సార్లు స్వచ్ఛంద రక్తదాత,
ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీత

(అక్టోబర్ 1వ జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా)

# భారతదేశ 'సెక్యులర్' భావనను తిరగరాసే ప్రయత్నం



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

లౌకికవాదం (సెక్యులరిజం)పై ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భాగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు స్పష్టమైన జవాబు అవసరం. సెక్యులరిజం ''ఆధునిక భావన'' అని, రాజకీయ – మత అధికారం మధ్య పశ్చిమదేశాల్లో ఘర్షణలో దాని మూలాలు ఉన్నాయని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ అన్నారు. దాన్ని భారతీయ సర్వ–పంత్–సమభావనతో పోల్చి, ఈ భావనను భిన్న విశ్వాసాలకు సమాన గౌరవం ఇచ్చే సాంప్రదాయక సూత్రంగా అభివర్ణించారు. ధర్మ అనేది భారతీయ సామాజిక నడవడికలో, నాగరికతలో పాదుకుని ఉందంటూ దాన్నే హిందూ అని ఆయన వాదించారు.

ఈ వాదనం కేవలం పదజాలంలో వ్యత్యాసం కాదు. ఆర్‌ఎస్‌ఎస్ నిలకడగా హిందూ రాష్ట్ర (దేశం) భావనను ముందుకు తెస్తున్నందున దానికి రాజకీయ పర్యవసానాలున్నాయి. ''భారతీయులందరూ హిందువులు, హిందువులంటే భారతీయులని'' భాగవత్ స్వయంగా చెప్పారు. దీన్ని అనుసరించి ఒక ప్రశ్న అనివార్యంగా వస్తుంది. ప్రతి ఒక్కరూ హిందువు అని నిర్వచించబడితే, భారత పౌరుని మత లేదా నాగరికత గుర్తింపును నిర్వచించే అధికారం ఎవరికి ఉంది? అటువంటి గుర్తింపు ఏదైనా ఆమోదించటంపై పౌరసత్వం ఆధారపడిఉండదన్న రాజ్యాంగ సూత్రం ఏమి కావాలి?

స్వాతంత్ర్య ఉద్యమం ఇచ్చిన జవాబు ప్రాథమికంగా భిన్నమైంది. గాంధీజీ సెక్యులరిజాన్ని దిగుమతి చేసుకున్న పశ్చిమ ఫార్ములాగా పరిగణించలేదు. తాను నిర్మించదలచుకున్న భారతదేశం గూర్చి రాస్తూ ఆయన స్పష్టంగా చెప్పారు : ''రాజ్యం పూర్తిగా సెక్యులర్‌గా ఉంటుంది''. దీన్ని ఆయన చట్టం ముందు సమానత్వం, వ్యక్తిగత మతస్వేచ్ఛతో సంధానించారు. ఆవిధంగా ''పౌరులందరూ చట్టం అనే నేత్రం ముందు సమానంగా ఉంటారు'' అని ఆయన రాశారు. రాజ్యం జోక్యం లేకుండా ప్రతి వ్యక్తీ ఉమ్మడి చట్టానికి లోబడి అతని లేక ఆమె మతాన్ని అనుసరించే స్వేచ్ఛ కలిగి ఉంటాడు.

**గాంధీజీ:** హిందూ రాష్ట్ర అంశంపై గాంధీకి ఎంతో స్పష్టత ఉంది. ''యూనియన్ మత రాజ్యంగా ఉండాలా, హిందూమత ఆదేశిక సూత్రాలను హిందూయేతరులపై విధించాలా? అని ఆయన అడిగారు. ''నేను అలా కాదని ఆశిస్తున్నాను''. కాని భాగవత్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నది కచ్చితంగా అదే. గాంధీజీ తాను ఊహిస్తున్న భారతదేశాన్ని ''లౌకిక, ప్రజాతంత్ర రాజ్యం''గా తలపెట్టారు. అమూర్తమైన తాత్విక చర్యగా ఆ విషయం చెప్పలేదు. దేశ విభజన, మతహింస నేపథ్యంలో ఆయన మాట్లాడారు. మత గుర్తింపును రాజకీయ సమీకరణకు ప్రాతిపదికగా మార్చితే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో ఆయన చూశారు. ఆ సంక్షోభానికి ఆయన సమాధానం హిందూ రాజ్యాన్ని నెలకొల్పి, అప్పుడు మిమ్మల్ని సహిస్తామంటూ మైనారిటీలకు హామీ ఇవ్వటం కాదు. విశ్వాసం ఏమైనప్పటికీ, సమానత్వం ఆయన ధ్యేయం.

**నెహ్రూ :** నెహ్రూ వైఖరి కూడా అంతే సూటిగా ఉంది. హిందుత్వ ఉన్మాది చేతిలో గాంధీజీ హత్యచేయబడిన కొద్ది రోజుల తర్వాత1948 ఫిబ్రవరి 2న, హిందూ రాష్ట్రం కోసం డిమాండ్‌ను, దాని చుట్టూ ఆవహించివున్న మతతత్వ వాతావరణాన్ని ఆయన ఎదుర్కొన్నారు. మత రాజకీయాల భయంకర పర్యవసానాలను దేశం అప్పుడే అనుభవించి ఉన్నందున, ఆ క్షణంలో ఆయన చెప్పిన మాటలు గుర్తుచేసుకోవటం ఎంతో విలువైనది: ''మేము సెక్యులర్ రాజ్య నిర్మాణాన్ని తలపెడుతున్నాం. అందులో ఒక సముదాయం (కమ్యూనిటీ) లేదా గ్రూపు లేదా పార్టీ ఇతరుల హక్కులను హరించటం అనుమతించబడదు''. నెహ్రూ దానిని కేవలం మత సహిష్ణుతగా కాకుండా రాజకీయ అధికారం సమస్యగా అవగాహన చేసుకున్నారు. భారతదేశం భిన్న విశ్వాసాలకు చెందిన పౌరులను కలిగి ఉన్నందున సెక్యులర్ రాజ్యం అవసరమని ఆయన వక్కాణించారు. వారి హక్కులు వారివారి సముదాయాల సంఖ్యాబలంపై ఆధారపడి ఉండవన్నారు. మరో ప్రకటనలో ఆయన స్పష్టంగా ఇలా చెప్పారు : భారత దేశం ఒక ''సెక్యులర్, మతరహిత, ప్రజాతంత్ర రాజ్యం''గానే రూపకల్పన చేయబడుతుంది. ''అందులో ప్రతిఒక్కరికీ, అతను ఏ మతానికి చెందినప్పటికీ, సమాన హక్కులు, అవకాశాలు ఉంటాయి''.

ఆ చారిత్రక సందర్భం ఆర్‌ఎస్‌ఎస్ వాదన నిలబడటాన్ని కష్టతరం చేసింది. మతోన్మాద జాతీయవాదం వినాశక పర్యవసానాలను దేశవిభజన అప్పుడే చాటిచెప్పింది. అయినా నవభారత నిర్మాతల ప్రతిస్పందన మెజారిటీ మతం నిర్వచించిన రాజ్యాన్ని నిర్మించటం కాదు. వారు చాలా కఠినమైన రాజ్యాంగ సూత్రాన్ని ఎంచుకున్నారు : రాజ్యం భిన్న విశ్వాసాలకు చెందిన పౌరులకు సమానంగా చెందుతుంది.

**అంబేద్కర్:** రాజ్యాంగ రూపకల్పనకు బాధ్యతవహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వైఖరి కూడా నిర్ణయాత్మకం. రాజ్యాంగం ద్వారానే ఈ సూత్రానికి వ్యవస్థాగత రూపం ఇవ్వబడింది. రాజ్యాంగ అసెంబ్లీ చర్చల సమయంలో మతం, రాజ్యం సమస్య పదేపదే లేవనెత్తబడింది. మత రాజ్యం భావనను అంబేద్కర్ దృఢంగా తిరస్కరించారు. అంబేద్కర్ ఉత్తరోత్తరా హిందూ కోడ్ బిల్లుపై చర్చ సందర్భంలో చాలా కచ్చితమైన నిర్వచనం ఇచ్చారు. సెక్యులరిజానికి అర్థం మతాన్ని రద్దు చేయటం అనే వాదనను ముందుగా ఆయన తిరస్కరించారు. ''మేము మతాన్ని రద్దు చేయగలం అని దాని అర్థం కాదు'', లేదా మత మనోభావాలను అలక్ష్యం చేస్తామని కూడా దాని అర్థం కాదు. అప్పుడు రాజ్యాంగ పరిమితిని ఆయన చెప్పారు. ''సెక్యులర్ రాజ్యం అంటే పూర్తి అర్థం ఒక నిర్ధిష్టమైన మతాన్ని మిగతా ప్రజలపై విధించటానికి ఈ పార్లమెంటుకు అధికారం లేదు''.

ఆ నిర్వచనం సెక్యులరిజాన్ని భారతదేశానికి విదేశీయమైనదిగా తిరస్కరించే ప్రయత్నంలోని బలహీనతను బహిర్గతం చేస్తోంది. అంబేద్కర్ భారతదేశ సమస్యకు ఐరోపా పరిష్కారాన్ని దిగుమతి చేయటంలేదు. భారతదేశ పరిస్థితికి ఆయన సమాధానం చెబుతున్నారు : వేర్వేరు మతాలు కలిగి ఉన్న, ఏ మతం లేని ప్రజలు కలిగి ఉన్న సమాజంపై రాజ్యం అధికారాన్ని ఎలా వినియోగించాలి? ఆయన సమాధానం సూటిగా ఉంది: రాజ్యం ఒక మతాన్ని విధించజాలదు.

**భగత్‌సింగ్ :** భగత్‌సింగ్ మరో దిశ నుంచి ఈ ప్రశ్నను పరిశీలించారు. నాస్తికుడు, విప్లవకారునిగా ఆయన రాజ్యం తటస్థతను మించి ముందుకెళ్లారు. మత అథారిటీ హేతువాద పరీక్షకు లోబడి ఉండాలన్నారు. 'నేను ఎందుకు నాస్తికుణ్ణి అయ్యాను' అన్న రచనలో ప్రత్యేక సదుపాయాలకు, ఉన్నత స్థానాలకు చట్టబద్ధత కల్పించేందుకు మత సిద్ధాంతాలను చారిత్రకంగా ఉపయోగించిన తీరును విమర్శించారు. ''ప్రత్యేక సదుపాయాలు పొందుతున్నవారు'' తాము ''గుంజుకున్న అధికారం, సంపదలు, ఆధిపత్యం'' సమర్థించుకునేందుకు మతసిద్ధాంతాలు సృష్టించారని ఆయన రాశారు. విమర్శనారహితంగా మత అథారిటీని ఆమోదించకూడదని హెచ్చరిక చేశాడు, ''నిర్దాక్షిణ్యమైన విమర్శ, స్వతంత్ర ఆలోచనను'' వక్కాణించాడు.

> **మతతత్వ రాజకీయాలు ఉమ్మడి సమస్యల నుండి దృష్టిని మళ్లించి, అస్థిత్వం, మతపరమైన అనుబంధం వంటి ప్రశ్నల వైపు మళ్లిస్తాయి. ఎవరు హిందువు, ముస్లిం లేదా క్రైస్తవుడు అనే దాని చుట్టూ రాజకీయాలు ఎంత ఎక్కువగా కేంద్రీకృతమైతే, కార్మికులుగా, రైతులుగా, విద్యార్థులుగా, మహిళలుగా, యువతగా, సాధారణ పౌరులుగా తాము పంచుకునే విషయాల చుట్టూ సంఘటితం కావడానికి పౌరులకు అంత తక్కువ అవకాశం ఉంటుంది.**

ఇది ఆర్‌ఎస్‌ఎస్ వారి హిందూ రాష్ట్ర ప్రాజెక్టుతో ప్రాసంగికమైనది. హిందూ మతాన్ని గౌరవించటమనేదే సమస్య కాదు. ఇతర ప్రతిఒక్క మతంలో వలె హిందూ మతంలో కూడా అనేక సంప్రదాయాలు, భాష్యాలున్నాయి. రాజకీయమైన ప్రశ్న ఏమంటే, హిందూ నాగరికత, చరిత్ర గూర్చి అత్యంత సంకుచితమైన భాష్యం భారతరాజ్య నిర్మాణ సూత్రం కావలెనా? అదీ ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశం. హిందూ రాష్ట్ర అంశాన్ని హిందుత్వ పర్యావరణం చారిత్రకంగా సమర్థిస్తున్న నిమ్నోన్నత సామాజిక వ్యవస్థ సరసనపెట్టి పరీక్షించినపుడు ప్రశ్న మరింత పదునుదేరుతుంది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాపంచిక దృక్పథం, భావజాలం పూర్తిగా తిరోగమన భావాలతో నిండి వుంది. అసమానతను శాశ్వతం చేయటం, మహిళాద్వేషం, మతోన్మాదం ఆ భావాల్లో ఉన్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ ఐక్యత గూర్చి మాట్లాడుతుంది. కాని న్యూనతపరిచే కులవివక్షను, అంటరానితనాన్ని ఎదుర్కోదు. మహిళల సమానత్వం సమస్య కూడా అంతే ప్రాముఖ్యతగలది, కాని వారిని గృహానికే పరిమితం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటోంది. రాజ్యాంగబద్ధ రిపబ్లిక్ సమానత్వంపై ఆధారపడి ఉంటుంది. కులం, లింగం ప్రాతిపదికపై భిన్నమైన హక్కులు, విధులు లేదా హోదా అప్పగించే సామాజిక, మత సంప్రదాయాలు అక్కడ పౌరసత్వం నిర్ణయించేందుకు అనుమతించబడవు.

అంబేద్కర్ సొంత రాజకీయ పోరాటం కూడా కచ్చితంగా అటువంటి వారసత్వ ఉన్నత దొంతర్లపైనే ఎక్కుపెట్టబడింది. ఆయన రాజ్యాంగ వ్యవస్థ సమానత్వం, స్వేచ్ఛ, నిమ్నోన్నత సామాజిక హోదాల తిరస్కరణ నుంచి వేరుచేయలేనిది. ఆయన ప్రతిపాదించిన హిందూ కోడ్ బిల్లు ఇతర విషయాలతోపాటు వివాహం, వారసత్వం, ఆస్తి విషయాల్లో హిందూ మహిళ లీగల్ స్థితిని సంస్కరించటానికి ఉద్దేశించింది. ఆ సంస్కరణలకు వచ్చిన ప్రతిఘటన మత, సామాజిక అథారిటీని ప్రజాస్వామిక శాసనానికి అతీతంగా ఎందుకు ఉంచరాదో నిరూపించింది.

**ఆర్‌ఎస్‌ఎస్ మాటల గారడీ:** అందుకే, 'సర్వ – పంత్ – సమభావ' (అన్ని మతాల పట్ల సమాన భావన) అనే సూత్రానికి నైతిక విలువ ఉన్నప్పటికీ, అది మైనారిటీల పట్ల ఆర్‌ఎస్‌ఎస్‌కు ఉన్న తృణీకరణ భావాన్ని, ద్వేషాన్ని కప్పిపుచ్చలేదు. మతాల మధ్య సమాన గౌరవం ఉండటం వాంఛనీయమే అయినప్పటికీ, రాజ్యాంగం ఒక క్లిష్టమైన ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. జాతీయ అస్థిత్వానికి సంబంధించిన మతపరమైన భావనను రాజ్యం విధించవచ్చునా లేదా దానికి ప్రాధాన్యత ఇవ్వవచ్చునా? దీనికి అంబేద్కర్, గాంధీ, నెహ్రూల సమాధానం, 'కాదు' అనే ఉంటుంది.

విశాలమైన నాగరికతా కోణంలో ప్రతి ఒక్కరూ హిందువులే అని ప్రకటించడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ ఆ ప్రశ్న నుంచి తప్పించుకోలేదు. భారతదేశంలో సమాన స్థానాన్ని పొందేందుకు ఒక ముస్లిం పౌరుడు తన అస్థిత్వం గురించి మరొకరు చెప్పే నిర్వచనాన్ని అంగీకరించాల్సిన అవసరం లేదు. క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన లేదా నాస్తిక పౌరుల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. సమాన పౌరసత్వాన్ని కల్పించే ముందు పౌరులు ఒక ఉమ్మడి మతానికి చెంది ఉండాలని రాజ్యాంగం ఎక్కడా అడగదు. అలాగే ఎవరైనా ఏ వర్గానికి చెందినవారో నిర్ధారించే ధృవీకరణ పత్రాలను జారీచేసే అధికారాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇవ్వదు. కాబట్టి, రాజ్యాంగబద్ధమైన లౌకికవాదానికి, 'హిందూ రాష్ట్ర' భావనకు మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఉంది. లౌకికవాదం పౌరుడితో మొదలై, మతంతో సంబంధం లేకుండా సమానత్వాన్ని హామీ ఇస్తుంది. కానీ 'హిందూ రాష్ట్ర' భావన దేశం యొక్క మతపరమైన నిర్వచనంతో మొదలై, ఆ నిర్వచనం పరిధిలో వివిధ మతపరమైన అస్థిత్వాలను ఉంచుతూ, ఒకదానిని మరొకదాని కంటే ఎక్కువగా ప్రాధాన్యతనిస్తుంది. ఇవి రెండూ ఒకే భావనకు సంబంధించిన పదాలు కావు. భారత్ ఇప్పటికే హిందూ రాష్ట్రమని భాగవత్, ఆర్‌ఎస్‌ఎస్ పదే పదే చేస్తున్న వాదనలను, రాజ్యాంగ పరిషత్తులో డాక్టర్ అంబేద్కర్ చేసిన హెచ్చరిక కోణంలో చూడాలి.'ఒకవేళ హిందూ రాజ్యం నిజంగా ఏర్పడితే, అది నిస్సందేహంగా ఈ దేశానికి అత్యంత పెద్ద విపత్తుగా మారుతుంది'అని ఆయన అన్నారు.

దేశంలో లౌకికవాదాన్ని ప్రశ్నిస్తూనే, విదేశాలలో భారతదేశ వైవిధ్యం గురించి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మాట్లాడినపుడు ఈ వైరుధ్యం మరింత స్పష్టమవుతుంది. వైవిధ్యం అంటే వివిధ వర్గాలు ఒకే మతపరమైన సాంస్కృతిక అస్థిత్వంలో విలీనమైన తర్వాతే స్వాగతించబడటం అని అర్థం కాదు. నిజమైన రాజ్యాంగబద్ధమైన బహుళత్వం అంటే, పౌరులు తమ ప్రత్యేక అస్థిత్వాలను పరిరక్షించుకుంటూనే సమాన హక్కులను అనుభవించేలా చూడటం. కాబట్టి, ఆర్‌ఎస్‌ఎస్ చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా, భారతదేశం ముందున్న అవకాశం విదేశీ లౌకికవాదానికీ, స్వదేశీ సంప్రదాయానికీ మధ్య ఎంపిక చేసుకోవ డం కాదు. భారతదేశం తన సుదీర్ఘ సహజీవన సంప్రదాయాల నుండి స్ఫూర్తి పొందుతుంది, పొందాలి కూడా. కానీ గణతంత్రానికి సాంస్కృతిక సహనం కంటే మరింత నిర్దిష్టమైన అవసరం ఉంది. దానికి సమాన పౌరసత్వం, అంతరాత్మ స్వేచ్ఛ, మతాన్ని విధించలేని రాజ్యం అవసరం.

భారతీయులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలు ఈ వ్యత్యాసాన్ని మరింత కొట్టొచ్చినట్లుగా చేస్తాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సరిపోయే స్థాయిలో లేని ప్రభుత్వ విద్య, బలహీనమైన ఆరోగ్య సంరక్షణ, అభద్రత వంటివి అన్ని మత సముదాయాల పౌరులను ప్రభావితం చేస్తున్నాయి.

మతతత్వ రాజకీయాలు ఈ ఉమ్మడి సమస్యల నుండి దృష్టిని మళ్లించి, అస్థిత్వం, మతపరమైన అనుబంధం వంటి ప్రశ్నల వైపు మళ్లిస్తాయి. ఎవరు హిందువు, ముస్లిం లేదా క్రైస్తవుడు అనే దాని చుట్టూ రాజకీయాలు ఎంత ఎక్కువగా కేంద్రీకృతమైతే, కార్మికులుగా, రైతులుగా, విద్యార్థులుగా, మహిళలుగా, యువతగా, సాధారణ పౌరులుగా తాము పంచుకునే విషయాల చుట్టూ సంఘటితం కావడానికి పౌరులకు అంత తక్కువ అవకాశం ఉంటుంది.

స్వాతంత్ర్య ఉద్యమం ఒక మతపరమైన రాజ్యాన్ని స్థాపించేందుకు ప్రాణాలను బలిదానం చేయలేదు. గాంధీ హిందూ రాజ్యాన్ని స్పష్టంగా తిరస్కరించారు. నెహ్రూ స్పష్టంగా లౌకిక రాజ్యాన్ని కోరుకున్నారు. భగత్ సింగ్ రాజకీయ, మేధోపరమైన లొంగుబాటుకు మతపరమైన అధికారాన్ని ప్రాతిపదికగా తిరస్కరించారు. పార్లమెంటు ప్రజలపై మతాన్ని రుద్దలేదని అంబేద్కర్ నొక్కి చెప్పారు. 1976లో రాజ్యాంగ పీఠికలో 'లౌకికత' అనే పదాన్ని చేర్చినప్పటికీ, ఈ రాజ్యాంగ సూత్రం చాలా పురాతనమైనది. ఇది అప్పటికే సమానత్వం, అంతరాత్మ స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, ప్రభుత్వ అధికారాలపై ఉన్న పరిమితులలో అంతర్లీనంగా ఉంది.

లౌకికవాదం దేశానికి పరాయిదని సూచించడానికి ఆర్‌ఎస్‌ఎస్ భారతదేశ స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ నిర్మాణ చరిత్రను తిరగరాయలేదు. రికార్డులు దీనికి విరుద్ధంగా చెబుతున్నాయి. ముఖ్యమైన ప్రశ్న చాలా సులభం. భారతదేశం ప్రతి పౌరుడికి సమానంగా చెందుతుందా, లేక పౌరులు ముందుగా దేశానికి సంబంధించిన మతపరమైన నిర్వచనాన్ని అంగీకరించాల్సి ఉంటుందా? గాంధీ, నెహ్రూ, భగత్ సింగ్, అంబేద్కర్ తమ సమాధానాన్ని ఇచ్చారు. అది లౌకిక ప్రజాస్వామ్యం, సమాన పౌరసత్వం, అంతరాత్మ స్వేచ్ఛ. స్వాతంత్ర్య పోరాట రోజుల నుండి ఆర్‌ఎస్‌ఎస్ వీటిని తిరస్కరిస్తూనే ఉంది. మాటల గారడీని పక్కన పెడితే, ఒక లౌకిక, ప్రజాస్వామ్య దేశంలో భారతీయుడిగా ఉండటమంటే ఏమిటో పునర్నిర్వచించడానికి ఆర్‌ఎస్‌ఎస్‌ను అనుమతించకూడదు.

## రబీకి ముందే రైతును భయపెడుతున్న ఎరువుల ధరలు

దేశానికి అన్నం పెట్టే రైతాంగంపై మరొకసారి భౌగోళిక రాజకీయాల నెపంతో తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడబోతోంది. రాబోయే యాసంగి (రబీ) సాగు కాలం అతి సమీపంలోకి ముంచుకొస్తున్న తరుణంలో, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగే సూచనలు కనిపిస్తుండటం దేశవ్యాప్తంగా సాగుదారులలో తీవ్ర దిగ్భ్రాంతిని, ఆందోళనను కలిగిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న సుదీర్ఘ ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, ఎర్రసముద్ర మార్గంలో నౌకా రవాణాపై తలెత్తిన తీవ్ర అంతరాయాల వల్ల అంతర్జాతీయంగా ఎరువుల తయారీకి అవసరమయ్యే ప్రాథమిక ముడిసరుకుల ధరలు నింగినంటుతున్నాయి.దీని ప్రభావంతో భాస్వరం, నత్రజని, గంధకం, పొటాష్ వంటి ప్రాథమిక రసాయనిక ఎరువుల లభ్యతపై తీవ్ర నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

అంతర్జాతీయ పణ్యాలలో ముడిసరుకుల ధరలు పెరగడం లేదా సముద్ర రవాణా రుసుములు హఠాత్తుగా అధికమవడం పరిపాటిగా మారిన ఈ రోజుల్లో, ముందస్తు ప్రణాళికలతో దిగుమతులను సమర్థవంతంగా క్రమబద్ధీకరించుకోవడంలో కేంద్ర పరిపాలనా యంత్రాంగం దారుణంగా విఫలమైంది. రబీ సీజన్ ప్రారంభంలో గోధుమ, శనగ, ఆవాలు, యాసంగి వరి, ఇతర వాణిజ్య పంటలు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతాంగం, మరోసారి రసాయనిక ఎరువుల బస్తాల కోసం ప్రాథమిక సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల ముందు అర్ధరాత్రి నుంచి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితిని కేంద్రమే స్వయంగా కొనితెచ్చింది. ఇప్పటికే ఇంధన ధరల పెంపు, నాణ్యమైన విత్తనాల కొరత, క్రిమిసంహారక మందుల అపారమైన వ్యయం వల్ల ఎకరానికి సాగు ఖర్చు రెట్టింపైంది. దీనికితోడు తాము పండించిన పంటలకు సరియైన సమయానికి మద్దతు ధర దక్కక, ప్రకృతి వైపరీత్యాల వేళ పరిహారం అందక రైతాంగం రోజురోజుకూ అప్పుల అగాధంలోకి కూరుకుపోతోంది. ఇటువంటి తీవ్ర సంక్షోభ సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన వ్యయ భారాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించి, రైతులకు ఎలాంటి కొరత లేకుండా రాయితీ ధరలకే సకాలంలో ఎరువులు అందించాల్సిన గురుతర బాధ్యత కేంద్ర సర్కారుపై ఉంది.

రెండోవైపున, దేశీయంగా సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్తున్న మాటలు కేవలం ప్రచార ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించేలా రైతులకు నమ్మకమైన ప్రత్యామ్నాయాలను అందించడంలోనూ, భూసార పరిరక్షణకు తగిన పథకాలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయడంలోనూ కేంద్రం ఘోరంగా విఫలమైంది. ఫలితంగా, ప్రతీ సాగు సీజనుకు ముందు అంతర్జాతీయ మార్కెట్ల దయాదాక్షిణ్యాలపై మన రైతాంగం ఆధారపడాల్సి వస్తోంది. ఇది భారతీయ వ్యవసాయ రంగాన్ని స్వయంసమృద్ధి వైపుకాక, నిరంతర పరపరాధీనత వైపు నడిపిస్తోంది.

రబీ సీజన్ ఉధృతంగా ప్రారంభమయ్యేలోగా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, అంతర్జాతీయంగా ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను అన్వేషించాలి. ఎరువుల తయారీ కంపెనీలపై ఒత్తిడి తెచ్చి ధరలను అదుపులో ఉంచాలి. రైతులకు అవసరమైన అత్యవసర నిల్వలను తక్షణమే జిల్లాల వారీగా పెంచి, రాయితీ ధరలకే నేరుగా అందుబాటులోకి తెచ్చి, వ్యవసాయ రంగాన్ని రక్షించాల్సిన అత్యవసర బాధ్యత కేంద్రంపైనే ఉంది.

వెంకగారి భూమయ్య, 9848559863

# జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలి

**‘ఎస్ఐఆర్’ ప్రక్రియను నిలిపివేసి అర్హులైన ఓటర్లను తిరిగి చేర్చాలి**
**ఎస్ఇసి కార్యాలయం వరకు వామపక్షాలు, టిజెఎస్, బిఆర్ఎస్, ప్రజాసంఘాలు భారీ నిరసన, అరెస్టులు**








ప్రజాపక్షం/ హైదరాబాద్: ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన డిమాండ్లతో వామపక్షాలు, టిజెఎస్, బిఆర్ఎస్, ప్రజాసంఘాలు కదం తొక్కాయి. ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం వరకు జరిగిన భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. కార్యాలయం వద్దకు చేరుకునేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని, ఎస్ఐఆర్‌ను నిలిపివేసి తొలగించిన అర్హులైన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అనంతరం వామపక్షాలు, టిజెఎస్, బిఆర్ఎస్, ప్రజాసంఘాలతో కూడిన ప్రతినిధుల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన ర్యాలీలో టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయ్‌లక్ష్మి పండిత్, పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు ఎల్.రమణ, వామపక్ష నేతలు గుమ్మడి నర్సయ్య, ప్రసాద్, సి.హెచ్.మురహరి, జానకి రాములు, రమేశ్ రాజాలతో పాటు వామపక్ష, ప్రజాసంఘాల ముఖ్యనాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఢిల్లీ కేంద్రీకృతంగా ఓట్ల తొలగింపు : ప్రొఫెసర్ కోదండరామ్**

ఓటర్ల జాబితా ప్రక్రియను కేంద్రీకృతం చేసి ఢిల్లీ నుంచే ఇష్టానుసారంగా ఓట్ల తొలగింపులు, చేర్పులు జరుగుతున్నాయని ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందన్నారు. ఎన్నికల కమిషన్ సభ్యుల ఎంపిక, కమిషన్ నిర్మాణం, పని విధానం కూడా చట్టప్రకారం ఉండాలని అన్నారు.

**ఓటు హక్కు పరిరక్షించుకోవాల్సిన సమయం : పశ్యపద్మ**

రాజ్యాంగాన్ని, ఓటు హక్కును పరిరక్షించాల్సి కేంద్ర ఎన్నికల సంఘమే నిసిగ్గుగా పెద్ద సంఖ్యలో ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నం చేస్తోందని పశ్య పద్మ విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించడం, మరోవైపు అనర్హులైన ఓట్లను చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ రాజకీయ ఒత్తిళ్లకు లోగకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు.

**కోట్లాది ఓటర్లను అనర్హులుగా చూపించే కుట్ర : జాన్ వెస్లీ**

ఎస్ఐఆర్ పేరుతో దేశంలోని కోట్లాది ఓటర్లను అనర్హులుగా చూపించే పరిస్థితి ఏర్పడుతోందని జాన్ వెస్లీ విమర్శించారు. తెలంగాణలో కూడా పెద్ద సంఖ్యలో ఓట్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు పేర్కొన్నారు. పేదలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలకు చెందిన ప్రజలకు అవసరమైన పత్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ప్రతి పౌరుడి హక్కును చట్టబద్ధంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు.

**ప్రధానికి జ్ఞానేశ్ కుమార్ గుమస్తాగిరి : గుమ్మడి నర్సయ్య**

దేశాన్ని ఓ పెద్ద దొంగ పరిపాలిస్తుంటే అయనకు భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గుమస్తాగిరి చేస్తున్నారని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఓటు హక్కును కాపాడుకుందుకు ప్రజలు మరింత పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఎస్ఐఆర్‌లోని లోపాలను సరిదిద్దాలి : ఎల్.రమణ**

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలను సరిదిద్దాలని బిఆర్ఎస్ నాయకుడు ఎల్.రమణ డిమాండ్ చేశారు. డబుల్ ఓట్లు, విదేశీయుల ఓట్లు, అక్రమ ఓట్లు తొలగించడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే అర్హులైన పేదలు, గిరిజనులు, గ్రామీణ ప్రాంతాలు, తండాలు, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల ఓట్లు తొలగించే పరిస్థితి రాకూడదన్నారు. ఈ ఉద్యమం తొలి అడుగు మాత్రమేనని, డిమాండ్లు పరిష్కరించే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని అన్నారు.



## విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం
# పోరాటాలకు సిద్ధం కావాలి

**ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు వేడుకల్లో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపు**

ప్రజాపక్షం/కాజీపేట : తెలంగాణలోని విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సూచించారు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఎఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు సెప్టెంబర్ 30న అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాఠశాలల స్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం విద్యా రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయి పడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, డిగ్రీ, పీజీ కళాశాలలు, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమగ్రంగా కల్పించాలని డిమాండ్ చేశారు. “భారతదేశంలో విద్యార్థి ఉద్యమాలకు ఎఐఎస్ఎఫ్ సుదీర్ఘమైన, ఘనమైన చరిత్ర కలిగి ఉంది. స్వాతంత్ర్య పోరాటం నుండి నేటివరకు విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ఉచిత సమగ్ర విద్య, సామాజిక న్యాయం కోసం పోరాడటంలో ఎఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ముందుపీఠిన నిలిచింది” అని కొనియాడారు. దేశంలో ప్రస్తుత విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు, విద్యారంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థి లోకం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. 90 ఏళ్ల పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా విద్యావ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ తన పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని స్పష్టం చేశారు. బాలవికాస కేంద్రంలో జరిగిన సమావేశానికి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



## గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు
# సిఎం, టిపిసిసి అధ్యక్షుడితో భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్: శాసనమండలి గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ), రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి (నల్లగొండ, ఖమ్మం, వరంగల్) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమను అభ్యర్థులుగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాగా సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలకు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఓటర్ల నమోదు, ప్రచారంపై అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇద్దరు అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి బుధవారం ఉదయం టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికల గురించి అభ్యర్థులకు మహేష్‌కుమార్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు.



# చికితారావుకు అభినందనల వెల్లువ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆసియా క్రీడల వేదికపై ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితారావుకు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌లు అభినందనలు తెలిపారు. అద్భుతమైన ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని వారు కొనియాడారు. చికితారావు సాధించిన రెండు స్వర్ణ పతకాలు తెలంగాణ క్రీడా ప్రతిభకు మరోసారి గుర్తింపు తీసుకొచ్చాయని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం పేరు మార్మోగేలా చేసిన ఆమె విజయం తెలంగాణ యువతకు, ముఖ్యంగా క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని అన్నారు. చికితారావు ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల తరఫున ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి దేశానికి, తెలంగాణకు మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఆమె క్రీడా ప్రయాణం విజయవంతంగా కొనసాగాలని, రానున్న పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని అభిలషించారు.

## సింగరేణి విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టడం ప్రజాద్రోహం
### సిఎంకు హరీశ్‌రావు బహిరంగ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో తీవ్ర విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, స్థానిక వనరులతో ఉత్పత్తి అయ్యే సింగరేణి విద్యుత్‌ను రాజస్థాన్ రాష్ట్రానికి కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధపడటం దారుణమని బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి. హరీశ్ రావు విమర్శించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ ప్లాంట్ నుంచి ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్తును రాజస్థాన్‌కు బదిలీ చేసే జాయింట్ వెంచర్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన లేఖలో డిమాండ్ చేశారు. ‘సొంత ఇంట్లో వెలుగులు నింపలేని ప్రభుత్వం, పొరుగు రాష్ట్రానికి దానం చేయడం అంటే తల్లికి అన్నం పెట్టక పినతల్లికి బంగారు గాజులు కొనిచ్చినట్లే ఉంది’ అని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణి సంస్థ నుంచి దాదాపు రూ. 22 వేల కోట్ల పెట్టుబడులను వేరే రాష్ట్రానికి మళ్లించడం వెనుక ఉన్న అంతరార్థమేమిటని ప్రశ్నించారు.

# పేదలకు అన్నివిధాలా అండగా నిలవాలి

**నిస్సహాయతతో కలెక్టరేట్ గడప తొక్కే వారికి కన్నీరు తుడవాలి • కరీంనగర్ కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి**




ప్రజాపక్షం/కరీంనగర్ : సమస్యతో, బాధతో, నిస్సహాయ స్థితిలో కలెక్టరేట్ గడప తొక్కే ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకం కలిగించేలా సమీకృత జిల్లా కలెక్టరేట్ పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను కుటుంబ సభ్యుల సమస్యలుగా భావించి పరిష్కరించాలని వారి కన్నీరు తుడవాలని పేర్కొన్నారు. ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించే విధంగా పనిచేయాలన్నారు. కరీంనగర్ జిల్లాలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కరీంనగర్‌లో రూ.51 కోట్లతో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టరేట్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్సీ, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. రూ.29.62 కోట్లతో జిల్లాలో చేపడుతున్న మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణ పనులకు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లతో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు, కె.ఎస్.సి.సి.ఎల్. స్పెషల్ గ్రాంట్స్ కింద రూ.21.60 కోట్లతో చేపట్టిన వరద నీటి మురుగు కాల్వల నిర్మాణ పనులకు, రూ.25 కోట్లతో చేపట్టనున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ బిల్డింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.5.70 కోట్లతో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీ భవనాన్ని, రూ.6.50 కోట్లతో నిర్మించిన కాశ్మీర్ గడ్డ సమీకృత వెజ్–నాన్ వెజ్ మార్కెట్‌ను, రూ.16.50 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిఆర్ఎఫ్ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌ను సిఎం సందర్శించారు. వేద మంత్రాల, సర్వమత ప్రార్థనల మధ్య జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలెక్టర్ కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేట్ చాంబర్‌ను పరిశీలించారు. నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఆహ్వానితులైన జిల్లా ప్రముఖులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం పేద ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేలా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు అత్యంత నిరుపేద వర్గాల వరకు చేరే విధంగా ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.840 కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కరీంనగర్ నగర అభివృద్ధికి చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే అభినందించేందుకు తనకు ఎలాంటి సంకోచాలు లేవని అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని, మిగిలిన సమయంలో కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ రాష్ట్రానికి అవసరమైన పనులు సాధించుకోవాలని చూస్తామని సిఎం తెలిపారు. ప్రజాపాలన ప్రారంభమయ్యే సమయానికి ఉద్యోగులకు జీతభత్యాలు ఒకటో తేదీన ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్రం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. నేడు ఆ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని తెలిపారు.

**గౌరవెల్లి ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల కోసం కేంద్రంతో సంప్రదింపులు**

గౌరవెల్లి రిజర్వాయర్ 98 శాతం పూర్తయిందని, సుప్రీంకోర్టులో కేసు కారణంగా మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని సిఎం తెలిపారు. ఇటీవల సుప్రీంకోర్టు అనుకూలమైన తీర్పు ఇచ్చిందని, దీనిపై కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. తన ఢిల్లీ పర్యటనలను కొంతమంది అపహాస్యం చేస్తూ 78 సార్లు ఢిల్లీ వెళ్లారని విమర్శిస్తున్నారని సీఎం తెలిపారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వెళ్లాల్సిందేనని అన్నారు.

**సిద్ధాంతపరమైన వైరుధ్యాలను పక్కనపెట్టి కలిసి పనిచేస్తాం**

విద్యార్థి దశ నుంచి దేశ రాజకీయాల వరకు తనకు అవకాశం రావడం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సిద్ధాంతపరంగా వైరుధ్యాలు ఉన్నప్పటికీ ప్రజల అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. కరీంనగర్ అభివృద్ధికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులు, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు తదితర అనేక అంశాలపై కరీంనగర్ జిల్లాలో పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించేందుకు మరోసారి వస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే శ్రీనివాస్ రెడ్డి డిఆర్ఓ స్వామి, వివిధ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో
# నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం

**ఉపాధి పనులు వేగవంతం చేయాలి : మంత్రి సీతక్క**



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతో పాటు నీటి సంరక్షణ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. విబి జీ రామ్ జీ పథకం అమలుపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని, దాని ప్రభావం గ్రామీణ కూలీల ఉపాధి, వ్యవసాయం, భూగర్భ జలాలు, పశుగ్రాసంపై పడే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులను కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమంగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు రక్షణ కల్పించేలా, నీటి వనరులను పెంపొందించేలా అమలు చేయాలని సూచించారు. సర్పంచులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలను గుర్తించి, పనులను వేగవంతం చేయాలన్నారు. ‘వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు.. వర్క్ ఫ్రమ్ విలేజ్.. వర్క్ ఫర్ విలేజ్’ అనే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కథానాయకుడిగా వ్యవహరించి, గ్రామసభల నిర్ణయాలను గౌరవిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. నీటి వనరుల పెంపునకు గాను ‘ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట గుంత’ లక్ష్యంతో చెక్ డ్యామ్‌లు, కందకాలు, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యంతో పనులకు ఆమోదం తెలపాలని, 2026 అక్టోబర్ నుంచి 2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికలను ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 15 రోజుల్లోగా కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో మట్టి రోడ్లను నిర్మించాలన్నారు. అందుబాటులో ఉన్న రూ.204.50 కోట్ల మెటీరియల్ నిధులతో వి.ఓ. భవనాలను నవంబర్ 19లోపు పూర్తి చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి హామీ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, నిధులు సద్వినియోగం కాకపోతే భవిష్యత్తులో నిధుల కేటాయింపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 100 నుంచి 150 మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులను ముందుగానే గుర్తించి అంచనాలు సిద్ధం చేసి వెంటనే ప్రారంభించాలని, పని ప్రదేశాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. కూలీలకు రోజుకు రూ.308 వరకు వేతనం అందేలా ఉత్పాదక పనులను రూపొందించాలని సూచించారు. వ్యవసాయ పనులతో సమన్వయం పాటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రోజూ కనీసం ఆరు లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.


**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: జడ్చర్ల**

కొటేషన్ నోటీసు

కొటేషన్ నోటీసు నెం. E/ Providing of Necessary arrangement of Bathukamma and Dasara Festivel/Quotations/2026, తేదీ: 30.09.2026

బతుకమ్మ మరియు దసరా పండుగ సందర్భంలో 100 వాట్ల LED లైట్లు, సీరియల్ లైట్లు, 62KV జనరేటర్, 60Ft x 20Ft వేదిక ఏర్పాటు, సౌండ్ హార్న్స్, మైక్రోఫోన్లు, యాంప్లిఫైయర్ మరియు DJ (2 పిన్స్) వంటి ఏర్పాట్లు చేయడానికి పేరున్న సంస్థలు / ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనవి. **కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ: 05.10.2026, సాయంత్రం 4:00 గంటల వరకు.** పైన పేర్కొన్న అంశాలకు సంబంధించి కొటేషన్లను “**కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ**” వారికి ఉద్దేశించి సమర్పించాలి. మరిన్ని వివరాల కోసం కార్యాలయ వేళల్లో మున్సిపల్ కమిషనర్ (7337351867)ను సంప్రదించగలరు. ఎటువంటి కారణం చూపకుండానే స్వీకరించిన కొటేషన్లన్నింటినీ లేదా ఏదైనా ఒక కొటేషన్‌ను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు జడ్చర్ల మున్సిపాలిటీ కమిషనర్‌కు ఉంటుంది.

సం/- కమిషనర్
జడ్చర్ల మున్సిపాలిటీ

DIPR R.O. No. : 10913-PP/CL/ADVT/2026-27, Date: 30-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| Sl. No. | NIT No. | పని పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 1 | ‘ఇ’ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు NIT No. 27/SE (KZ)/ GHMC/ TA/2026-2027, తేది: 30.09.2026 | GHMC ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా మరియు ఉద్యోగుల కోసం GHMC క్రీడా పోటీల నిర్వహణ | బిడ్ సమర్పణకు ప్రారంభ తేది<br>బిడ్ సమర్పణకు ఆఖరి తేది | 01.10. 2026 మ. 03.00 గం.లకు<br>08.10. 2026 మ. 03.00 గం.ల వరకు | ఎస్ఇ (కెజెడ్), జిహెచ్ఎంసి. ఫోన్ నెం. 8790522144 |
| | | క్రీడా పోటీలు | | | |
| మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు | | | | | కమిషనర్ |

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (కెజెడ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10953-PP/CL/ADVT/2026-27, Date: 30-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 28/DB/ EE-II/ Bowen-pally Circle/ MMC/ 2026-27, Dt: 29.09. 2026 | **1.** ప్రకాష్‌నగర్‌లోని గగన్‌విహార్ కాలనీలో కాంపౌండ్ వాల్, చైన్ లింక్ మెష్, ఆటలు మరియు వ్యాయామ పరికరాలతో పార్కు అభివృద్ధి - 1 పని. **2.** వార్డు నం. 196లో నెహ్రూనగర్ పార్క్ మరియు టీచర్స్ కాలనీ పార్కులలో మరుగుదొడ్లు, octagonal shade నిర్మాణంతో పార్కుల అభివృద్ధి - 1 పని. **3.** 2026-27 సంవత్సరానికి గాను బోయిన్‌పల్లి సర్కిల్ కార్యాలయంలోని అన్ని విభాగాలకు స్టేషనరీ మరియు ఇతర కార్యాలయ సామాగ్రిని సమకూర్చుకోవడం - 1 పని. **4.** సిసి రోడ్డు - 1 పని. | రూ. 96.50 లక్షలు | 01.10. 2026 మ. 12.00 గం.లకు | 05.10. 2026 మ. 12.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.

DIPR R.O. No. : 10933-PP/CL/ADVT/2026-27, Date: 30-09-2026

# ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు

ఎంఇఒ అనుమతిలేకుండా ఉపాధ్యాయులు సెలవు తీసుకోవద్దు: కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట/సిద్దిపేటప్రతినిధి/దుబ్బాక:** ప్రభుత్వ పాఠశాల, మోడల్ స్కూల్, కెజిబిఒలలో డ్రాప్ ఔట్ ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, విద్యార్థులతో మాట్లాడి డ్రాప్ ఔట్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతం తగ్గిందని ఆరా తియ్య గా ఆయా వసతి గృహాల్లోనీ విద్యార్థుల రావట్లేదని ఎంఇఒలు తెలపగా, ఒక వసతి గృహాల వార్డెన్ తో ఫోన్‌లో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. పాఠశాలో విద్యార్థులు హాజరు కాకపోవడానికి ఖచ్చితమైన కారణాలని తెలుసుకుని, విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో విద్యాశాఖ పైనజిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఇఒలు, కోఆర్డినేటర్లతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖపైన ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యా ప్రమాణాలు, నీరు పేద విద్యార్థులను మంచి విద్యను అందించడం కోసం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖకి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతినెల విద్యా శాఖపైన సమీక్ష నిర్వహించి విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం కోసం ఫోకస్ చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు ఎఫ్ ఆర్ ఎస్ హాజరు పైన సమీక్షిస్తూ ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు పనితీరు పర్యవేక్షణ చెయ్యాలని,ఎంఇఒల అనుమతి లేనిదే ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు పాస్ అయ్యేలా చూడాలని అదేవిధంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని అన్నారు. విద్యా శాఖలో అన్ని విధాలుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యారంగంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా విద్యాబోధన సాగాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, సెక్టోరల్ అధికారి రామస్వామి, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా భూ సర్వే

భూముల రీసర్వేను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూభారతి భూ సర్వే, రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...భూముల సర్వేలో చాలా కాలంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోవర్స్ వినియోగించి భూములను అత్యంత ఖచ్చితత్వంతో కొలిచి, హద్దులను నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. భూముల కొనుగోలు, అమ్మకాలకారణంగా సర్వే నంబర్లలో సబ్ నంబర్లు మారడం, పట్టాదారులు ఒకరు, కబ్జాదారులు మరొకరు ఉండటం వంటి సమస్యలకు రీసర్వే ద్వారా పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియకు రైతులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. రీ సర్వేకు ముందు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని రైతుల అనుమతితో నే భూముల సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి భూమిని సంబంధించిన హద్దులు, కో ఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చెయాలని సూచించారు. యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారుఈ యాసంగిలో నీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి : లావణ్య



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఓబులాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి మండల వ్యవసాయ శాఖ అధికారిని లావణ్య అన్నారు.ఈ మేరకు బుధవారం గ్రామ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి తో కలిసి పాఠశాలల సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అదేవిధంగా గ్రామంలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించి, అనంతరం వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి,తదితరులున్నారు.

## పరిశోధన కేంద్రం కోసం సిఎంకు వినతిపత్రం



**ప్రజాపక్షం / కరీంనగర్ రూరల్ :** శాతవాహన విశ్వ విద్యాలయంలో అధునాతన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు మౌళిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఉప కులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎంను కలిసిన వీసీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థుల ఉన్నత విద్య, పరిశోధనా అవకాశాలను మెరుగుపరిచేందుకు సహకరించాలని కోరారు. విశ్వ విద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందనిసిఎం హామీ ఇచ్చినట్లు విసి తెలిపారు.

## 'నేడు' అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 1న గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం లో ఉదయం 10:00 గంటల నుండి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలోని వయోవృద్ధులందరూ సకాలంలో కార్యక్రమానికి హాజరై, అధిక సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.వయోవృద్ధుల సంక్షేమం,వారి హక్కులు,గౌరవప్రదమైన జీవనం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని వయోవృద్ధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనల పేర్కొన్నారు.

## సౌకర్యాల లేమి..రోగుల విలవిల



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని ప్రాథమిక(సామాజిక) ఆరోగ్యకేంద్రంలో రోగులకు చికిత్స కేంద్రం అసౌకర్యంగా ఉందని వంద పడకల ఆసుపత్రిగా చేయాలనిబిజెపి నాయకుడు మాలోతు కిరణ్ నాయక్ డిమాండ్ చేశారు.చుట్టుపక్కల గ్రామాల రోగులు వచ్చి కనీస సదుపాయాలు లేక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి నెలకొందన్నారు.ప్రస్తుతం వైరల్ ఫీవర్ వచ్చి రోగులు అవస్థలను ఎదుర్కొంటున్నారని ఒక బెడ్ పై ఇద్దరి పేషంట్లకు చికిత్స ఇస్తున్నారని ఆరోపించారు.పదిమంది ఉండాల్సిన డాక్టర్లు ఉండావలసిన చోటు ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారని అన్నారు.మండల కేంద్రం అత్యధిక జనాభాగల మేజర్ గ్రామపంచాయితి పరిధిగా ఉందని చెప్పారు.నర్సింగ్ ఇతర వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు.జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సీహెచ్‌సీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చందుపట్ల లక్ష్మారెడ్డి,గంట బాలకిషన్‌గౌడ్,అంతెర్పుల తిరుపతి, అబ్దుల్లా,నాగిరెడ్డి,సంతోష్,రాజేష్ తదీతరులున్నారు.

## జాతీయ యోగా పోటీలకు తాటిపల్లి గురుకుల విద్యార్థిని

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని టి. కమలిని జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది.ఇటీవల కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో అండర్–14 నుంచి 16 ఏళ్ల విభాగంలో కమలిని తృతీయ స్థానం సాధించింది.దీంతో అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఆమె ఎంపికైనట్లు జగిత్యాల జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి మనోజ్ తెలిపారు.జాతీయ పోటీలకు ఎంపికైన కమలినిని,పీఈటీ మధులికను పాఠశాల ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు,యోగా అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

## ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వై.వి.రావుకు పరామర్శ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వై.వి. రావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొంది, నేడు సెంచనరీ కాలనీకి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ రంగు శ్రీను,సహాయ కార్యదర్శి మాదన మహేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బోగ సతీష్ బాబు,సిపిఐ నాయకులు గౌతం గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

## అధికారుల చర్యలు కేవలం నోటీస్‌లకే పరిమితమా?

ఒక్క ట్రిప్పు మట్టితో చేతులు దులుపుకున్న ఇంటి యజమాని,పెండింగ్‌లోనే సమస్య!



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని గొల్లవాడ సమస్య ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఇక్కడి అస్తవ్యస్త పరిస్థితిపై ఇటీవల 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించినప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్య మాత్రం పూర్తిగా పరిష్కారం కాలేదు.గొల్లవాడలో ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం కోసం సంవత్సరం క్రితం పెద్ద లోతుతో పునాది తవ్వకాలు జరిపి,ఆ పనులను అలాగే మధ్యలోనే వదిలేశాడు. దీంతో ప్రస్తుత వర్షాకాలంలో కురుస్తున్న వర్షపు నీరు ఆ గుంతల్లో భారీగా వచ్చి చేరింది. దానికి తోడు గొర్రెల ఎరువు కూడా ఆ నీటిలో కలవడంతో ఆప్రాంతమంతా బురదమయంగా మారి,తీవ్రమైన దుర్వాసన వస్తోంది. నిల్వ ఉన్న మురుగునీటి కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోయి,స్థానిక ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై 'ప్రజాపక్షం'లో వచ్చిన కథనానికి స్పందించిన ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్.. సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరిని ఆదేశించారు. దీంతో కార్యదర్శి స్పందించి సంబంధిత ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా పనులన్నీ పూర్తి చేస్తానని సదరు యజమాని అధికారులకు హామీ ఇచ్చాడు. కానీ, క్షేత్రస్థాయిలో చూస్తే పరిస్థితి వేరేలా ఉంది. ఆ యజమాని కేవలం ఒకే ఒక్క ట్రిప్పు మట్టిని మాత్రమే గుంతలో పోసి, మిగతా పనిని అలాగే పెండింగ్‌లో పెట్టేశాడు.

**గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్న అసహనం :** హామీ ఇచ్చిన విధంగా పూర్తి స్థాయిలో గుంతలను పూడ్చకుండా, కేవలం ఒక ట్రిప్పు మట్టితోనే యజమాని సరిపెట్టుకున్నా.. అధికారులు మాత్రం అతనిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, నామమాత్రపు చర్యలతో సరిపెట్టకుండా,సదరు యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆ మురుగునీటి గుంతలను పూర్తిగా మట్టితో పూడ్చివేయించి, తమను అనారోగ్యాల బారిన పడకుండా రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 'చలో సిరిసిల్ల'కు జగిత్యాల కాంగ్రెస్ శ్రేణులు

120కి పైగా బస్సులు.. 150కి పైగా కార్లలో తరలింపు



**ప్రజాపక్షం/జగిత్యాల :** సిఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి జగిత్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.జగిత్యాల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపం నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలు,పట్టణ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. 120కి పైగా బస్సులు, 150కి పైగా కార్లలో నాయకులు, కార్యకర్తలు సిరిసిల్లకు బయలుదేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జగిత్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు,కార్యకర్తలు,అభిమానులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు,మండల,పట్టణ అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రైతు విద్యుత్ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని సుగులాంపల్లి 132 కె వి ఎస్ ఎస్ సబ్ స్టేషన్ ఎదుట బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర,జిల్లా శాఖల పిలుపు మేరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు,విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సబ్‌స్టేషన్ ముందుబిజెపి మండల అధ్యక్షులు కం దుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించా రు.అనంతరం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య,బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీ వ రెడ్డి తదితరులు హాజరై మాట్లాడుతూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు,రైతులకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.అనంతరం ఎలక్ట్రిసిటీ డిఇకి వి నతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో కిసా న్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్కూరి సత్యానారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సొదరి మహేందర్,కాసగోని నిర్మల, జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్, యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు రామగిరి అఖిల్,మహిళ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి లత,మనకీ బాత్ జిల్లా కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ మండల ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్,కొల్లూరి సంతోష్,సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్ ఊషణ అన్వేష్ యాదవ్,మాజీ మండల అధ్యక్షుడువేల్పుల రాజన్న పటేల్,కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మెండే శంకరయ్య,యువ మోర్చ అధ్యక్షుడు కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మహిళ మోర్చా అధ్యక్షురాలు మల్క భాగ్యలక్ష్మి , బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ మేకల కార్తీక్ యాదవ్,సమ్మి రెడ్డి,పెర్క రమేష్,దాసరి వెంకటేష్,ఎర్రం సంతోష్ రెడ్డి, కొంగర అనిల్,గాజే భాస్కర్ రెడ్డి, ఈర్ల ప్రశాంత్,కార్యకర్తలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తం

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల:** సీజనల్ జ్వరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిల్లాలో సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అత్యవసర వైద్య సేవల సన్నద్ధతను సమీక్షించారు. ఆసుపత్రిలోని డయాలసిస్, ఎమర్జెన్సీ రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం, మౌలిక వసతులు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పార్కింగ్ సమస్యలు, రూఫ్ లీకేజీలు, ధోబీ రూమ్, కిచెన్ తదితర సమస్యలను వైద్యులు, అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను రాబోయే నెల రోజుల్లోగా పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఎస్పీ, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు చేపడతామని తెలిపారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఆరోగ్యశ్రీ నమోదు సంఖ్యను పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవల ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరడంతో పాటు వైద్యులకు అందే ఇన్సెంటివ్‌లకు కూడా ఇది తోడ్పడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, టెర్రస్ ప్రాంతాల్లో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.టెర్రస్‌పై పేరుకుపోయిన వ్యర్థాలను రెండు వారాల్లోగా పూర్తిగా తొలగించి, మెరుగైన శానిటేషన్ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు.అనంతరం నిర్మాణంలో ఉన్నా మెడికల్ కాలేజ్ పనులను పరిశీలించారు. దాదాపు పనులు పూర్తి కాగా మిగతా పనులు పూర్తి చేసి నెల రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. వైద్య విద్యార్థులకు కావలసిన వసతులు కల్పించాలని, లైబ్రరీ, స్టడీ రూమ్, కిచెన్ రూమ్ లను పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య వివరాలను ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్,తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఖరీఫ్ (వానాకాలం) 2026– 27 వరి ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధంగా ఉండాలని..అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేం ద్రాలు ప్రారంభం చేసి ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమగు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మం దిరంలో ఖరీఫ్ (వానాకాలం) 2026– 27 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు అందరితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 3లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందనే అ ంచనా వేసి 424 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ముందుగానే అందుబాటులో ఉంచాలని, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ స్కేల్స్, డ్రై యర్లు, ప్యాడీ క్లీనర్లు తదితర అవసరమైన పరికరాలను సమకూర్చాలని అ వసరమైన సంఖ్యలో హమాలీ కార్మికులను అందుబాటులో ఉంచాలని, ధా న్యం రాకకు అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. జిల్లాలో ఖరీఫ్ (వానాకాలం) 2026– 27 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1 నుండి ప్రారంభించాలని ఆదేశించారు.పౌరసరఫరాల శా ఖతో పాటు సంబంధిత కొనుగోలు సంస్థలు తమ పరిధిలో అందుబాటులో ఉన్న గోదాములు, నిల్వ స్థలాలను ముందుగానే గుర్తించి, మొత్తం నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న స్థలం ,అదనంగా అవసరమైన నిల్వ సా మర్థ్య వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరదలకు గురయ్యే ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా, అవసరమైతే ప్రత్యామ్నాయ సురక్షిత ప్రదేశాలను గుర్తించి అక్కడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సన్నరకం వరి ధాన్యం కోసం ప్రతి కొనుగోలు కేంద్రం లో ప్రత్యేకంగా కొనుగో లు చెయ్యాలని, ప్రభుత్వం నిర్దేశించిన 7 వంగడాలకు సన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలుకు 500 బోనస్ లభిస్తుందని అగ్రికల్చర్ అధికారులు ఈ 7 వంగడాల గ్రేడింగ్ ఇవ్వాలని, సన్నధాన్యం గన్నీలలో నింపిన తరవాత ప్రత్యేకంగా మార్కింగ్ చెయ్యాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మండలాల వారీగా ఖరీఫ్ వరి పంట కోతల షెడ్యూల్‌ను సిద్ధం చేసి, గ్రామాల వారీగా వరి కొనుగో లు అంచనా ,కోతల సమయ వివరాలను ముం దుగానే అందించాలని సూచించారు. రైతులు తీ సుకువచ్చే ధాన్యంలో నిర్దేశిత తేమ శాతం ,నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అనవసర జాప్యం లేకుండా స్వీకరించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు అవసరమైన మేరకు తగినన్ని లారీలను ముందుగానే సమకూర్చి, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎస్‌డబ్లుసి గోదాములు, ఎఎంసి గోదాములు, ఇతర ప్రభుత్వ, అందుబాటులో ఉన్న నిల్వ సౌకర్యాలను వినియోగించుకునేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఈ ఖరీఫ్ కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందరు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపి కృష్ణ, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సుధీర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, లీగల్ మెట్రాలజీ అధికారురి, ఏంవిఐ శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పోలీస్ కమిషనర్, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రోటోకాల్, భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, రవాణా తదితర విభాగాల సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో తమ వంతు సహకారం అందించిన జర్నలిస్టులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరి సహకారం కీలకంగా నిలిచిందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా కనిపించిన సమష్టి స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు కరీంనగర్ జిల్లాను అభివృద్ధి సూచికల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.

## భూ రికార్డులు పరిశీలించిన



ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : రెవెన్యూ, అటవీ శాఖ రికార్డులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆదేశించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ భార్గవ్ కుమార్‌తో కలిసి బుధవారం సిర్పూర్ (టి) మండలంలోని రాజారం గ్రామ శివారు సర్వే నంబర్ 28లోని భూమిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి స్థల పరిస్థితులు, సర్వే వివరాలు, హద్దులు, రెవెన్యూ రికార్డులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భూమికి సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత సిబ్బంది సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఎక్కడా నిబంధనలు అతిక్రమించకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.సిర్పూర్ (టి) తహసీల్దార్ మహమ్మద్ రహీముద్దీన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ సర్వేయర్ రమేశ్వర్, మండల సర్వేయర్ ప్రసాద్, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయ నిధి భరోసా




ప్రజాపక్షం/బెల్లంపల్లి టౌన్ : ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి బస్తీకి చెందిన చందనాల దామోదర్‌కు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి సహకారంతో సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారుబెల్లంపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ పిఎ ఇక్బాల్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ జనరల్ సెక్రటరీ కాంపెల్లి సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గం మహేందర్, రామిల్ల ప్రదీప్, అక్కపాక రంజిత్ కుమార్, కాంపెల్లి శివకుమార్ పాల్గొన్నారు.

## అర్హులైన నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



ప్రజాపక్షం/నిజామాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం కలాకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మెనిఫెస్టోలో చెప్పిన విధంగా అర్హులైన ఉద్యమకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులు చిట్టిబాబు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హైదరాబాద్ నగరంలోని రవంద్రభారతి వద్ద నిర్వహించనున్న శాంతియుత నిరసన కార్యక్రమానికి జిల్లా కళాకారులు వెళ్లడానికి సిద్ధం కాగా ఇంటెలిజెన్స ద్వారా సమాచారం అందుకుని పోలీసులు నిర్బంధించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. చిట్టిబాబు, కర్క రమేష్, మహేందర్, సంజీవ్, గోదావరి, స్రవంతి, సంతోష్, నరేష్, శ్రీధర్‌లతో పాటు జిల్లా కళాకారులను పోలీసులు ఇంటి వద్దే ముందస్తుగా నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకున్నారు.

## పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి

మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ



ప్రజాపక్షం /పెద్ద శంకరంపేట : పత్తి పంటలో కాయ ఏర్పడే దశ, కాయ పగిలి కపాస్ విచ్చుకునే దశ అత్యంత కీలకమని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు. బుధవారం శివాయిపల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కాయల ఎదుగుదలకు పొలంలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాయ సైజు, నాణ్యత పెంచేందుకు పొటాషియం, బోరాన్ పోషకాలను వినియోగించాలన్నారు. గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించేందుకు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాయలు విచ్చుకునే దశలో అధిక తేమతో కాయ కుళ్లు వచ్చే అవకాశం ఉన్నందున నీటి తడులు తగ్గించాలని, మంచు ఆరిన తర్వాతే పత్తిని ఏరాలని తెలిపారు. రైతులు సూచించిన మందులను వ్యవసాయ అధికారుల సలహాతోనే వినియోగించాలని, విచ్చుకున్న దూదిపై పురుగుమందుల అవశేషాలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాగం కృష్ణ సూచించారు. రైతులు దండు సాయిలు, దండు రాములు తదితరులు ఉన్నారు.

## 'మెదక్' ఖ్యాతిని ప్రపంచస్థాయికి చాటాలి

ప్రజాపక్షం/మెదక్ : క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహించి మెదక్ ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటాలని ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపారవేత్త గంజి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంజి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు క్రీడలకు దూరం కాకూడదన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు తనవంతుగా ఆర్థిక, ఇతర సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎంతో క్రీడా ప్రతిభ ఉందని, సరైన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరన్నారు. కళాశాల విద్యార్థులు ఐదు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విజేతలను సన్మానించి అభినందించారు.



## ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో..

# స్థానిక రైతులకు మరింత ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానిక రైతాంగానికి మరింత ప్రయోజనాలు చేకూరుతాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, తాహెర్‌బిన్ హందార్, గడుగు గంగాధర్, అభిగ్యాన్ మాల్వియా, రాజాగౌడ్ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు నందిపేట్ మండలం లక్కంపల్లి సెజ్‌కు ఆనుకుని ఉన్న స్థలాలను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సెజ్ ప్రాంతంలో ఫ్యాక్టరీ కోసం గుర్తించిన స్థలం అనుకూలతపై అధికారులతో చర్చించారు. భవిష్యత్తులో ఇదే ప్రాం తంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండటం, పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాకు 50 కిలోమీటర్ల లోపే చేరువగా ఉండటం, రెండు జిల్లాలో ఇప్పటికే 17 వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగులో ఉండటం, మరో ఐదు వేల ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉండటం వంటి అంశాలు స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుకూలంగా నిలుస్తాయని అధికారులు అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుతో రైతులకు గణనీయమైన లాభాలు సమకూరడమే కాకుండా ఆయిల్‌పామ్ ఇండస్ట్రీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియనందున రైతులు నీటి వనరులను ఎంతో జా గ్రత్తగా వినియోగించాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా చూసుకోవాలనానరు. నీటి ల భ్యత అంతగా లేనందున యాసంగిలో వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు చే యాలని కోరారు. స్థల పరిశీలన జరిపిన వారిలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగేష్‌రెడ్డి తదితరులున్నారు.

## కల్తీ ఆహారం విక్రయిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ కె.హరిత



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : హోటళ్లు, బేకరీలు, వసతి గృహాల్లో తయారుచేసే ఆహారంలో కల్తీ పదార్థాలు వాడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తో కలిసి జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఆహార భద్రత అధికారులు హోటళ్లు, తినుబండారాల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. వ్యాపార సంస్థల అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు చేపట్టాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో వినియోగించే సరుకుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, ఆహార విషబాధ ఘటనలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన కల్తీ పదార్థాలు, సంబంధిత దుకాణాల వివరాలను ప్రజలకు తెలిసేలా పత్రికల ద్వారా వెల్లడించాలని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లకు స్పష్టం చేశారు.జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ఫుడ్ సేఫ్టీ అధికారి వాసురావు, ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేందర్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యాబోధన అందించాలి



ప్రజాపక్షం / నెన్నెల : ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, అదనపు గదులు, వంటశాల, రికార్డులు, పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన పౌష్టిక ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సర్కారు బడుల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వం గుణాత్మక విద్యను అందిస్తోందనే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతోనే రైతులకు లాభాలు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / బెల్లంపల్లి : సాధారణ వరి, పత్తి పంటలకు బదులుగా మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. స్టాళ్లను పరిశీలించి మొక్కలు నాటారు. ఆధునిక సాంకేతికత, డ్రిప్ ఇరిగేషన్, ఎలక్ట్రానిక్ వాహనాలను వినియోగించి సాగు వ్యయం తగ్గించుకోవాలన్నారు. ఆయిల్ పామ్, పందిరి, పండ్ల తోటల సాగుతో పాటు లైవ్ స్టాక్ మిషన్ రాయితీలు, లక్షెట్టిపేట విత్తన శుద్ధి కేంద్రం, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నానో ఎరువులు వాడుతూ పకడ్బందీ ప్రణాళికతో సాగు చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మా ట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడుతూ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించాలని, తక్కువ నీటి తో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, కేవీకే శాస్త్రవేత్త మహేష్, మార్కెట్ కమిటీ, ఆత్మ చైర్మన్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## దళారుల అక్రమ సోయా కొనుగోలుకు అధికారుల అండదండ

చర్యలు తీసుకోని సంబంధిత అధికారులు



ప్రజాపక్షం/ముధోల్ : రైతులు పండించిన సోయా పంటను అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా దళారులు కొనుగోలు చేస్తూ లాభార్జితం పొందుతున్నారు.ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.ధాన్యం కొనుగోలు చేసే దుకాణాలు ప్రభుత్వ నియమాలకు లోబడి అనుమతులు కలిగి ఉండాలి.కానీ వీరు ఎలాంటి అనుమతులు పొందకున్న తమకిష్టమైన తీరుతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.క్వింటాలుకు 2 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను ముంచడమే కాకుండా కనీసం ధాన్యాన్ని బరువు కొలిచే యంత్రాలు సరిగా ఉన్నాయా లేదా కూడా తెలియని దుస్థితి.పత్రికల్లో ప్రచురించిన అధికారుల నుండి ఎలాంటి చర్యలు లేవు.ఇంత బహిరంగంగా అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న సంబంధిత అధికారులు మౌనంగా ఉండడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు మౌనం వీడి అనుమతులున్న వారికే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి,లేదా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అధికారులను ఆదేశించి అక్రమ వ్యాపారాలపై నిలుపుదల చేయాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

## ఐఐటి విద్యార్థినికి ల్యాప్‌టాప్.. బహుకరించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజాపక్షం/నేరడిగొండ: ఐఐటి ఇండోర్‌లో సీటు సాధించిన తాంద్ర గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని రాథోడ్ ప్రియాంకకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కొనుగోలు శక్తి లేని నిరుపేద ప్రతిభావంతులకు ఎంతో తోడ్పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఉన్నత స్థాయికి ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు.



## 'జలాల్‌పూర్'లో దారుణ హత్య

పాత కక్షలే కారణం?

ప్రజాపక్షం/వెల్దుర్తి : మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో దారుణ హత్య చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బ్యాగరి రామానుజం (40)పై అదే గ్రామానికి చెందిన గుండెని ప్రవీణ్ కు టుంబ సభ్యులు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కర్రలతో తీవ్రంగా కొట్టడంతో రామానుజం అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెల్‌ఫోన్ దొంగతనం చేశాడనే అనుమానంతోనే రామానుజంపై దాడి జరిగినట్లు ఆరోపిస్తున్నారు. ప్రవీణ్‌తో పాటు మరికొందరు రాత్రి సమయంలో రామానుజం ఇంటి వద్దకు వెళ్లినట్లు తెలిపారు. అనంతరం కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన రామానుజం మృతి చెందినట్లు పేర్కొన్నారు. అయితే ఆ ఫోన్ అనంతరం లభించినట్లు తెలిసింది. అయినప్పటికీ రామానుజమే ఫోన్ దొంగతనం చేశాడనే అనుమానంతో అతడిపై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఈ ఘటన వెనుక పాత కక్షలు కూడా ఉండొచ్చన్న చర్చ గ్రామంలో జరుగుతోంది. హత్యకు కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనకు దారితీసిన అసలు కారణాలు, దాడిలో పాల్గొన్నవా రి పాత్రపై పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది. సమాచా రం అందుకున్న వెల్దుర్తి ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి సం ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు బం దోబస్తు ఏర్పాటు చేశారు.మృతుడు రామానుజానికి భార్య రజిత, తల్లిదండ్రులు సాయిలు, పోచమ్మతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.



## సేవా స్ఫూర్తితో సాగుతున్న 'పోశం'

ప్రిన్సిపాల్ పత్తి సునీత




ప్రజాపక్షం / మంచిర్యాల : విద్యార్థుల సంక్షేమం, కళాశాల అభివృద్ధికి కాంట్రాక్టర్ కుదురుపాక పోశం అందిస్తున్న సేవలు అభినందనీయమని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పత్తి సునీత కొనియాడారు. బుధవారం మంచిర్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో కుదురుపాక పోశం, కుదురుపాక భారతి దంపతులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోశం కేవలం తన విధులకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల అవసరాలను గుర్తించి సేవా దృక్పథంతో అండగా నిలవడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి తోడ్పడే ప్రతి ఒక్కరి సహకారం ఎంతో విలువైనదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసే చిన్న సహాయమైనా వారి జీవితాల్లో పెద్ద మార్పు తెస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. పోశం దంపతులకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 31 వరకు పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలు

ఎస్‌పి జానకి షర్మిల



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా ప్రశాంతతను సుస్థిరం చేసే లక్ష్యంతో అక్టోబర్ 01 నుండి అక్టోబర్ 31, 2026 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్–30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సమాజంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సెక్షన్ అమలులో ఉండే నెల రోజుల వ్యవధిలో సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందనిదే జిల్లాలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు,ఊరేగింపులు లేదా పెద్ద ఎత్తున ప్రజలు సమకూరే కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్పీ హెచ్చరించారు.నిబంధనలను అతిక్రమించి ప్రజా ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే సంబంధిత వ్యక్తులు లేదా నిర్వాహకులపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. శాంతియుత వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు.మరోవైపు సోషల్ మీడియా వేదికలపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు,వదంతులు,మత విద్వేషాలను రెచ్చగొట్టే అంశాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారి తీసే పోస్టులు, సందేశాలు, వీడియోలు ప్రసారం చేసే వారిపై చట్టపరంగాచర్యలు ఉంటాయని హెచ్చరించారు.శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని చట్టాన్ని గౌరవించాలని, పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

## 28 ప్యాకేజీపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజా పక్షం/భైంసా : నియోజకవర్గం లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టనున్న 28 ప్యాకేజీ పనులపై అంచనాలు తయారు చేసి తక్షణమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.ఇటీవల ఎమ్మెల్యే 28 ప్యాకేజీ కి 500 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరిన విషయం విదితమే.. అందులో భాగంగానే బుధవారం భైంసా లోని ఎమ్మెల్యే నివాసంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా అయన మాట్లాడారు.పది సం వత్సరాలుగా ప్యాకేజీ పనులు ముందుకు సాగపోవడంతో పనులు ఎంతవరకు చేపట్టారు , ప్రస్తుతం చేపట్టాల్సిన పనులేంటి అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు.గతంలో 48 శాతం పనులు అయ్యాయని, ప్రస్తుతం మిగిలిన పనులకు ఎన్ని నిధులు అవసరం అన్న విషయంపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముధోల్, తానూర్, కుభీర్ మండలాలోని ఆయా గ్రామాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది ప్రభుత్వం. అధికారులు విభాగాల వారీగా అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి తక్షణమే నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ 28 ప్యాకేజీ పనులు పూర్తయితే, గోదావరి నది జలాల ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ తో ముధోల్ ని యోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. రామన్న రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.సమావేశంలో ఎస్.ఇ.రాజేంద్రప్రసాద్,ఈఈ ప్రవీణ్, డి.ఇ.నవీన్ తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 1861 లోని 30, 30(ఎ) సెక్షన్లు అమలులో ఉంటాయని బుధవారం జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నిబంధనలు అమలులో ఉన్న సమయంలో పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల సాధారణ రాకపోకలకు, శాంతిభద్రతలకు అనుమతి ఉండదన్నారు. అదేవిధంగా ప్రజాల, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, అశాంతికి కారణమయ్యే చర్యలకు పాల్పడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీస్ యాక్ట్ నిబంధనలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# కొనుగోళ్లు సరే...భద్రత సంగతేంటి?

**నేటి నుండి వానాకాలం ధాన్యం కొనుగోళ్లు**
**భద్రతపై నీలినీడలు**
**1.28లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష్యం**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వానాకాలం ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నా.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇప్పుడు భద్ర పరచడమే అసలైన సవాలుగా మారింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 1లక్ష 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 190 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగాపెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ గోదాముల్లో అందుబాటులో ఉన్న నిల్వ సామర్థ్యం కేవలం 30వేల మెట్రిక్ టన్నుల మేరకే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కొనుగోళ్ల లక్ష్యంతో పోలిస్తే నిల్వ సామర్థ్యం భారీగా తక్కువగా ఉండటంతో మిగిలిన దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికి కూడా పూర్తిస్థాయిలో గుర్తింపు జరగలేదు. కొనుగోళ్లు ఊపందుకున్న తర్వాత నిల్వ కేంద్రాల కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ధాన్యపు నిల్వల అనువైనప్రాంతాల అన్వేషణలో భాగంగా పాల్వంచలో సుమారు 10 ఎకరాల ప్రభుత్వభూమిని అధికారులు ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. అయితే అక్కడ నిల్వకేంద్రాల ఏర్పాటుకు ఎంత సమయం పడుతుంది. కొనుగోళ్లు ఊపందుకునే నాటికి అందుబాటులోనికి వస్తాయా అన్నదానిపై స్పష్టత రావాల్సుంది. ఇదే సమయంలో తాత్కాలిక నిల్వ కేంద్రాల ఏర్పాటుకు వినియోగంలో లేని పాత సినిమాహాళ్లు ఫంక్షన్ హాళ్లను పరిశీలిస్తున్నారు. అవసరాన్ని బట్టి వీటిల్లో ధాన్యపు నిల్వలు ఉంచేందుకు అధికారులు పరిశీలిస్తున్నారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం ఒక ఎత్తయితే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తడవకుండా సురక్షితంగా నిల్వ చేయడం మరో పెద్ద సవాల్. నిల్వ సామర్థ్యాన్ని ముందుగానే సిద్ధం చేయకుంటే కొనుగోళ్లు పెరిగే కొద్దీ ధాన్యం కుప్పలు పేరుకుపోయే పరిస్థితి తలెత్తే అవకాశం లేకపోలేదు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థంకాని పరిస్థితుల్లో వర్షాలు పడితే ఆరుగాలం పండించిన ధాన్యం వర్షార్పణం అయ్యే ప్రమాదం లేకపోలేదు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా సాగాలంటే కొనుగోలు కేంద్రాలు, రవాణా, గోదాములు, ప్రత్యామ్నాయ నిల్వకేంద్రాల మధ్య సమన్వయం అత్యంత కీలకం. లక్ష్యం భారీగా ఉండటంతో అందుకు సరిపడా నిల్వసదుపాయాలు సిద్ధంగా లేకపోవడం అధికారులకు సవాలుగా మారింది. 1లక్ష 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా వానాకాలం పంటను నేటి నుండి కొంటున్నారు. ధాన్యం నిల్వలను సరైన పద్ధతిలో ఉంచకుంటే ఇబ్బందులు తప్పవని ఇప్పటికే ప్రభుత్వం హెచ్చరించింది. ఈ క్రమంలో భద్రత విషయంలో తడబడతారా? నిలబడి సమస్యను సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొంటారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో మొక్క జొన్న కొనుగోళ్ల విషయంలో కొంత తడబాటు ఎదురవడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు.

**ఆ ఏడు రకాలకు మాత్రమే ఛాన్స్**

తెలంగాణ ప్రభుత్వం కేవలం ఏడు రకాల ధాన్యాన్ని మాత్రమే కొనేందుకు ముందుకు వచ్చింది. అందులో సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ కూడా ఇవ్వనున్నారు. బిటిపి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోన, జై శ్రీరామ్ సిగ్మెంటల్, కెఎన్ఎం 1638, డబ్ల్యు జిఎల్ 44, కేఎన్ఎం 7715 రకాలను మాత్రమే ప్రభుత్వం కొననుంది. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు 2461, సాధారణ రకానికి 2441 మద్దతు ధర ఇవ్వనున్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ వర్తిస్తుంది. దీంతో సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.2961 రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఇక పోతే కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు గన్నీబ్యాగులు, టార్పాలిన్లు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, తేమశాతం వంటి అంశాలపై ఇప్పటికే కలెక్టర్ అంకిత్ ఆదేశాలు జారీ చేశారు. పొరుగు రాష్ట్రాల నుండి ధాన్యం జిల్లాలోకి అక్రమంగా వచ్చే అవకాశాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు సరిహద్దుల్లో పటిష్టమైన నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు.

## తుమ్మలచెరువు ఆయకట్టుకు గోదావరి జలాలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మారెళ్ల పాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను తుమ్మలచెరువు ఆయకట్టుకు తరలించి, తూముల ద్వారా పంట పొలాలకు సాగునీటిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం విడుదల చేశారు. తూముల లాకులు ఎత్తి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు సక్రమంగా చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి జలాలు చేరడంతో రైతుల్లో హర్షం వ్యక్తమైంది. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే తెల్లం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు, రేషన్ కార్డులు అందజేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సిపిఐ సీనియర్ కార్యకర్త మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని దారేడు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త సొంటి ధనుజంయ్(62) గుండెపోటుతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. సిపిఐ పార్టీ తరుపున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, మండల సమితి సభ్యులు బత్తిని సీతారాములు, దేవరపల్లి వెంకటకృష్ణ, పల్లె నరసింహారావు, శారద, ఎస్‌కె జానీ, సర్పంచ్ బత్తుల వెంకన్న, ఉప సర్పంచ్, సిపిఐ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వరంగల్ –ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు జాబితా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వరంగల్ –ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు జాబితా తయారీ, ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో 1,75,858 అనామలీస్, నో మ్యాపింగ్, ఓటర్లను గుర్తించగా వారిలో 1,69,802 మందికి నోటీసులు అందజేశామని, 1,36,208 మంది ఓటర్ల హియరింగ్ పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అభ్యంతరాల సమర్పణకు అక్టోబర్ ఏడు చివరి తేదీ అని, నవంబర్ ఐదువరకు నోటీసుల ప్రక్రియ, అభ్యంతరాల పరిష్కారం అనంతరం నవంబర్ తొమ్మిదిన తుది ఎస్ఐఆర్ జాబితా ప్రచురించే ప్రక్రియ ఉంటుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతి ఎన్నికల సమయంలో పట్టభద్రులు తప్పనిసరిగా తాజాగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 31 అక్టోబర్ 2023 నాటికి పట్టభద్రులైన అర్హులు 1 నవంబర్ 2026న అర్హత తేదీగా తీసుకుని రూపొందించే ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎస్‌డిసి సదానందం, ఆర్‌డిఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అడవి పంది వేట కేసులో ఇదరు పట్టివేత

**వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** చంద్రుగొండ అటవీ రేంజ్ పరిధిలోని ఎర్రగుంట సమీప అటవీ ప్రాంతంలో అడవి పంది వేటకు పాల్పడిన ఇద్దరిని అటవీ అధికారులు పట్టుకున్నారు. గస్తీలో అనుమానాస్పదంగా సంచితో కనిపించిన పనితి నరేష్, మల్ల శ్రీనివాసరావును తనిఖీ చేయగా రక్తపు మరకలున్న సంచి, వేటకు ఉపయోగించిన క్లచ్ వైర్ లభించాయి. సంఘటనా స్థలంలో అడవి పంది మృతదేహాన్ని గుర్తించి వేట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, సంబంధిత అటవీ చట్టాల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. అక్రమ వేట, ఉచ్చుల ఏర్పాటు, వన్యప్రాణుల మాంసం లేదా మృతదేహం కలిగి ఉండటం, రవాణా చేయడం నేరమని అటవీశాఖ హెచ్చరించింది. చంద్రుగొండ అటవీ రేంజ్‌లో అక్రమ వేటపై ప్రత్యేక నిఘా, గస్తీ, కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## కార్మికుల ఆరోగ్య రక్షణే ప్రధానం

**కార్మికుల సంక్షేమానికి సమష్టి కృషి**
**మేయర్ మూడ్ గణేష్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** కార్మికుల ఆరోగ్య రక్షణకు మున్సిపల్ కార్పొరేషన్ అధిక ప్రాధాన్యతనిస్తుందని. నిరంతరం శ్రమిస్తూ పట్టణ ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది శ్రేయస్సుకు అన్ని వేళలా ఉండగా ఉంటామని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయ సమవేశ మందిరంలో బుధవారం పలు విభాగాల సిబ్బందికి అధికారులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన గణేష్ మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం రేయింబళ్లు శ్రమించే పారిశుద్ధ్య, నీటి విభాగాల కార్మికులు తమ సొంత ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలో తరుచూ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతొక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కార్పొరేషన్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి వైద్యులు సిబ్బంది శిబిరంలో పాల్గొని సుమారు 300 కార్మికులకు రక్తపోటు మధుమేహం తదితర జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుజాత, కార్పొరేషన్, జిజిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు

## ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులకు అస్వస్థత



**ప్రజాపక్షం/పెనుబల్లి:** విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో ఫుడ్ ఫాయిజన్ అయిందని పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పెనుబల్లి మండలం ఉప్పలచిలక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగు, ఐదు, ఆరు, ఏడు తరగతులు చదువుతున్న ఇద్దరు బాలికలు, నలుగురు బాలురకు భోజనం చేసిన తర్వాత వాంతులు అయ్యాయి. ఫుడ్ పాయిజన్ అయిందని హుటాహుటిన పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అల్పాహారం రోజు ఉదయం 8:30 గంటలకు వస్తుంది. కానీ ఉదయం 10:30 కి ఆలస్యంగా వచ్చిందని, మధ్యాహ్న భోజనం చేసిన గంట తర్వాత కడుపునొప్పి వాంతులు అయ్యాయని విద్యార్థులు తెలిపారు. లంక సాగర్ పిహెచ్‌సి వైద్యాధికారులు, విద్యా శాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థుల అస్వస్థకు గురవడం ఆలస్యంగా వచ్చిన అల్పాహారమేనా, మధ్యాహ్న భోజనం, కలుషిత నీరు, ఇంకా వేరే ఇతర కారణాలు అయ్యుండొచ్చునని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి

**డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నల్గొండ– ఖమ్మం– వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ప్రకటించిందని ఆయన గెలుపునకు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. విద్యావంతుడు, నిబద్ధత కలిగిన నేతకు టికెట్ కేటాయించినందుకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లతో పాటు ఇతర మంత్రులకు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యావంతుల ప్రతినిధిగా, పార్టీకి నిబద్ధత కలిగిన నేతగా సర్వోత్తమ్ రెడ్డికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందని ఆయన గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి పనిచేయాలన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియే గెలుపుకు కీలకమని పార్టీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అనుబంధ సంఘాల నాయకులు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పట్టభద్రున్ని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## వెలుగుమట్లలో ఇళ్ల నిర్మాణం పరిశీలన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించి పనులు ఏ దశలో ఉన్నాయి, ఇంకా నిర్మాణ పనులు ప్రారంభం కాని ఇండ్లు ఏమైనా ఉన్నాయా దానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులకు అవసరమైన సాంకేతిక సహాయం తదితర సౌకర్యాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులకు, ఇందిరమ్మ ఇండ్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## బాగం రాములమ్మ మృతి పార్టీకి తీరని లోటు

**బాగం శేషభూషణం కుటుంబానికి సిపిఐ నేతల పరామర్శ**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామానికి చెందిన బాగం రాములమ్మ (104) బుధవారం పరమపదించారు. ఆమె మృతి పట్ల సిపిఐ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, సానుభూతిపరులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వందేళ్లకు పైగా జీవితాన్ని కొనసాగించిన రాములమ్మ మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటుగా మిగిలింది. బాగం రాములమ్మ సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ బాగం శేషభూషణం మాతృమూర్తి. రాములమ్మ మృతి వార్త తెలుసుకున్న సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ సీతంపేట గ్రామానికి చేరుకుని రాములమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాగం శేషభూషణం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌కె. సాబీర్ పాషా మాట్లాడుతూ 104 సంవత్సరాల సుదీర్ఘ జీవితాన్ని గడిపిన బాగం రాములమ్మ మృతి బాధాకరమన్నారు. బాగం శేషభూషణం కు టుంబం గత 45 సంవత్సరాలుగా ఈప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ క మ్యూనిస్టు ఉద్యమంతో అనుబంధాన్ని కొనసాగిస్తోందని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో ప్రజా జీవితంలో కొనసాగుతున్న ఈ కుటుంబంలో మాతృమూర్తి మృతి పార్టీ శ్రేణులను కూడా విషాదానికి గురిచేసిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం, ప్రజలకు అండగా నిలవడం,సిపిఐ పార్టీని బలోపేతం చేయడం వంటి కార్యక్రమాల్లో బాగం శేషభూషణం కుటుంబం సుదీర్ఘకాలంగా భాగస్వామిగా ఉంటోందని నాయకులు తెలిపారు. ఈ కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, లావుడియా గోపి, ఎఐటియుసి మండల అధ్యక్షుడు వీర్ల మల్లేష్, సుజాతనగర్ టౌన్ సెక్రటరీ బొడ్డు కేశవరావు, సీతంపేట సర్పంచ్ గరిక ఉపేందర్, సిపిఐ మండల నాయకులు ముక్కెర మురళి, దండు నాగేశ్వరరావు, కుమారి కృష్ణ, వెంకన్న శంకర్ మండే నాగేశ్వరావు దొడ్డ శ్రీను కృష్ణ కొండపల్లి నరేష్ రాజా తదితరులు పాల్గొని భాగం రాములమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం

**బికెఎంయు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ**



**ప్రజాపక్షం/సత్తుపలి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించేందుకు వ్యవసాయ కార్మికులు, పేదలు, ఉపాధి కూలీలు ఐక్యంగా పోరాడాలని బికెఎంయు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. 20న సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు.సత్తుపల్లి మండల కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీల సహకారంతో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కోట్లాది మంది వ్యవసాయ కూలీలు, పేదలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాలు తీసుకువస్తూ, నిధులకు కోత విధిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పని కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. నూతన విధానాల పేరుతో పథకానికి నిధులు తగ్గించి, పేదలకు ఉపాధి దూరం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ.600 కూలి చెల్లించాలని, ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, రెండుసార్లు ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. పేదలు, వ్యవసాయ కార్మికులు సంఘటితమై ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలని కోరారు.

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం: మున్సిపల్ కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మున్సిపాలిటీ పరిశుభ్రత ఎంత ముఖ్యమో...కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కూడా తమకు అంతే ముఖ్యమని కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్వచ్ఛతాహి 2026లో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీలో ఎంవి,పాలెం పిహెచ్‌సి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ మాట్లాడుతూ...ప్రజలు ఉదయం లేచినప్పటి నుంచి పరిశుభ్రమైన పరిసరాలను ఆస్వాదించడానికి కారణమైన పారిశుద్ధ్య కార్మికులు మాత్రం ప్రతిరోజూ చెత్త, దుమ్ము, మురుగు మధ్య పనిచేస్తుంటారని అన్నారు. వారి సేవలు పట్టణ పరిశుభ్రతలో ఎంతో కీలకమని, అలాంటి కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతర వైద్య శిబిరంలో కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు. స్వయంగా కమిషనర్ కార్మికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, కాంగ్రెస్ కౌన్సిలర్ సోము వెంకట్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు ఓకే.. బిజెపి సంగతేంటి?

**ఎమ్మెల్సీ బరిలో బిజెపి నిలుస్తుందా?**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల చేర్పింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించే పనిలో పడ్డాయి. నల్గొండ– ఖమ్మం –వరంగల్ పట్టభద్రుల స్థానానికి సంబంధించి కాంగ్రెస్ తన అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ప్రకటించింది. బిఆర్ఎస్ ఏనుగు రాకేష్‌రెడ్డి పేరును దాదాపుగా ఖరారు చేసే అవకాశం ఉంది. ఆయన గత కొంత కాలంగా ప్రచార కార్యక్రమాల్లో ఉన్నారు. జనసేన తన ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైద్య ఆరోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాసరావును ప్రకటించగా ఆయన తన ప్రచారాన్ని మొదలు పెట్టారు. నల్గొండ– ఖమ్మం– వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ వరుసగా నాలుగుసార్లు విజయం సాధించగా 2024 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్‌మార్ మల్లన్న గెలుపొందారు. 2021లో ఈ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ మద్ధతుతో పల్లా రాజేశ్వరరెడ్డి గెలుపొందారు. 2023 శాసనసభ ఎన్నికల్లో పల్లా జనగాం నుంచి శాసనసభకు ఎన్నిక కావడంతో 2024లో ఉప ఎన్నిక అనివార్యమైంది. అప్పుడు ఈ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకుంది. బిఆర్ఎస్ వరుసగా నాలుగుసార్లు గెలుపొందింది. కపిలవాయి దిలీప్‌కుమార్ రెండు సార్లు, పల్లా రాజేశ్వరరెడ్డి రెండు సార్లు గెలుపొందారు. ఉప ఎన్నిక సహా బిజెపి ప్రతిసారి బరిలో దిగింది. ప్రేమేందర్‌రెడ్డి 2021, 2024 ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, బిజెపి, జనసేన ఒక ఫ్రంట్‌గా కొనసాగుతుండడంతో ఇక్కడ కూడా ఆ మూడు పార్టీలు అదే రీతిలో వ్యవహరిస్తాయా లేక ఎమ్మెల్సీ బరిలోకి బిజెపి కూడా దిగుతుందా అన్నది తేలాల్సి ఉంది. బిజెపి తన అభ్యర్థిని రంగంలోకి దించకుండా జనసేనకు మద్దతునిస్తే ముక్కోణపు పోటీ జరిగే అవకాశం ఉంది. బలమైన ఓటు బ్యాంకు గల వామపక్షాలు తమ అభ్యర్థిని రంగంలోకి దించుతాయా లేక ఎవరికైనా మద్దతునిస్తాయా అన్నది నిర్ణయించలేదు. ఓట్ల చేర్పింపు కార్యక్రమంలో ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడే గాక రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన వాడు. తండ్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు శాసనసభకు ప్రాతినిథ్యం వహించడమే గాక రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేశారు. సర్వోత్తమ్‌రెడ్డి కుటుంబానిది ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లింగాల గ్రామం. దామోదర్‌రెడ్డి తుంగతుర్తిలో స్థిరపడ్డారు. సర్వోత్తమ్ రెడ్డి పెదనాన్న రాంరెడ్డి వెంకటరెడ్డి సుజాతనగర్, పాలేరు నియోజక వర్గాల నుంచి ఐదుసార్లు శాసన సభకు ఎన్నికై రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ సర్వోత్తమ్‌రెడ్డికి అన్ని విధాలా సహకరించే అవకాశం ఉంది. జనసేన అభ్యర్థి కూడా ఖమ్మం జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. ఈ దఫా పట్టభద్రుల నియోజకవర్గ పోరు రసవత్తరంగా మారే అవకాశం ఉంది. దేశంలో, రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా జెన్ జి ఉద్యమం దేశాన్ని ఊపేస్తున్న తరుణంలో పట్టభద్రులు ఏ వైపునకు మొగ్గు చూపుతారో వేచిచూద్దాం.

# ఇవిఎం వద్దు... బ్యాలెట్‌తోనే ఓటింగ్

- భవిష్యత్ ఎన్నికల కోసం ఎస్ఐఆర్‌కు ముందున్న ఓటర్ల జాబితాను ఉపయోగించాలి : ఖర్గే డిమాండ్
- ప్రజాస్వామ్య హక్కు ప్రమాదంలో ఉన్నప్పుడు 'ఇండియా' పార్టీలన్నీ ఏకతాటిపై నిలబడాలని పిలుపు




**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇకపై దేశంలో ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో 13.3 కోట్ల మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం దిగ్భ్రాంతికరమని, ప్రజాస్వామ్యంలో పాలుపంచుకునే వారి శక్తిని లాక్కోవడం దారుణమని వ్యాఖ్యానించారు. పౌరుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు ప్రమాదంలో ఉన్నప్పుడు భారత పార్టీలన్నీ ఏకతాటిపై నిలబడాలని పిలుపునిచ్చారు.
బుధవారం ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశమైంది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం బలహీనపడకుండా కాపాడుకోవాలని సూచించారు. అలాగే, భవిష్యత్ ఎన్నికల కోసం ఎస్ఐఆర్‌కు ముందున్న ఓటర్ల జాబితాను ఉపయోగించాలని పేర్కొన్నారు. 'ఎస్ఐఆర్ జాబితాకు సంబంధించి కమిషన్‌లోని ఇద్దరు సభ్యులు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు! ఇది భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిజాయతీపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. కాబట్టి ఆయన్ను పదవి నుంచి తొలగించాలి. లేదా ఆయనే స్వయంగా తన పదవికి రాజీనామా చేసి, ఓటర్ల జాబితాలో జోక్యం చేసుకుంటున్న శక్తులకు వ్యతిరేకంగా అప్రూవర్‌గా మారాలి. దీంతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో, ఓటరు చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించి పూర్తి పారదర్శకత ఉండాలి. అర్హతగల ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు, సరైన నోటీసు, అందుకు గల కారణాలు తెలపాలి. అలాగే అప్పీల్ చేసుకునేందుకు సమర్థవంతమైన యంత్రాంగం ఉండాలి. పరిపాలనా లోపాలు, ఇతర కారణాల వల్ల అర్హులైన ఓటర్లు ఓటు హక్కును కోల్పోకుండా రక్షణ కల్పించాలి' అని ఖర్గే అన్నారు. అధికారంలో ఉన్నవారు కాకుండా, సామాన్య ఓటర్లే ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించాలని ఖర్గే అన్నారు. అయితే స్వతంత్ర, నిష్పక్షపాతమైన ఎన్నికల సంఘం లేకుండా విశ్వసనీయమైన ఎన్నికలు జరగవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. 'ఎన్నికల రసంఘం ఎంపిక ప్యానెల్ నుంచి సిజెపిని తొలగించి, ఆయన స్థానంలో ఒక మంత్రిని నియమించడానికి ప్రధాని మోదీ ప్రయత్నించారు. ఇందుకోసం సిఇసి, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) బిల్లు, 2023ను తీసుకువచ్చారు. అది ఎందుకో ఇప్పుడు మాకు అర్థమైంది. ఈ బిల్లు సిఇసికి, ఇద్దరు ఇసిలకు జీవితకాలమంతా పూర్తి రక్షణ కల్పిస్తుంది. అధికారంలో కొనసాగేందుకు అవసరమైన ఒక రబ్బరు స్టాంప్ కోసం ప్రధాని మోదీ, అమిత్ షా ఈ బిల్లును తీసుకువచ్చారు. అందుకే వారే నిజమైన దోషులు. ఇప్పటికే వారు అనేక పార్టీలను విచ్ఛిన్నం చేశారు' అని ఖర్గే ఆరోపించారు.

### మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం

ఇదిలా ఉండగా, ఓటు హక్కు వంటి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన అంశాల్లో ఇండి కూటమి ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవాలని ఖర్గే పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన యువత, ముఖ్యంగా తొలిసారి ఓటు వేయనున్న వారికి ఓటరు నమోదు ప్రక్రియ సులభంగా, అందుబాటులో ఉండాలని సూచించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఈ దేశ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రతి పౌరుడికి సమాన వాణి ఉండాలనే సూత్రంపై ఈ దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలు నిర్మితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత వ్యవస్థపైనే ఉందని ఖర్గే స్పష్టం చేశారు.

## టపాసుల వాడకం పూర్తిగా నిషేధించలేం...
# 24 గంటలూ అనుమతివ్వలేం

మధ్యంతర పరిష్కారం కనుగొనాలి : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** దేశంలో అత్యంత వాయు కాలుష్యం ఉన్న నగరాల్లో ఢిల్లీ ఒకటి. అలాంటి నగరంలో టపాసుల వాడకం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. టపాసుల్ని పూర్తిగా నిషేధించలేమని, అలాగే, 24 గంటలపాటు అనుమతివ్వలేమని కోర్టు వ్యాఖ్యానించింది. అందుకే, మధ్యంతరంగా ఒక పరిష్కారం కనుగొనాలని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీలో టపాసుల వినియోగాన్ని నియంత్రించాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. ఢిల్లీలో టపాసుల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించలేం. అలా చేస్తే కొందరి మనోభావాలు దెబ్బతింటాయి. అలాగని, టపాసులు కాల్చేందుకు 24 గంటలు అనుమతి ఇవ్వలేం. దీనివల్ల పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు చాలా ఇబ్బందులు పడుతారు. అందుకే, ఈ విషయంలో ఒక మధ్యంతర పరిష్కారం అవసరం. అలాగే, కాల్చే టపాసులు ఎలాంటివి ఉండాలి.. ఎంత కాలుష్యం విడుదల చేసేవి.. ఎంత శబ్ద కాలుష్యాన్నిఅనుమతించాలి వంటి విషయాల్లో కొన్ని నిబంధనలు రూపొందించాలి. కొన్ని గంటలపాటే టపాసులు కాల్చేందుకు అనుమతివ్వాలి. అది ఎంత వరకు అనేది తేల్చాలి. ఈ అంశాల్లో కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. టపాసులు కాల్చే విషయంలో, అనుమతించే విషయంలో తాము సూచించిన నిబంధనల్ని పరిశీలించాలని.. ఈ విషయంలో స్పందన తెలియజేయాలని కోర్టు కేంద్రానికి సూచించింది. కేసు తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. ఢిల్లీలో మామూలుగానే భారీ వాయు కాలుష్యం నమోదవుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు కొన్నేళ్లుగా అక్కడి ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. అలాంటిది. కొన్ని ఫెస్టివల్స్ సందర్భంగా టపాసులు కాల్చడంతో ఇంకా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకే, ఈ అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# ఇసి పనితీరుకు నిరసనగా 2న 'జైల్ భరో'

సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటన



**ముంబయి :** కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, అది తీసుకున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దెబ్బతీసేలా ఇసి వ్యవహరిస్తోందంటూ విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. ఇసి పనితీరుకు నిరసనగా అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ముంబయిలోని చారిత్రక శివాజీ పార్క్ వేదికగా 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ఆందోళనలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం ముంబయిలో దీప్కే మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) దుర్వినియోగంపై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలను దీప్కే సమర్థించారు. దేశంలో ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని దీప్కే పేర్కొన్నారు. ఇసి నియంతృత్వ పోకడలు ఆందోళనకరంగా మారాయన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు, ఇసి పనితీరుపై కొన్ని సంవత్సరాలుగా అనుమానాలు వ్యక్తమవుతున్నా సరైన పరిష్కార మార్గం చూపడంలో ఇసి విఫలమైందని విమర్శించారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఇప్పటికే సిజెపి అల్టిమేటం జారీ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, జనవరి 2025 నాటి ఓటర్ల జాబితాను యథావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా, 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని సిజెపి డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లను సాధించేందుకు సిజెపి మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, గాంధీ జయంతి రోజున ఈ నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు ముంబై పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా 'జైల్ భరో ఆందోళన్' చేపట్టి తీరుతామని దిప్కే తేల్చిచెప్పారు. పౌరుల గొంతును అణచివేయాలని చూస్తే ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తుందని దీప్కే హెచ్చరించారు.

# ఇండియన్ కోస్ట్‌గార్డ్ మెగా ఆపరేషన్

- అరేబియా సముద్రంలో రూ.3వేల కోట్ల డ్రగ్స్ స్వాధీనం
- ఐదుగురు పాకిస్థానీయులు అరెస్టు



**అహ్మదాబాద్ :** అరేబియా సముద్రం మీదుగా భారత్‌కు భారీ మొత్తంలో డ్రగ్స్‌ను తరలిస్తున్న పాకిస్థాన్ ముఠా గుట్టును ఇండియన్ కోస్ట్ గార్డ్స్ రట్టు చేసింది. భారత కోస్ట్ గార్డ్ గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) సంయుక్తంగా చేపట్టిన చర్యలో ఇరాన్‌కు చెందిన ఓ పడవ నుంచి భారీగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. మొత్తం 526 కిలోల మెథాంఫెటమైన్, హెరాయిన్ సీజ్ చేశాయి. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు. పడవలో ఉన్న ఐదుగురు పాకిస్థానీ పౌరులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు కోస్ట్ గార్డ్ వెల్లడించింది. సెప్టెంబర్ 25న లక్షద్వీప్‌కు పశ్చిమాన అరేబియా సముద్రంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు భారత కోస్ట్ గార్డ్ తెలిపింది. విశ్వసనీయ నిఘా సమాచారంతో అనుమానాస్పదంగా కదులుతున్న ఓ ధావ్ పడవను భద్రతా బలగాలు గుర్తించాయి. సముద్ర, వైమానిక నిఘా వ్యవస్థల ద్వారా పడవ కదలికలను నిరంతరం పర్యవేక్షించిన అధికారులు, అనంతరం దాన్ని వెంబడించారు. అనుమానాస్పద పడవను నిలువరించిన తర్వాత కోస్ట్ గార్డ్ సిబ్బంది అందులోకి ప్రవేశించి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భారీగా మాదకద్రవ్యాలు బయటపడటంతో పాటు పడవలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల్లో అధిక నాణ్యత కలిగిన మెథాంఫెటమైన్, హెరాయిన్ ఉన్నట్లు కోస్ట్ గార్డ్ పేర్కొంది. పట్టుబడిన డ్రగ్స్ మొత్తం 526 కిలోలుగా గుర్తించారు. సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి సింథటిక్ డ్రగ్స్‌ను తరలించే అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు ఈ సరుకు సంబంధించి ఉండొచ్చన్న అనుమానంతో దర్యాప్తు చేపడుతున్నారు. అయితే డ్రగ్స్ మూలం, గమ్యస్థానం, వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌కు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఆపరేషన్ అనంతరం ఇరాన్ పడవను, అందులోని సిబ్బందిని, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను సాయుధ భద్రత మధ్య ముంబయికి తరలించారు. అక్కడ సంయుక్తంగా విచారణ చేపట్టడంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించనున్నట్లు కోస్ట్ గార్డ్ తెలిపింది. పడవలోని వ్యక్తుల నేపథ్యం, డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగనుంది. ముంబయి తరలించిన తర్వాత చేపట్టే సంయుక్త విచారణలో ఈ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గుజరాత్ ఎటిఎస్ కూడా ఈ ఆపరేషన్‌లో కీలకంగా భాగస్వామ్యమైంది. ఐదుగురు పాకిస్థానీ పౌరులను అదుపులోకి తీసుకున్న విషయాన్ని గుజరాత్ ఎటిఎస్ ధ్రువీకరించింది.

# బుద్గాంలో ఎన్‌కౌంటర్

ఎల్ఇటికి చెందిన టాప్ టెర్రరిస్టు హతం

**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య బుధవారం ఉదయం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో లష్కరే తోయిబాకు చెందిన ఓ టాప్ కమాండర్ హతమయ్యాడు. హతమైన ఉగ్రవాదిని సులేమాన్ షా అలియాస్ మూసా అలియాస్ ఫౌజీ మూసాగా అధికారులు గుర్తించారు. బుద్గాంలో లష్కరే ఉగ్రవాద కార్యకలాపాలకు ఈ ఎన్‌కౌంటర్ గట్టి ఎదురుదెబ్బ అని భద్రతావర్గాలు విశ్లేషిస్తున్నాయి. బుద్గాం జిల్లాలోని ఎగువ ప్రాంతాలైన యూస్‌మార్గ్ పరిధిలోని కోరాగ్ ఏరియాలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భారత సైన్యానికి చెందిన చినార్ కార్ప్స్, జమ్ముకశ్మీర్ పోలీస్, సిఆర్‌పిఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. యూస్‌మార్గ్‌లోని దూద్‌పత్రి అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల అనుమానాస్పద కదలికలను గమనించిన సైనికులు వారిని లొంగిపోవాలని హెచ్చరించారు. కానీ ఉగ్రవాదులు లొంగిపోకుండా కాల్పులకు తెగబడటంతో భద్రతాబలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో సులేమాన్ షా అక్కడికక్కడే హతమయ్యాడని ఆర్మీ వర్గాలు తెలిపాయి. పిర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో జరిగిన అనేక ఉగ్రదాడుల్లో మూసా కీలక నిందితుడిగా ఉన్నాడు. అతడి కోసం భద్రతాదళాలు చాలాకాలంగా గాలిస్తున్నాయి. గతంలో సెప్టెంబర్ 5న యూస్‌మార్గ్ కొండల్లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్ నుంచి మూసా చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఆ ఎన్‌కౌంటర్‌లో అతని సహచరుడు యాసిర్ హతమయ్యాడు.

## 'ఎస్ఐఆర్' కసరత్తు ముగిసిన రాష్ట్రాలలో...
# ఫారం-6 నుంచి అదనపు డిక్లరేషన్ ఉపసంహరణ

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తి అయిన రాష్ట్రాలలో ఆన్‌లైన్ ఓటరు నమోదు ఫారం–6 నుండి 'ఎస్ఐఆర్'–సంబంధిత అదనపు డిక్లరేషన్‌ను ఎన్నికల సంఘం (ఇసి) తొలగించింది. ఈ నిబంధన కేవలం సదరు ప్రక్రియ సమయంలో మాత్రమే వర్తిస్తుందని పూర్తిస్థాయి కమిషన్ నిర్ణయించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో జరిగిన విస్తృత సవరణ సమయంలో తయారు చేసిన ఓటర్ల జాబితాలతో తమను తమ తల్లిదండ్రులను లేదా తాతామామ్మలను అనుసంధానించే వివరాలను కొత్త దరఖాస్తుదారులు సమర్పించవలసిన ఈ డిక్లరేషన్, 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఇసిఐఎన్ఐటి పోర్టల్‌లో అందుబాటులో ఉంది'ఎస్ఐఆర్' ముగిసిన రాష్ట్రాలలో ఇసిఐఎన్ఐటి యాప్, పోర్టల్‌తో పాటు సంబంధిత ప్రధాన ఎన్నికల అధికారి పోర్టల్‌ల నుంచి కూడా అదనపు డిక్లరేషన్‌ను ఇప్పుడు తొలగించారు.దీంతో, నమోదు కోరుకునే దరఖాస్తుదారులు కేవలం ఓటర్ల నమోదు నియమావళి 1960 ప్రకారం నిర్దేశించిన చట్టబద్ధమైన ఫారం–6ను మాత్రమే పూరించాల్సి ఉంటుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలతో కూడిన పూర్తిస్థాయి కమిషన్ సెప్టెంబరు 26న జరిపిన సమావేశం అనంతరం ఈ చర్య తీసుకున్నారు. సమావేశం అనంతరం ఫారం–6కు జతచేసిన డిక్లరేషన్ 'ఎస్ఐఆర్' కోసం ఉద్దేశించినదని, 'ఎస్ఐఆర్' యేతర కాలానికి, నిబంధనల (ఓటర్ల నమోదు నిబంధనలు) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగించబడుతుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఫారం–6కు సంబంధించిన మార్పులపై సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు లేవనెత్తారని వెలుగులోకి వచ్చిన తర్వాత ఈ విషయం వివాదాస్పదంగా మారింది. ఫారం–6 అనేది అర్హులైన పౌరులు ఓటర్ల జాబితాలో చేర్చబడటానికి, దరఖాస్తు చేసుకోవడానికి ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం, 1960 ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం నిర్దేశించబడిన ఫారాన్ని ఆ నిబంధనలను సవరించకుండా మార్చలేరనే కారణంతో వివేక్‌జోషి ఆ ఫారంలో మార్పులను వ్యతిరేకించారు. ఇసిఐఎన్ఇటిలోని ఆన్‌లైన్ ఫారం–6 ప్రక్రియలో 'ఎస్ఐఆర్' సంబంధిత డిక్లరేషన్‌ను పొందుపరిచిన తర్వాత, సుఖ్‌బీర్‌సింగ్ సంధు మళ్లీ అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఈ క్రింది విధంగా వివరించారు. మార్పును అనధికారిక/చట్టవిరుద్ధంగా పేర్కొంటూ, దానిని తొలగించాలని కోరుతున్నారు. అయితే, తన బహిరంగ ప్రకటనలలో, ఫారం–6 సవరించబడలేదని, ఆ డిక్లరేషన్ 'ఎస్ఐఆర్'కు సంబంధించిన ఒక అదనపు అవసరం అని ఎన్నికల సంఘం పేర్కొంది. బిహార్ ఎస్ఐఆర్‌పై తన తీర్పులో సుప్రీంకోర్టు ఆ డిక్లరేషన్‌ను సమర్థించిందని కూడా అది తెలిపింది. తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా 'ఎస్ఐఆర్'పై నిర్ణయాలు, ఉత్తర్వులు జారీ చేయబడ్డాయని పేర్కొంటూ, గత 10 నెలల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్‌జోషి కనీసం 14సార్లు రికార్డుల్లో అభ్యంతరాలు వ్యక్తంచేశారని, 'ఇండియన్ ఎక్స్ ప్రెస్' కథనం పేర్కొన్న తర్వాత సెప్టెంబరు 26న ఈ నిర్ణయాలు వెలువడ్డాయి.

## నౌకాదళంలో అత్యున్నత స్థాయి...
# పోరాట సంసిద్ధతను కొనసాగించాలి

కమాండర్లకు రక్షణ నాయకత్వం పిలుపు

**న్యూఢిల్లీ :** నౌకాదళంలో అత్యున్నత స్థాయి పోరాట సంసిద్ధతను కొనసాగించాలని, సముద్ర నిఘాను మరింత బలోపేతం చేయాలని దేశ అత్యున్నత రక్షణ నాయకత్వం కమాండర్లను కోరింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భారతదేశ ఇంధన భద్రతను కాపాడటంలో నౌకాదళం పాత్రను నొక్కిచెప్పింది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ది డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి, ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్, నేవీ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 1వరకు ఇక్కడ నౌసేనా భవన్‌లో జరుగుతున్న రెండవ ఎడిషన్ నేవీ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2026లో సెషన్‌లను ఉద్దేశించి ప్రసంగించారు. తన ప్రసంగంలో సింగ్, సముద్ర రంగంలో భారతదేశానికి సంబంధించి 'పెరుగుతున్న వ్యూహాత్మక బాధ్యతలను' తొలి స్పందనదారుగా, 'హిందూ మహాసముద్రంలో ప్రాధాన్యత కలిగిన భద్రతా భాగస్వామిగా' నౌకదళం పాత్రను నొక్కిచెప్పారని నౌకాదళ ప్రతినిధి చెప్పారు. సముద్ర నిఘా, విశ్లేషణాత్మక సామర్థ్యం, కార్యాచరణ ప్రతిస్పందనను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రస్తావిస్తూ భారత నౌకాదళం నేతృత్వం వహిస్తున్న 'ఆపరేషన్ ఊర్జా సురక్ష' భారతదేశ ఇంధన భద్రతను కాపాడటంలో దాని సహకారాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రముఖంగా పేర్కొన్నారు. ఆయన ఆత్మనిర్భరత, స్వదేశీ సామర్థ్య అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంపైనా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఉద్ఘాటించారు. భార త నౌకాదళాన్ని ఒక వ్యూహాత్మక శక్తి గుణకంగా' సిడిఎస్ గుర్తించారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం - C
**ప్రకటన**
(చట్టంలోని సెక్షన్ - 11 క్రింద 10 A మినహాయింపు ఇవ్వబడినది)
(రూల్ 6/12 చూడుము)

గెజిట్ నెం. GHMC-38 — తేది: 24.09.2026
నెం. C/946/2026 — తేది: 24.09.2026

తెలంగాణ ప్రభుత్వం/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) & కమిషనర్, GHMC వారికి ప్రజా ప్రయోజనం కోసం **రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ మండలం, నాదర్‌గుల్ గ్రామంలో బడంగ్‌పేట్ మెయిన్ రోడ్డు నుండి నాదర్‌గుల్ రామాలయం మీదుగా తుర్కయాంజల్ వరకు ప్రతిపాదించిన 100 అడుగుల వెడల్పు గల రోడ్డు కారిడార్ నం. 24 నిర్మాణానికి సంబంధించి** కుడి వైపున ఉన్న 62 ఆస్తుల పరిధిలోని మొత్తం **11,894.36 చదరపు గజాల** భూమి అవసరమని భావించడమైనది.
కావున, పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం **రంగారెడ్డి జిల్లా, బాలాపూర్ మండలం, నాదర్‌గుల్ గ్రామంలో** సుమారు **11,894.36 చదరపు గజాల** ఎక్కువ లేదా తక్కువ ప్రామాణికత విస్తీర్ణం కలిగిన భూమిని సేకరించాలని ప్రతిపాదించడమైనదని ఇందు మూలంగా తెలియజేయడమైనది. దీని వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

| క్రమ సంఖ్య | ప్రాంగణం నెంబర్ / సర్వే నెం. | [illegible] రకం | [illegible] రకం | విస్తీర్ణం చ.గ. లలో | ఆసక్తి గల వ్యక్తి పేరు | సరిహద్దులు: తూర్పు | సరిహద్దులు: పడమర | సరిహద్దులు: ఉత్తరం | సరిహద్దులు: దక్షిణం | చెట్లు: రకం | చెట్లు: సంఖ్య | కట్టడాలు: రకం | కట్టడాలు: [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 4-131 | యజమాని | - | 2.02 | జె. బాబయ్య | | | | | - | - | IZ | |
| 2 | 4-132 | యజమాని | - | 53.49 | జె. శ్రీనివాస్ | | | | | - | - | 2P | |
| 3 | 3-6 | యజమాని | - | 92.26 | జెల్లా జంగయ్య | | | | | - | - | 2P | |
| 4 | 11-3-Na0010 | యజమాని | - | 132.72 | జెల్లా శ్రీకాంత్ | | | | | - | - | IZ+ ఖాళీ | |
| 5 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 161.05 | నాగరాజు | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 6 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 150.78 | అనిరుధ్ | | | | | - | - | ఖాళీ + IZ | |
| 7 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 207.88 | కోటేశ్వర్ | స్కెచ్ ప్రకారం | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 8 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 327.12 | జి. ఇంద్రశేఖర్ రెడ్డి | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 9 | 3-11 | యజమాని | - | 246.71 | జి. సంజీవ రెడ్డి, జి. కృష్ణారెడ్డి | | | | | - | - | ఖాళీ + IZ | |
| 10 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 145.89 | అంజయ్య | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 11 | 3-12 | యజమాని | - | 105.68 | సయీద్ సిరాజ్ | | | | | - | - | IZ + IZ | |
| 12 | 3-13 | యజమాని | - | 110.13 | సయీద్ సిద్దిక్ | | | | | - | - | సాయిరాం టెంట్ | |
| 13 | 3-14/A/1 | యజమాని | - | 273.73 | అంకంగారి రవి & ఇతరులు | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 14 | 3-15 | యజమాని | - | 64.72 | పి వేంకటేశ్వర రావు | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 15 | 3-16 | యజమాని | - | 122.36 | సయీద్ మోహిన్ | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 16 | 3-16 | యజమాని | - | 185.7 | సయీద్ మోహిన్ | | | | | - | - | IZ | |
| 17 | 3-17 | యజమాని | - | 148.66 | మర్రి లలిత | | | | | - | - | ఖాళీ + 2P | |
| 18 | 3-17 | యజమాని | - | 100.71 | మర్రి లలిత | | | | | - | - | ఖాళీ | |
| 19 | 3-19 | యజమాని | - | 357.61 | ఎం. శివకుమార్ | | | | | - | - | IZ | |
| 20 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 66.59 | జీవన్ రెడ్డి | | | | | - | - | IZ | |
| 21 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 94.07 | యజమాని | | | | | - | - | 2P | |
| 22 | 3-20 | యజమాని | - | 146.33 | మర్రి శ్రీనివాస్ రెడ్డి | స్కెచ్ ప్రకారం | | | | - | - | కిడ్స్ జోన్ స్కూల్ IP | |
| 23 | 3-23 | యజమాని | - | 193 | మునిసిపల్ వార్డ్ ఆఫీస్ | | | | | - | - | IP + ఖాళీ | |
| 24 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 23.59 | యజమాని | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 25 | 3-24 | యజమాని | - | 138.38 | జక్కిడి రామ్‌రెడ్డి | | | | | - | - | IP | |
| 26 | 3-25 | యజమాని | - | 103.69 | సామ యాది రెడ్డి | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 27 | 3-26 | యజమాని | - | 84.15 | సామ యాది రెడ్డి | | | | | - | - | ఖాళీ | |
| 28 | 3-27 | యజమాని | - | 68.14 | సామ బుచ్చి రెడ్డి | | | | | - | - | 3P | |
| 29 | 3-34 | యజమాని | - | 44.52 | సామ బుచ్చి రెడ్డి | | | | | - | - | IZ షెడ్డు + IZ | |
| 30 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 108.46 | కందాడి వెంకట్ రెడ్డి | | | | | - | - | IZ + ఖాళీ | |
| 31 | 3-46 | యజమాని | - | 135.4 | తోట సాతి రెడ్డి | | | | | - | - | IP + ఖాళీ | |
| 32 | 3-47 | యజమాని | - | 83.37 | కటికరెడ్డి శ్రీనివాస్ రెడ్డి | | | | | - | - | ఖాళీ + IZ షెడ్ | |
| 33 | 3-49 | యజమాని | - | 224.43 | వై దయాకర్ రెడ్డి | | | | | - | - | 2P + ఖాళీ | |
| 34 | 3-50 | యజమాని | - | 138.89 | తోట శ్రీధర్ రెడ్డి | | | | | - | - | 2P + ఖాళీ | |
| 35 | 3-53 & 54 | యజమాని | - | 131.38 | తోట శ్రీకాంత్ రెడ్డి | | | | | - | - | 3P | |
| 36 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 140.35 | ఎస్ నరేష్ | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 37 | 3-55 | యజమాని | - | 70.31 | కలీం నీలమ్మ | | | | | - | - | 2P + ఖాళీ | |
| 38 | 3-56 | యజమాని | - | 93.74 | కలీం రాజిరెడ్డి | | | | | - | - | 1P | |
| 39 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 181.99 | టి మనీష్ యాదవ్ | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 40 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 97.7 | టి బిక్షపతి | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 41 | 3-72 | యజమాని | - | 110.34 | టి కమరయ్య | | | | | - | - | 2P | |
| 42 | 3-73 | యజమాని | - | 128.59 | టి ఐలయ్య | | | | | - | - | 2P + ఖాళీ | |
| 43 | 3-81/2 | యజమాని | - | 44.73 | ఎన్ జంగయ్య | | | | | - | - | 3P | |
| 44 | 3-81/1 | యజమాని | - | 91.22 | ఎన్ సత్యనారాయణ | | | | | - | - | 3P + ఖాళీ | |
| 45 | 3-82 | యజమాని | - | 138.6 | టి బిక్షపతి | | | | | - | - | 3P + ఖాళీ | |
| 46 | 3-82/1 | యజమాని | - | 148.67 | టి బిక్షపతి | | | | | - | - | 3P + ఖాళీ | |
| 47 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 116.75 | టి బిక్షపతి | | | | | - | - | ఖాళీ + IZ | |
| 48 | 3-83 | యజమాని | - | 131.98 | టి శ్రీధర్ రెడ్డి | | | | | - | - | ఖాళీ | |
| 49 | 3-84 | యజమాని | - | 131.34 | కోవా శ్రీశైలం | | | | | - | - | ఖాళీ + IZ | |
| 50 | 3-92/1 | యజమాని | - | 95.33 | కోవా ఐలయ్య | | | | | - | - | 2P +2P | |
| 51 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 89.89 | ఖాళీ స్థలం | స్కెచ్ ప్రకారం | | | | - | - | ఖాళీ | |
| 52 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 138.79 | జయలక్ష్మి | | | | | - | - | ఖాళీ | |
| 53 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 332.89 | కటికరెడ్డి రాంరెడ్డి | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 54 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 379.23 | యజమాని | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 55 | 3-96 | యజమాని | - | 189.41 | ఎన్ జంగయ్య యాదవ్ | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 56 | - | యజమాని | - | - | - | | | | | - | - | - | |
| 57 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 193.26 | యజమాని | | | | | - | - | 2P | |
| 58 | 3-126 | యజమాని | - | 187.35 | వై శంకర్ రెడ్డి | | | | | - | - | 2P | |
| 59 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 284.22 | యజమాని | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 60 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 1316.28 | యజమాని | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| 61 | ఖాళీ ప్లాట్ | యజమాని | - | 178.16 | యజమాని | | | | | - | - | ఖాళీ + IP | |
| 62 | ఖాళీ స్థలం | యజమాని | - | 2109.63 | యజమాని | | | | | - | - | ఖాళీ ప్లాట్ | |
| | మొత్తం | | | 11894.36 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) సెక్షన్–11(1) యొక్క సవరించబడిన భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయ బద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు చట్టం 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) ఏర్పాట్ల క్రింద సంబంధితులు అందరికీ ఈ ప్రకటన జారీ చేయడమైనది.
స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్, GHMC, హైదరాబాద్ వారి కార్యాలయంలో ఉంచబడిన భూమి యొక్క ప్లాన్‌ను ఏదేని పని రోజున కార్యాలయ పని వేళల్లో తనిఖీ చేసుకొనగలరు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్, GHMC, హైదరాబాద్ –సహిత–సముచిత ప్రభుత్వం అధీకృత అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, కమిషనర్, GHMC, హైదరాబాద్ వారిని మరియు వారి సర్వే సిబ్బందిని సర్వే భూమి నందు ప్రవేశించుటకు మరియు భూమిని సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవల్స్ తీసుకొనుటకు, సబ్–సాయిల్‌ను తవ్వుటకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టం యొక్క సెక్షన్–12 నందు ఏర్పాటు చేయబడిన మరియు నిర్దిష్ట పరిచిన విధంగా తమ పని కొరకు అవసరమైన అన్ని ఇతర చర్యల్ని చేపట్టు నిమిత్తం వారిని అధీకృతుల్ని చేయుటకు సమ్మతించినారు.
చట్టం యొక్క సెక్షన్–11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్, GHMC, హైదరాబాద్ వారి ముందస్తు అనుమతి లేకుండా సదరు ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అయినా సదరు భూమికి సంబంధించి ఏ విధమైన లావాదేవీ నిర్వహించుట కానీ, ఏదేని లావాదేవీ కొరకు ప్రేరేపించుట కానీ అనగా విక్రయం / కొనుగోలు, వగైరా లేదా సదరు భూమిపై ఏవేని తాకట్టు రుణభారాలు కల్పించుట కానీ చేయరాదు.
ఒకవేళ సేకరణకు సంబంధించి ఏవేని అభ్యంతరములు ఉన్న యెడల మరియు సంప్రదింపు ద్వారా నష్ట పరిహారం సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి గల / బాధిత వ్యక్తులు అందరి నుండి ఏవేని క్లెయిములు ఉన్నచో చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోగా స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్, GHMC, హైదరాబాద్ / అధీకృత అధికారి సమక్షమున ఫైల్ చేయవలెను.

సం/– స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), జి.హెచ్.ఎం.సి., హైదరాబాద్.
సం/– స్పెషల్ కలెక్టర్, (భూ.సే.) & కమీషనర్, జి.హెచ్.ఎం.సి., హైదరాబాద్.
DIPR No. 938/LA/PP-Advt/Agency/2026-27

**LOST CERTIFICATES**
I, **Dharavath Arunkumar, S/o. Dharavath Bharath Nayak,** R/o. H.No. 4-191/1, Konda Samudram Thanda, Mutthojipeta Mandal, Narsampet, Warangal District, Telangana State. hereby **I Lost my Original SSC Certificate. Roll No. 1631125008,** while House Change to New House Near Hanuman Temple. If anybody found Return to the above Mentioned Address.
**Contact No: 9177873415**

## ఫ్రాన్స్‌లో విద్యార్థుల నిరసన హింసాత్మకం: 440 మంది అరెస్టు



పారిస్: ఫ్రాన్స్‌వ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘర్షణల్లో 48 మంది పోలీసు అధికారులు గాయపడ్డారు.దీంతో పోలీసులు తీవ్ర చ ర్యలు తీసుకున్నారు. పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. పోలీసులు 440 మంది విద్యార్థులను అరెస్టు చేశారు.దేశంలో పాఠశాలలు,తరగతి గదులు కిక్కిరిసిపోయాయని,ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు,యువకులు దేశవ్యాప్తంగా డజన్లసంఖ్యలో పాఠశాలలను దిగ్బంధనం చేశారు. ఈ నిరసన చివరకు హింసాత్మకంగా మారింది.పోలీసులకు,విద్యార్థులకు జరిగిన ఘర్షణ తర్వాత విద్యార్థులు కనిపించినవాటిని దగ్ధం చేశారు.ఈ అల్లర్లలో దేశవ్యాప్తంగా 440 మందిని అరెస్టు చేసినట్లు అంతర్గతశాఖామంత్రి లారెంట్ నునెజ్ చెప్పారు.విద్యార్థులు పోలీసుల మీదకు హైడ్రో క్లోరిక్ యాసిడ్ సీసాలు విసిరారని చెప్పారు.విద్యార్థులు మాస్కులు ధరించి,ముసుగులు కప్పుకుని,ఆయుధాలు చేతపట్టుకుని విద్యాలయాల వద్దకు వచ్చారని,పోలీసులు వచ్చేవరకూ వారు వేచి ఉన్నారని,అల్లర్లకు పాల్పడ్డారని,ఇలాంటి వారిని సహించేదిలేదని మంత్రి చెప్పారు.గతవారంలో పారిస్‌లో ప్రారంభమైన నిరసనలకు కొనసాగింపుగా దేశవ్యాప్తంగా ఈ అల్లర్లు చెలరేగడంతో ప్రభుత్వం భారీసంఖ్యలో పోలీసు,రక్షణ బలగాలను మోహరించింది.పారిస్‌లో లామార్టిన్ పాఠశాల వెలుపల ఉదయం నుండి సాయంత్రం వరకూ విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేశారు. నిద్రపోయే సమయం కంటే ఎక్కువ సమయం పాఠాలు వినాల్సివస్తోందంటూ వారు ప్ల కార్డులు ప్రదర్శించారు. ''మేక్రాన్ విస్ఫోటనం'' అని రాసి ఉన్న ప్ల కార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్నూ ఈ నిరసన ప్రదర్శనలను బాధ్యతారాహిత్యమైనవని మండిపడ్డారు. ఐతే ఈ నిరసన ప్రదర్శనలు,ర్యాలీలలో కొందరు ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

## అమెరికా నుండి ఇరాన్‌కు అధికారిక ప్రతిపాదన



- పుంజుకున్న యుద్ధ విరమణ చర్యలు?
- మంత్రివర్గ సమావేశంలో అరాఘ్చి చర్చ
- ఇరాన్ మహిళా ప్రతినిధి ఫాతిమా ప్రకటన

టెహ్రాన్: హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు,యుద్ధ విరమణ చర్చలు ప్రారంభించేందుకు ఏడురోజుల ప్రణాళికను డోనాల్డ్ ట్రంప్ ప్రతినిధులకు ఇరాన్ సమర్పించిన తర్వాత యుద్ధ పరిష్కార చర్యలు వేగం పుంజుకున్నాయి.ఇరాన్‌కు అమెరికా బుధవారం ఒక అధికారిక ప్రతిపాదన పంపించింది.ఈ ప్రతిపాదనలో ఏముందనే విషయం వెంటనే తెలియరాలేదు.అమెరికా పంపిన ప్రతిపాదనను ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి తమ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు సమర్పించారు.అదేవిధంగా తన అమెరికా పర్యటన వివరాలు,విశేషాలను మంత్రివర్గం ముందు ఉంచి చర్చించారు. ఐతే యుద్ధం త్వరలో ముగుస్తుందని,తాము విజయం సాధిస్తామని ఒక రోజు క్రితమే ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.దీంతో మళ్ళీ సర్వత్రా ఆశావహ వాతావరణం నెలకుంటున్నది.గడచిన జూన్ 17వ తేదీన ఎంఓయు ఒప్పందంపై సంతకాలు జరిగినప్పుడు యుద్ధం ముగిసిందని ప్రపంచం ఆశాభావంతో ఉత్సాహపడిన వాతావరణం మళ్ళీ కనిపించే అవకాశం ఉండొచ్చు.ఈ పరిణామాల మధ్య ఐఆర్‌జిసి కూడా అమెరికా ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాసింది. అమెరికా సైనికుల నిజస్వరూపం తెలుసుకోవాలని,ఇరాన్ విజయం సాధించిందని ఐఆర్‌జిసి ఆ సుదీర్ఘ లేఖలో అమెరికా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

అమెరికా నుండి ఇరాన్‌కు అధికారికంగా ఒక ప్రతిపాదన వచ్చిందని,మంత్రివర్గ సమావేశంలో అబ్బాస్ అరాఘ్చి న్యూయార్క్‌లో మంతనాల పర్యవసానాలను వివరించారని,ఎక్స్ వేదికగా ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి ఫాతిమా మొహజెరానీ ప్రకటించారు.ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సమావేశం లోపలా,సమావేశం వెలుపలా జరిగిన పరిణామాలపై చర్చ జరిగింది.ఇరాన్ అధికారిక వార్తాసంస్థలు ఈ విషయాలు వెల్లడించాయి.

సెప్టెంబరు 22వ తేదీ నుండి ఇరాన్ యుద్ధ విరమణకు సంబంధించిన సంప్రదింపులు మధ్యవర్తుల ద్వారా వేగం పుంచుకున్నాయి. ఒకవైపు ఇరు దేశాల నాయకుల మధ్యా సవాళ్ళు,ప్రతిసవాళ్ళు,బెదిరింపులు,వినాశకర ప్రకటనలు కొనసాగుతున్నప్పటికీ తెరవెనుక మాత్రం దౌత్య చర్చల రాజకీయం ముమ్మరంగా కొనసాగుతూనే ఉంది. దాని ఫలితమే ఇరాన్‌కు అమెరికా పంపిన అధికారిక ప్రతిపాదనగా భావిస్తున్నారు.అనేక ఆంక్షల ద్వారా ఇరాన్‌ను ప్రపంచంలో ఏకాకిని చేసేందుకు శత్రువులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అంతర్జాతీయ వేదికపై ఇరాన్ చాలా ఆశాభావదృక్పథంతో,అంతర్జాతీయ చట్టాలకు లోబడి,తన సార్వభౌమాధికారాన్ని సంరక్షించుకునే హక్కులకు అనుగుణంగా వాదనలు వినిపించిందని, శత్రువు తమ ప్రతిపాదనలు తిరస్కరించినప్పటికీ ప్రపంచానికి తమ వాదనలు,తమ నిజ సందేశం చేరుకుందని ఫాతిమా అన్నారు. విదేశాంగ విధానంలో ఇరాన్ ముందుకు సాగేందుకు అనేక దేశాలతో సంప్రదింపులు చేస్తూ,తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందన్నారు. ఐతే చాలా కాలంగా ట్రంప్ తన ప్రకటనల్లో విస్మరించిన ఇరాన్ అణ్వాయుధ విషయాన్ని రెండు రోజుల క్రితమే మళ్ళీ తెరమీదకు తెచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో ఇరాన్‌కు అణ్వాయుధం అందకుండా చేస్తామన్నారు. మరోవైపు ఇరాన్ కూడా తాము అణ్వాయుధాల వెంట పడటంలేదని,అల్లా చెప్పిన సూత్రాలకు అనుగుణంగా శాంతి యుత ప్రయోజనాలకోసమే అణుశక్తిని పుపయోగించుకుంటున్నామని పునరుద్ఘాటించింది.ఐతే పశ్చిమాసియా నుండి అమెరికా సైన్యాలు ఖాళీచేసి వెళ్ళిపోవాలని, ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని,ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేయాలని ఆ దేశం ప్రధానంగా కోరుతోంది.అందుకు తగ్గట్టుగానే ఇరాన్ పొరుగుదేశం ఇరాక్ నుండి అమెరికా తన సైన్యాలను పూర్తిగా వెనక్కు తీసుకుంది. దీంతో ఇరాన్ సెలబ్రేషన్స్ చేసుకుంది.

### ఇరాక్ నుండి అమెరికా సైన్యాల ఉపసంహరణ ఇరాన్‌కు మేలు

రెండు దశాబ్దాల తర్వాత అమెరికా సైన్యాలు ఇరాక్ నుండి వైదొలగిపోయాయి.ఇరాక్‌లో అమెరికా సైన్యాల ఉనికి పొరుగున ఇరాన్‌కు పెద్ద ఆటంకంగా ఉంది. దీంతో అందరికంటే ఎక్కువగా ఇరాన్‌కే మేలు జరుగుతుంది.పశ్చిమాసియా నుండి అమెరికా సైన్యాలను వెళ్లగొట్టడమే లక్ష్యంగా భావిస్తున్న ఇరాన్ కూటమి దేశాలు,ఇరాక్ నుండి యుఎస్ బలగాలు వెళ్ళిపోవడాన్ని మిత్ర సాయుధబృందాల విజయంగా అభివర్ణించాయి. ఇరాన్ సర్వాధినేత మొజ్తాబా ఖమేనీ కూడా ఒకరోజు ముందే ప్రకటన చేస్తూ, శత్రువులను తరిమి కొట్టామని, ఇరాన్ ప్రముఖస్థానానికి ఎదిగిందని పేర్కొన్నారు.

అమెరికన్లు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టిన తర్వాత ఇరాక్‌లో శాశ్వత భద్రత నెలకుంటుందని ఇరాన్ పార్లమెంటు జాతీయ భద్రతాకమిషన్ డిప్యూటీ ఛైర్మన్ అమీర్ హయత్ మొఖద్దమ్ అన్నారు. ఇరాక్ నియంత సద్దాం హుస్సేన్ రసాయనిక ఆయుధాలు దాచి ఉంచాడని,అంతడివల్ల పెద్ద ముప్పు పొంచిఉందని దుష్ప్రచారం చేసి 2003 పాశ్చాత్య సంకీర్ణ దళాలు ఇరాక్‌పై దండెత్తాయి.అక్కడే తిష్టవేశాయి.షియాల నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేశాయి. 2011లో వైదొలగినప్పటికీ ఐసిస్ ఉగ్రవాద దళాలపై యుద్ధం చేయడంలో ఇరాకీలకు సహాయం చేయడానికి 2014లో తిరిగి వచ్చి 2017 వరకూ అక్కడే ఉన్నాయి. కొన్ని దళాలు ఈనాటివరకూ అక్కడే కొనసాగాయి.అమెరికా సైన్యాలు బుధవారంనాటికి (సెప్టెంబరు 30) చిట్టచివరి స్థావరాలు, శిబిరాల నుండి వైదొలగిపోయాయి. దాదాపు ఇరవై సంవత్సరాలపాటు జరిగిన యుద్ధంలో 4,500 మంది అమెరికా సైనికులు ఇరాక్‌లో మరణించారు.2024లో జో బైడెన్ దేశాధ్యక్షుడుగా ఉన్న సమయంలో ఈ వైదొలగే ప్రక్రియ ఒప్పందం జరిగింది.డోనాల్డ్ ట్రంప్ హయాంలో పూర్తిగా ఆచరణ జరిగింది. ఇరాన్‌కు మద్దతు ఇచ్చే అనేక సాయుధ వర్గాలు ఉన్నాయి. ఈ వర్గాలన్నీ ఇరాక్‌లో ఉన్న ''ఇస్లామిక్ రెసిస్టెన్స్''అనేక ఒక పెద్ద సంస్థ కేంద్రంగా ఒకే వేదికగా కేంద్రీకృతమయ్యాయి. ఈ ఇస్లామిక్ రెసిస్టెన్స్ కమాండర్ అబూ మొజ్తాబా–అల్ యాసిరి ఈ పరిణామంపై మంగళవారం స్పందిస్తూ, అమెరికా సైన్యాల ఉపసంహరణ ఇరాకీ ఇస్లామిక్ ప్రతిఘటన బృందాలకు,గౌరవనీయమైన ఇరాకీ సైన్యాలకు ఒక చారిత్రక విజయం అన్నారు.ఇరాక్‌లో ''అమెరికా ప్రాజెక్టు'' ఘోర పరాజయం పొందిందన్నారు.బుధవారంనాటితో(సెప్టెంబరు 30) ఒక చీకటి అధ్యాయం ముగిసిందన్నారు.

## 13 % లోటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు ఒకేలా లేవు. ఇక్కడ ఈసారి తీవ్ర అసమాన పరిస్థితులు కనిపించాయి. దేశవ్యాప్తంగా మొత్తం జిల్లాల్లో 38 శాతం అంటే ఏకంగా 282 జిల్లాలు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొన్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలో కూడా భారీ వ్యత్యాసాలు కనిపించాయి. జులై 8తో ముగిసిన వారంలో సాధారణం కంటే 45.4 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, ఆ మరుసటి వారమే ఏకంగా 51.1 శాతం లోటు కనిపించింది. వారంలోనే పరిస్థితులు తలకిందులయ్యాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు దాదాపుగా ముఖం చాటేశాయి. సెప్టెంబర్ రెండో వారంలో కూడా 36.3 శాతం లోటు వర్షపాతమే నమోదైంది. ఆఖరి వారంలో మళ్లీ అనూహ్య రీతిలో 49 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ప్రాంతాల వారీగా, నెలల వారీగా వర్షపాతంలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టమైంది.

**ఎల్ నినో ముప్పు 2027 మార్చి వరకు!**

భవిష్యత్తు వాతావరణ పరిస్థితులపైనా ఐఎండి స్పందించింది. రాబోయే శీతాకాలం, రబీ సీజన్‌లో కూడా ఎల్ నినో ప్రభావం దాదాపు 100 శాతం కొనసాగుతుందని అంచనా వేసింది. ఇది చాలా ఎక్కువ కాలం ఉంటుందని, 2027 మార్చి వరకు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. సాధారణంగా ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించే హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఇండియన్ ఓషన్ డిపోల్ (ఐఒడి) కూడా ఈసారి సానుకూలంగా లేకపోవడంతో రాబోయే కొన్ని నెలల్లో కూడా ఇలానే పొడి వాతావరణం, వర్షాభావ పరిస్థితులు కొనసాగే ముప్పు ఉందని తెలుస్తోంది. రాబోయే పంట కాలంపై దీని ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

## ట్రంప్‌కు తొలగిపోయిన ఆటంకాలు

## తృతీయ దేశానికి వలస ప్రజల బహిష్కారం: సుప్రీం ఓకే

వాషింగ్టన్: అమెరికాకు వచ్చిన వలస ప్రజలను ఎవరికీ సంబంధంలేని మూడోపక్ష దేశానికి తరలించేందుకు ఇప్పటివరకూ డోనాల్డ్ ట్రంప్ ఎదుర్కొన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి.అక్రమంగా వలస వచ్చిన,ఎలాంటి అధికారిక పత్రాలూ లేని ప్రజలను అమెరికాకు,ఆ వలస ప్రజలకు ఎలాంటి సంబంధం లేని మరో గుర్తుతెలియని తృతీయ దేశానికి పంపించేందుకు ట్రంప్‌కు హక్కులు దఖలుపడ్డాయి.దీనివల్ల అమెరికాలో ఉన్న వలస ప్రజలు అర్థంపర్థఃలేని,ఎలాంటి సదుపాయాలు లేని పేద దేశాలకు,గుర్తు తెలియని దేశాలకు తరలిస్తారు.దీనివల్ల కొత్త ప్రాంతంలో ప్రజలు నరకం అనుభవిస్తారు. దక్షిణ అమెరికాలోని కొన్ని పేద దేశాలకు కొంత డబ్బులు ఇచ్చి వలస ప్రజలను అక్కడికి తరలించే ఒక ఉపాయాన్ని ఇప్పటికే ట్రంప్ అమలు చేశారు. మైగ్రేషన్ పాలసీ ఇనిస్టిట్యూట్ సమాచారం ప్రకారం ట్రంప్ ఇప్పటివరకూ 15000 మంది వలస ప్రజలను ఇతర దేశాలకు బహిష్కరించారు. వీరిలో ఎక్కువమందిని మెక్సికోదేశం స్వీకరించింది. దీనిపై దేశంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. చివరకు ఈ విషయంలో సుప్రీంకోర్టు తాజాగా బుధవారం ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.అమాయకులైన ప్రజలను,అనేక దశాబ్దాలుగా అమెరికాలో నివసిస్తున్నవారిని కూడా పొరపాటునో,గ్రహపాటునో అక్రమంగా తృతీయ పక్షం దేశాలకు తరలించడంతో తీవ్ర వ్యతిరేకత ట్రంప్‌కు ఎదురవుతోంది. తమకు ఎలాంటి సంబంధంలేని మూడోపక్ష దేశానికి అమెరికా నుండి బహిష్కరించిన వలస ప్రజలను తరలించేందుకు ఇప్పటివరకూ ట్రంప్‌కు అడ్డంకులు ఎదురయ్యాయి.ప్రస్తుత ప్రక్రియ చట్టవిరుద్ధమని పేర్కొన్న అప్పీలుకోర్టు తీర్పును సవాలు చేస్తూ, ట్రంప్ యంత్రాంగం దాఖలు చేసిన అభ్యర్థనకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తీర్పు వెలువడింది.ఐతే ముగ్గురు ఉదారవాదులైన న్యాయమూర్తులు మాత్రం ఈ మెజార్టీ తీర్పును విభేదించారు.నేరాలు చేయడానికి అమెరికాకు అక్రమంగా వలసవచ్చేవారికి ఇది చెడ్డరోజు అని హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ జనరల్ కౌన్సిల్ జేమ్స్ పెర్సివాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటికి 3000 డాలర్లు, ఒక విమానం టిక్కెట్లు ఇవ్వడానికి ఇంకా గడువు ఉందని,సమయం మించిపోలేదని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన వలస ప్రజలను కోరారు. ఈ ఉత్తర్వుల మేరకు ఎనిమిదిమంది పురుషులను దక్షిణ సూడాన్‌కు ట్రంప్ ప్రభుత్వం పంపించేందుకు వీలు కలిగింది. 2025లో ట్రంప్ పదవీకాలం ప్రారంభమైనప్పటినుండీ దక్షిణ సూడాన్,ఎస్వాటిని,రువాండా సహా అనేక ఇతర దేశాలకు వేలాదిమంది వలస ప్రజలను ట్రంప్ ఇప్పటివరకూ తరలించారు.



## దేశవ్యాప్తంగా యాత్రలు

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఇప్పుడు రాహుల్ జీ చెప్పింది సరైనదేనని అందరూ గ్రహిస్తున్నారు, అది అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, మొదట ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'నోట్ల రద్దు' చేశారు, ఇప్పుడు 'ఓటు రద్దు' చేస్తూ ప్రజల హక్కులను లాక్కుంటున్నారని ఖర్గే మండిపడ్డారు. 'సర్' ఎన్నికల అవకతవకల కేసులను వేగవంతం చేయాలని ఇండియా బ్లాక్ నాయకులు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారని ఖర్గే తెలిపారు. ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్లకు తిరిగి వెళ్లడం గురించి అడగగా, అన్ని ఎన్నికలు బ్యాలెట్ ద్వారానే జరగాలని, అధికారంలో ఉన్న ఈ 'దొంగ ప్రభుత్వం' రూపొందించిన చట్టాలను రద్దు చేయాలని అందరూ నూటికి నూరు శాతం అంగీకరించారని ఖర్గే అన్నారు. శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే, జార్ఖండ్ ముఖ్యమంత్రి, జెఎంఎం అధినేత హేమంత్ సోరెన్ వంటి కొందరు నాయకులు ఈ సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారని ఆయన తెలిపారు. అందరూ ఏకగ్రీవంగా కలిసి పోరాడాలని ప్రతిజ్ఞ చేశారన్నారు. ఎన్నికల కమిషన్‌ను నడిపించే 'సూత్రధారులు' మోదీ, హోం మంత్రి అమిత్ షా అని ఖర్గే ఆరోపించారు. అక్కడ కనిపించే వ్యక్తులు కేవలం పావులు మాత్రమే అని, ఓట్ల దొంగతనం వెనుక ప్రధాని, హోం మంత్రి ఉన్నారని, అందుకే వారు ఎన్నికల్లో గెలుస్తున్నారని ఖర్గే ఆరోపించారు. అంతేకాకుండా, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వారిని వారు వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్య వ్యవస్థపై మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్ దాడి : రాహుల్**

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రధాని మోదీ, హోం మంత్రి షా, సిఇసి జ్ఞానేష్ కుమార్ దాడి చేశారనే అభిప్రాయాన్ని అన్ని పార్టీలు వ్యక్తం చేశాయని రాహుల్ గాంధీ అన్నారు. తాము దీనిని చూస్తూ ఊరుమని, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారికి శిక్ష పడేలా చూస్తామని చెప్పారు. ప్రధాని, హోం మంత్రి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారని, ఎన్నికలను అపహరించారని ప్రజలకు తెలియజేయడంలో ప్రతిపక్షం విజయవంతమైందని రాహుల్ గాంధీ అన్నారు. 'రాజ్యాంగాన్ని సమష్టిగా రక్షించాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులందరిపై ఉందని, రాబోయే కొద్ది నెలల్లో దేశంలో కీలక మార్పులు తీసుకువస్తామని నేను వారితో చెప్పాను' అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'జ్ఞానేష్ కుమార్ ఒక 'దొంగ, దోపిడీదారు' అని, ఆయన వెంటనే రాజీనామా చేయాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. ఓటు వేయడం మన రాజ్యాంగపరమైన హక్కు' అని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఆందోళన భూమి నుండి ఆకాశానికి (ప్రతి మూలకు) వెళ్తుందని, ఇదే తమ బలమైన డిమాండ్ అని బెనర్జీ అన్నారు.

## బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ పరిణామం. 19 పార్టీలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. అవి – కాంగ్రెస్, సమాజ్‌వాదిపార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి(శరద్‌పవార్), శివసేన (యుబిటి), ఆర్‌జెడి, సిపిఐ, సిపిఐ(ఎం), జె అండ్ కె నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, జెఎంఎం, సిపిఐ–ఎంఎల్, ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్ (మణి), ఎండిఎంకె, విసికె, ఆర్ఎస్‌పి, కేరళ కాంగ్రెస్ (జోసఫ్), ఫార్వర్డ్ బ్లాక్. ఈ పార్టీలు గాక, మోదీ ప్రభుత్వం అధికారంలో ఉండటానికి ఎన్నికల కమిషన్ ద్వారా ఇటీవల అమలు జరుపుతున్న 'ఓట్ చోరీ' పన్నాగాన్ని వ్యతిరేకిస్తున్న, దాని దాడులనుంచి రాజ్యాంగాన్ని కాపాడటానికీ ఇతర ప్రతిపక్ష పార్టీ లు ఐక్యంగా ఉన్నాయి అని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ సోషల్ మీడియా పోస్టులో రాశారు. ఇండియా కూటమి ఐక్యతను ఈ నిర్ణయాలు విజయవంతంగా చాటి చెప్పాయి.

సమావేశంలో చర్చల అనంతరం కాంగ్రెస్ నాయకుడు, ఎల్ఒపి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ – ''చర్చలు మంచిగా జరిగాయి. నరేంద్రమోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ ఎన్నికలను అపహరించారన్నది మా సమష్టి అభిప్రా యం. మేము దీన్ని చూస్తూ చేతలుడిగి కూర్చోము. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసినవారు, ఎంత సీనియర్ లైనా సరే శిక్షించబడాల్సిందే. మీరు సమష్టిగా రాజ్యాంగ సంరక్షకులని నేను ప్రతిపక్ష నాయకులకు చెప్పాను'' అన్నారు.

ఇవిఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఇండియా కూటమి నాయకులందరూ అంగీకరించారని ఖర్గే చెప్పారు. 'ఈ చోరీ ప్రభుత్వం ఇసిఐకి సంబంధించి తెచ్చిన చట్టాలన్నీ రద్దు చేయాలి' అని సమావేశం కోరింది.

**సమావేశంలో మల్లికార్జున ఖర్గే ప్రస్తావించిన ప్రతిపక్షాల ఆరు కోర్కెలు :**

1. భవిష్యత్ ఎన్నికల్లో సర్‌కు పూర్వమున్న ఓటర్ల జాబితాలు ఉపయోగించాలి. ఓటర్ల జాబితాల సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలి. చేర్పులు, తొలగింపులు, దిద్దుబాట్లపై నియోజకవర్గం వారీ, బూత్ వారీ సమాచారం ఉండాలి.
2. చట్టబద్ధమైన ఏ ఓటరు పేరునైనా జాబితానుంచి తొలగించేటపుడు అతడు లేక ఆమెకు కారణాలతో సరైన నోటీసులివ్వాలి, అప్పీలుకు ఏర్పాటు ఉండాలి.
3. అర్హులైన ఓటర్లను తొలగించకుండా రక్షణ.
4. ఇవిఎంల బదులు బ్యాలెట్ పేపరు ద్వారా ఓటింగ్.
5. సంస్థాగత జవాబుదారీతనం.
6. రాజకీయ పార్టీల విశ్వాసం చూరగొనగలిగిన ఎన్నికల కమిషన్.

ఎన్నికల కమిషన్ సెలక్షన్ కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, క్యాబినెట్ మంత్రిని చేర్చుతూ ప్రధానమంత్రి 2023లో సిఇసి, కమిషనర్‌ల (నియామకం, సర్వీసు నియమాలు, పదవీకాలం) బిల్లు ఎందుకు తెచ్చారో (ఇప్పుడది చట్టం) ఇప్పుడు అర్థమవుతున్నదని ఖర్గే చెప్పారు. ఇతర చట్టాల్లో ఉన్న విషయాలతో నిమిత్తం లేకుండా, సిఇసి/ఇసిలుగా పనిచేసిన, చేస్తున్న వ్యక్తులపై – వారి విధి నిర్వహణలో తీసుకున్న చర్య, ఇచ్చిన మాట, చేసిన పని, మాట్లాడిన మాటకు సంబంధించి ఏ కోర్టు కూడా వారిపై సివిల్ లేదా క్రిమినల్ కేసులు చేపట్టకూడదు. తద్వారా ప్రధానమంత్రి సిఇసి/ఇసిలకు కేసులనుండి జీవితాంతం రక్షణ కల్పించారని ఖర్గే అన్నారు.

## కాంగ్రెస్‌లోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

గెలుపోటములు నిర్ణయమయ్యే నియోజకవర్గాల్లో ఈ తరహా కుట్రలు ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ తమకు విపరీతమైన ప్రజాదరణ ఉన్న చోట 30 వేల నుండి 40 వేల ఓట్లు తొలగించినప్పటికీ మెజారిటీ తగ్గి గెలుపొందుతున్నామని వివరించారు. రాజకీయ పార్టీలు ఓడిపోవచ్చు లేదా గెలవవచ్చు కానీ, పౌరులకు రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై విశ్వాసం సడలకుండా చూడటమే ప్రధానమని స్పష్టం చేశారు. 100 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో తాము వేసే ఓటుపై అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు, ఆ సందేహాలను నివృత్తి చేసి పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉందన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నందుకు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి అధికారం నుంచి వైదొలగాలని ఉప ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేవలం 'ఫ్రీబీస్'గా చూడటం సరికాదని, మానవ వనరుల వికాసానికి, జిఎస్‌డిపి పెరగడానికి పెట్టుబడులు భట్టివిక్రమార్క అన్నారు. పేదలకు ఇళ్లు, మెరుగైన ఆహారం, విద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ద్వారా మానవ వనరులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రాష్ట్ర జిఎస్‌డిపిపై ప్రభావం చూపేలా ఉండాలన్నదే తమ విధానమన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలి. దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి గణనీయంగా ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ, తిరిగి వచ్చే వనరుల విషయంలో సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని భట్టివిక్రమార్క అన్నారు. జిఎస్‌టి సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. జిఎస్‌టి పనుల రూపంలో రాష్ట్రం నుంచి రూపాయి పన్ను పంపిస్తే కేంద్ర ఇస్తున్నది కేవలం 43 పైసలు మాత్రమేనని, అదే బిజెపి పాలిత రాష్ట్రమైన బిహార్‌కు రెండు రూపాయల వరకు ఇస్తున్నారని ఉదాహరించారు. భారతదేశాన్ని 'రాష్ట్రాల సమాఖ్య'గా గుర్తించి, దేశ ఆర్థికాభివృద్ధికి రాష్ట్రాలు అందిస్తున్న సహకారాన్ని పరిగణనలోకి తీసుకుని వనరుల పంపిణీ జరగాలని కోరారు.

## ఆందోళన విస్తరించాలి

(మొదటి పేజీ తరువాయి)

తొలగించాలన్న వామపక్షాల డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, 'ఆయన రాజీనామా ఒక్కటే పరిష్కారం' అని సందోష్ కుమార్ పిటిఐ వీడియోస్‌తో అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇండియా కూటమికి పరిమితులు ఉన్నాయని, అక్కడ దానిలోని భాగస్వామ్య పక్షాలు రాజకీయ ప్రత్యర్థులుగా ఉండవచ్చని సిపిఐ నాయకుడు అన్నారు. అయితే, అటువంటి విభేదాలు ఒక విస్తృతమైన అంశంపై సహకారానికి అడ్డుకాకూడదని ఆయన పేర్కొన్నారు. 'అన్ని లౌకిక శక్తులకు ద్వారాలు తెరిచే ఉన్నాయి. కాబట్టి, మీరు ఒక రాష్ట్రంలో ఒకరితో ఒకరు పోరాడుతున్నప్పటికీ, (ఈ అంశంపై) విస్తృత కూటమిలో భాగంగా ఉండవచ్చు' అని ఆయన అన్నారు. వామపక్షాలు, కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థులుగా ఉండి కూడా ఇండియా కూటమిలో భాగంగా ఉన్న కేరళను ఆయన ఉదహరించారు. తమిళనాడులో కూడా ఇలాంటి ఏర్పాటు జరగవచ్చని ఆయన అన్నారు. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల సంఘం (ఇసి) తప్పుగా పనిచేస్తోందని ఆరోపిస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనను ఒక బృహత్తర ఉద్యమంగా మార్చాలని వామపక్ష కూటమి కోరుకుంటోందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ అన్నారు. పెద్ద, మధ్య, చిన్న అనే తేడా లేకుండా ఎన్డీఏయేతర పార్టీలతో పాటు, కళాకారులు, రచయితలు, సాంస్కృతిక ప్రముఖులతో పాటు పౌర సమాజం కూడా ఈ ఆందోళనలో పాల్గొనాలని తాము కోరుకుంటున్నామని బేబీ పిటిఐ వీడియోస్‌తో అన్నారు. ఈ అంశం 'ఇండియా కూటమి' సంస్థాగత భవిష్యత్తు లేదా కూర్పుకు సంబంధం లేనిదని, కూటమిపై తమ వైఖరిని ఆయా పార్టీలే నిర్ణయించుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఇసి పనితీరుపై బిజెపి నేతృత్వంలోని కూటమికి చెందిన పార్టీలు వ్యక్తం చేసిన ఆందోళనలను కూడా సిపిఐ(ఎం) నాయకుడు ప్రస్తావించారు. బిజెపి నేతృత్వంలోని కూటమిలో భాగమైన మూడు పార్టీలు కూడా ప్రశ్నలు లేవనెత్తాయని, ఎన్నికల సంఘం వివిధ విషయాలపై స్పష్టత ఇవ్వాలన్నారు.

## మద్దతు ధరల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటించింది. గోధుమ పంటపై రైతుల ఆశించిన లాభం ఉత్పత్తి వ్యయంపై 106 శాతంగా ఉందని పేర్కొంది.గడచిన 12 సంవత్సరాలుగా వ్యవసాయ వృద్ధి రేటు స్థిరంగా నాలుగుశాతంగా కొనసాగుతోందని పేర్కొంది.

గోధుమలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) స్వల్పంగా రూ.25లు పెంచడంతో క్వింటాలు గోధుమల ధర రూ.2,610లకు చేరుకుంది.అదేవిధంగా పప్పు ధాన్యాలు,నూనె గింజల మద్దతు ధరను కూడా క్వింటాలుకు రూ.675లు పెంచారు.2027–28 రబీ మార్కెటింగ్ సంవత్సరం (ఏప్రిల్ నుండి మార్చి వరకు)లో ఈ ధరలు అమలులో ఉంటాయి.2026–27 రబీ మార్కెటింగ్ సంవత్సరంలో క్వింటాలు గోధుమల ధర రూ.2,585లుగా ఉండగా,వచ్చే ఏడాదికి అదనంగా రూ.25 మాత్రమే ఎంఎస్‌పి పెంచారు.

''గోధుమల ఉత్పత్తి వ్యయం క్వింటాలుకు రూ.1,264లుగా ఉంది.కానీ కేంద్ర ప్రభుత్వం గోధుమకు కనీస మద్దతు ధరను 2027 28 సంవత్సరానికిగాను క్వింటాలుకు రెట్టింపుస్థాయిలో అంటే రూ.2,610 లకు పెంచింది'' అని కేంద్ర సమాచార,ప్రసారాలశాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ సమావేశానంతరం పాత్రికేయులకు చెప్పారు.బార్లీ గింజలకు కనీస మద్దతు ధరను కింటాలుకు రూ.2,286 కు పెంచామని,2026–27 ఆర్థిక సంవత్సరంలో బార్లీ క్వింటాలు ధర రూ.2,150 మాత్రమేనని చెప్పారు.పప్పుధాన్యాలకు సంబంధించి శనగలు,మినుములు,పెసలు వంటివాటికి ఎంఎస్‌పి రూ.83 పెంచామని, దీంతో వీటి క్వింటాలు ధర రూ.5,875 నుండి రూ.5,958లకు చేరకుందని,అదేసమయంలో ఎర్రకందిపప్పునకు ఎంఎస్‌పి రూ.390 పెంచామని, దీంతో దీని క్వింటాలు ధర రూ.7,000 నుండి రూ.7,390లకు పెరిగిందని మంత్రి చెప్పారు.

ఇక నూనె గింజలు ధరను రూ.413 పెంచామని, దీంతో వీటి క్వింటాలు ధర రూ.6,200 నుండి రూ.6,613 లకు పెరిగిందని, పొద్దుతిరుగుడు గింజల ధరను అత్యధికంగా రూ.675 లకు పెంచామని, దీంతో దీని క్వింటాలు ధర రూ.6,540 నుండి రూ.7,215లకు పెరిగిందని చెప్పారు.2027–28 మార్కెటింగ్ సంవత్సరంలో 324 లక్షల టన్నుల(3.24 కోట్ల టన్నులు) ఉత్పత్తులను రైతుల నుండి సేకరిస్తామని, ఇందుకుగాను రైతులకు రూ.90,962 కోట్ల చెల్లింపులు చేస్తామని చెప్పారు.రైతులకు ఉత్పత్తి వ్యయంపై సగటున అదనంగా యాభైశాతం లాభం దీనివల్ల వస్తుందని చెప్పారు. తృణధాన్యాలకు బదులుగా పప్పు ధాన్యాలు,నూనెగింజల సాగు చేసినందుకు ప్రభుత్వం ఎంఎస్‌పి అధికంగా ఇస్తోందని చెప్పారు.

**రూ.1.86 లక్షల కోట్లతో 'పిఎం ధార'కు ఆమోదం**

దేశంలో విద్యుత్ సరఫరా లోపాలను సరిదిద్దడానికి 'పిఎం ధార' పథకం అమలు చేయడం కోసం రూ.1.86 లక్షలకోట్లు కేటాయిస్తూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాలలో విద్యుత్ వాడకం ఎక్కువ ఉన్న సమయాలలో అస్థిరత,లోడు,ఫెల్యూర్స్‌ను నివారించడానికి,సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడానికి వీలుగా50 గిగావాట్స్ బ్యాటరీ స్టోరేజీతో 135 గిగావాట్స్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో దేశీయ అంతర్గత సరఫరా వ్యవస్థలకు శక్తి చేకూర్చడానికి ఈ పథకాన్ని అమలు చేస్తారు.''ప్రధానమంత్రి–డవలపింగ్ హార్మోనైజ్డ్ అండ్ యాక్సెలరేటెడ్ రెన్యూవబుల్–ఎనర్జీ యాక్సెస్'' అనే పేరును సంక్షిప్తంగా ''పిఎం–ధార''గా పేర్కొన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాలలో 500 గిగా వాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని జోడించడం దీని లక్ష్యం.2032–33 నాటికి పూర్తిగా ఈ పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**రూ.1789 కోట్లతో ఢిల్లీలో ఇంటిలిజెంట్ ట్రాఫిక్ నిర్వహణ**

దేశ రాజధాని ఢిల్లీలో సవాలుగా మారుతున్న ట్రాఫిక్ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రణాళిక ముందుకు తెచ్చింది. రూ.1789.52 కోట్ల అంచనా ప్రతిపాదనలతో ఇంటిలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. రియల్‌టైమ్ ట్రాఫిక్ డేటాను మరింత తెలివితేటలతో,రెట్టింపు సామర్థ్యంతో నిర్వహించడానికి ఈ ఇంటిలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ దోహదపడుతుంది. వాహనాల రాకపోకలు,రోడ్ నెట్‌వర్క్,కదలికలు,సిగ్నల్ వ్యవస్థలన్నీ ఆటోమేటిక్ విధానం ద్వారా కార్యకలాపాలు కొనసాగుతాయి.కేంద్ర ప్రభుత్వం ఎన్‌సిటితోపాటు ఇప్పుడు ఐటిఎంఎస్ ద్వారా ఒక ప్రధాన సాంకేతిక వ్యవస్థను జోడించి అన్ని కార్యకలాపాలపైనా గట్టి నియంత్రణ,నిఘా కొనసాగిస్తారు.ప్రభుత్వం గుర్తించిన 42 ట్రాఫిక్ కారిడార్లలో ఈ వ్యవస్థలను అమలు చేస్తారు.

## తెలంగాణలో 615 మి.మీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

భువనగిరి జిల్లా 22, నిర్మల్ జిల్లాలో 20 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, 16 శాతం మేర తక్కువ వర్ష పాతం కురిసినా సాధారణ వర్షపాతంగా పరగణిస్తుండడంతో పలు జిల్లాలో 10 నుంచి 16 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, రెండు మూడు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

**వరి సాగుకు గట్టి దెబ్బ**

ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుపై తీవ్ర ప్రభావం పడింది. గత ఏడాది సుమారు 67 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 2026లో అది సుమారు 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. గత ఏడాదితో పోల్చితే ఇది సుమారు 18 శాతం తగ్గింది. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ గందరగోళం కారణంగా సాగు తగ్గడమే కాదు.. దిగుబడిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది.

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలల్లో నీటి నిల్వలు అడుగంట్టుతున్నాయి. కృష్ణా, గోదావరి బేసిన్లలోని లైవ్ స్టోరేజీ సామర్థ్యం సుమారు 585 టిఎంసిలు కాగా, ప్రధాన జలాశయాల్లో కలిపి సుమారు 250 మేర టిఎంసి నీటి నిల్వ మాత్రమే ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి నిల్వ సుమారు 497 టిఎంసిలు ఉండటం గమనార్హం. అదేవిధంగా రాష్ట్రంలోని సుమారు 4,034 చెరువుల్లో దాదాపు 40 శాతం చెరువుల్లో 25 శాతం కూడ నీల్లు లేకపోవడంతో భూగర్భజలాల నీటి మట్టాలు 11 నుంచి 12 మీటర్ల మేరకు పడిపోవడంతో బోరు బావుల ద్వారా కూడ సరిపోను నీరు అందే పరిస్థితి లేదు.

# భారత్ 'గోల్డెన్ డే'

## ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు ఆర్చరీలో హ్యాట్రిక్




ఆసియా క్రీడల్లో భారత్‌కు బుధవారం 'గోల్డెన్ డే' అని చెప్పవచ్చు. ఒక్కరోజే మన అథ్లెట్లు పసిడి పతకాల మోత మోగించారు. మొత్తం నాలుగు స్వర్ణాలు సాధించి పట్టికలో భారత్ స్థానాన్ని మెరుగుపర్చారు. ఇక మరికొన్ని విభాగాల్లో మన క్రీడాకారులు కాంస్య పతకాలు అందుకున్నారు.

**ఆర్చరీ కాంపౌండ్‌లో ట్రిపుల్ ధమాకా...** బుధవారం భారత్ పతకాల మోత స్వర్ణంతోనే ప్రారంభమైంది. మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ పసిడి నెగ్గింది. జ్యోతి సురేఖ, చికితా, ప్రీతికాతో కూడిన భారత త్రయం చైనాను 238–234 తేడాతో ఓడించి పోడియంపై నిలిచింది. అలాగే ఈస్కోర్‌తో భారత త్రయం ఆసియా రికార్డును సమం చేసింది. ఈ విభాగంలో అత్యధిక స్కోర్ సాధించిన కొరియా మహిళల కాంపౌండ్ జట్టు (238 పాయింట్లు)ను మన స్టార్లు సమం చేశారు. మహిళల జట్టు గోల్డ్ మెడల్ నెగ్గిన గంటలోనే మిక్స్‌డ్ టీమ్ కూడా ఆర్చరీ కాంపౌండ్‌లో పసిడి పట్టేసింది. మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత షూటర్లు సాహిల్ రాజేశ్ జాదవ్ చికిత తనిపర్తి సౌత్ కొరియాను ఢీ కొట్టింది. ఈ ఫైనల్‌లో ఇరుజట్ల స్కోర్లు (157–157) సమం అయ్యాయి. దీంతో షూట్‌ఆఫ్‌లో భారత్ టీమ్ విజయం సాధించి స్వర్ణం ముద్దాడింది.

**ట్రాప్ మిక్స్‌డ్‌లోనూ గోల్డ్ ...** ఇక ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్ టీమ్ విభాగంలోనూ భారత్‌కు స్వర్ణం దక్కింది. 3–4 స్కోర్ సాధించిన భారత్ విజేతగా నిలిచి పసిడి ముద్దాడింది. ఈ పోటీలో ఖతార్ జట్టు 3–2 స్కోరుతో రెండో స్థానంలో నిలిచింది. ఇది బుధవారం భారత్‌కు మూడో గోల్డ్ మెడల్ కావడం విశేషం.

**మళ్లీ ఆర్చరీలోనే...** పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు గోల్డ్ మెడల్ వచ్చింది. సాహిల్ రాజేష్ జాదవ్, కుశాల్ దలాల్, గణేశ్ మణిరత్నం తిరుమూరుతో కూడిన భారత త్రయం చైనాపై 238–237 తేడాతో నెగ్గింది. దీంతో కాంపౌండ్ ఆర్చరీలో మూడు విభాగాలోనూ భారత్‌కు పసిడి పతకం దక్కింది. ఇది భారత్‌కు బుధవారం నాలుగో పసిడి పతకం.

**బాక్సింగ్‌లో కాంస్యం...** బాక్సింగ్‌లో భారత్‌కు కాంస్యపతకం దక్కింది. బాక్సర్ ప్రియా ఘంఘాస్ సెమీఫైనల్ 60 కేజీల విభాగంలో చైనాకు చెందిన యంగ్ చెంగ్యూపై 1–4 తేడాతో ఓడిపోయారు. దీంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**మరికొన్ని ఈవెంట్లు – పతకాలు...** మహిళల బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెయిన్‌కు పతకం ఖాయమైంది. 75 కేజీల విభాగం సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కజకిస్థాన్ బాక్సర్ నటాలియాను లవ్లీనా 3–2 తేడాతో ఓడించింది. దీంతో ఆమె స్వర్ణ పోరుకు అర్హత సాధించింది. వరుసగా రెండు ఆసియా క్రీడల్లో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత రెజ్లర్‌గా లవ్లీనా రికార్డు కొట్టింది. పురుషుల 90 కేజీల విభాగంలో భారత బాక్సర్ కపిల్ పోఖారియా కాంస్యం దక్కించుకున్నాడు. అతడు సెమీఫైనల్ లో కజకిస్థాన్‌కు చెందిన తురాబెక్ ఖబీబుల్లావ్‌తో పోరులో 1:4(స్ప్లిట్ డెసిషన్) తేడాతో ఓడిపోయాడు. పురుషుల రెజ్లింగ్ 87కిలోల విభాగంలో భారత రెజ్లర్ సుశీల్ కుమార్ కాంస్యం సాధించాడు

**60 పతకాలు...** ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్ అథ్లెట్లు ఇప్పటిదాకా ఆయా విభాగాల్లో కలిపి మొత్తం 60 పతకాలు సాధించారు. ఇందులో 10 గోల్డ్ 21 సిల్వర్, 30 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ ప్రస్తుతం ఏడో స్థానంలో కొనసాగుతోంది.

# విండీస్ టాప్‌ఆర్డర్‌లో ముగ్గురి సెంచరీలు

### భారత్ విజయ లక్ష్యం 405



స్వదేశంలో వరసగా రెండో వన్డేలోనూ భారత బౌలర్లు తేలిపోయారు. గువాహటిలో వెస్టిండీస్ బ్యాటర్లను నిలువరించలేక భారీగా పరుగులు సమర్పించుకున్నారు. భీకర ఫామ్ కొనసాగిస్తూ ఓపెనర్ జాన్ క్యాంప్బెల్(101) సెంచరీతో దడ పుట్టించగా.. కెప్టెన్ షాయ్ హోప్ (104), అమిర్ జంగూ(114)లు సైతం ధనాధన్ ఆటతో సెంచరీలు సాధించారు. విజయంతో సిరీస్ సమం చేయాలనే కసితో ఆడిన విండీస్ టాపార్డర్ సెంచరీలతో కదం తొక్కింది. ఓపెనర్ కేసీ కార్టీ(9)ని ప్రసిద్ధ్ కృష్ణ(145) త్వరగా ఔట్ చేసినా ఆఆనందం భారత్‌కు దక్కలేదు. తొలి వన్డేలే అర్ధ శతకంతో రెచ్చిపోయిన జాన్ క్యాంప్బెల్(101: 68 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లు) సుడిగాలి శతకంతో చెలరేగాడు. 65బంతుల్లోనే క్యాంప్బెల్ సెంచరీ అందుకోగా.. ఆపై భారత బౌలర్లకు కెప్టెన్ షాయ్ హోప్ (104) జతగా అమిర్ జంగూ(114) చుక్కలు చూపించాడు. మెరుపు శతకం బాదిన క్యాంప్బెల్ను గుర్నూర్ బ్రార్ వెనక్కి పంపినా విండీస్ పరుగుల వేగం తగ్గలేదు. క్రీజునంటుకున్న హోప్, జంగూ ద్వయం మూడో వికెట్కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. వన్డేల్లో హోప్ 20వ సెంచరీ నమోదు చేయగా.. జంగూ రెండోసారి వందపూర్తి చేసుకున్నాడు. హోప్ను కుల్దీప్ యాదవ్ (2–65)బోల్తా కొట్టించగా భారత బృందం ఊపిరి తీసుకుంది. కాసేపటికే జడేజా ఓవర్లో జంగూ వెనుదిరిగాడు. స్వల్పవ్యవధిలోనే ఇద్దరూ ఔటైనా.. రోస్టన్ చేజ్(29 నాటౌట్), షమర్ జోసెఫ్ (14నాటౌట్)లు దూకుడుగా ఆడారు. ఫలితంగా విండీస్ 405 పరుగులు చేసింది.

# 'కాకతీయ రాజ్యస్థాపనాచార్య, రామప్ప దేవాలయ నిర్మాత రేచర్ల రుద్రసేనాని




కాకతీయ వంశానికి సంక్షోభం తలెత్తినప్పుడు ఆ వంశంపై తనకున్న రాజభక్తి, స్వామిభక్తి, నిలువెల్లా నిండిన దేశభక్తితో రేచర్ల రుద్రసేనాని కాకతీయ సామ్రాజ్యాన్ని కాపాడి 'కాకతీయ సామ్రాజ్య స్థాపనాచార్య, 'కాకతి సామ్రాజ్యభార దౌరేయ' అన్న బిరుదును పొంది కాకతీయ చక్రవర్తుల సేవలో తరించాడు. రేచర్ల రుద్రారెడ్డి కాకతి చక్రవర్తులు రుద్రదేవుడు (క్రీ.శ. 1158–1196), మహాదేవుడు (క్రీ.శ. 1195 –1198), గణపతిదేవుడు (క్రీ.శ.1199–1261)ల వద్ద సర్వసైన్యాధ్యక్షుడిగా నిరుపమాన బల, శౌర్య, పరాక్రమాలతో అపూర్వ సేవలందించి సువిశాల కాకతీయ సామ్రాజ్య విస్తరణకు కీలకపాత్ర పోషించాడు. మొదట రుద్రదేవునికి సైన్యాధ్యక్షుడిగా... అనేక యుద్ధవిజయాలు కలిగించినందుకు ఓరుగల్లుకు తూర్పున ఉన్న ఎలుకుర్తి(హవేలి) రాజ్యాన్ని రుద్రదేవుని నుంచి పొంది మహాసామంతాధిపతిగా రాజ్యం ఏలాడు. మహాశిల్పి జక్కనాచార్యుడు.... కర్ణాటకలోని బేలూరులో నిర్మించిన అపూర్వ చెన్నకేశవాలయంను మించిన అద్భుత వాస్తు, శిల్పకళా సంపదతో అలరారే మహాఏకకూటాలయం(రామప్ప దేవాలయం)ను రుద్రసేనాని నిర్మింపజేశాడు. శివ, కేశవ సమారాధనగా, సర్వదేవుళ్ళకు సాక్షాత్కారంగా, దివ్య, భవ్య మందిరాన్ని నిర్మింపజేశాడు. రామప్పదేవాలయం మైమరపించే అద్భుత శిల్పకళా వైభవలోకం. రుద్రసేనాని తన పేరున రుద్రేశ్వరాలయంగా నిర్మించినా....మహాశిల్పి రామప్ప ఆచార్యత్వంలో నిర్మితమైనందున ప్రజలు రామప్ప దేవాలయంగా నామకరణం చేసి ఆ పేరుతోనే సుస్థిరం చేశారు. రామప్ప దేవాలయాన్ని నిత్య శివ నివాసంగా, భూకైలాసంగా చేసి నిత్య శివ సందర్శనకు భవ్య, దివ్య మందిరాన్ని గావించాడు రామప్ప శిల్పి... ఉదయమంతా సూర్యకాంతితో ప్రకాశవంతంగా దర్శణమిచ్చే రుద్రేశ్వరుడు (శివలింగం), జీవం ఉట్టిపడే నందీశ్వరుడు, నాగినీ విగ్రహంతో కూడిన 12మదనికల (అలాస కన్యల) ఆధార విగ్రహాలు, వందలాది వివిధ శిల్పా లు, నీటిపై తేలియాడే ఇటుకలతో నిర్మించిన విమానం (గాలి గోపురం)లతో ఆలయ శిల్పకళా వైభవం ముగ్ధులను చేస్తుంది. కాగా పూర్వపు గోపురాన్ని తొలగించి ప్రభుత్వం తమిళనాడు శిల్పులతో తిరిగి నిర్మించింది. ముఖ్యంగా నాగినీ శిల్పం ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. నాగిని చేతుల్లో సర్పం, కంఠం చూట్టూ మరో సర్పం ఉన్నాయి. శిరస్సుపై 'రుద్రఫణి' ఉంది. ఈ శిల్పంలో రామప్ప పనితనం కనిపిస్తుంది. పరమశివుడు కైలాసంలో నటరాజుగా ప్రదర్శించిన శుద్ధ, దేశీ', 'పేరిణీ', 'కుండలి', 'దండిక', 'కలశ' వంటి నృత్య రీతులకు రామప్పతో దేవాలయంలో శిల్పరూపం ఇస్తూ శిల్పాభిషేకంతో గొప్ప శిల్పకళావైభవశాలగా నిర్మింపజేశాడు రుద్రసేనాని, ఆలయంలో నాలుగు భాగాలుగా దేవతారూపాలు, నర్తకుల



బృందం, నర్తకీమణుల బృందం, సాధారణ రూపాలు, అలాగే అలంకార శిల్పంలో ఆరు రకాలైనా మకర తోరణాలు, హంసలు, పద్మలు, లతలు, ఏనుగులు, సింహాలు, నాగసర్పాలు, శిల్పీకరణ క్రమంలో ప్రదక్షిణాపథంకు 526 ఏనుగుల వరుసలు, ఆలయంలోని రంగ మంటప స్తంభానికి 13 సూక్ష్మ రంధ్రాలు, ఆలయం బయటి వైపు పైన 28 గజకేసరి ఆధార శిల్పాలు అలాగే ఆలయ అంతరాలకు(గర్భగుడి ప్రవేశ మొదటి ద్వారంకు) ద్వార బంధం ఉత్తర భాగంలో రేచర్ల రుద్రుడు అన్యమ్మ దంపతులు భక్తి వినమ్రతలతో తమ అపార శివభక్తిని చాటే శిల్పాన్ని చెక్కించుకున్నారు. రామప్ప దేవాలయం ప్రాంగణంలో ఒక అన్నదాన కేంద్రం ఒక ప్రసూతి కేంద్రం, వైద్యశాల, ఒక ఓషధీవనం, ఒక మల్లయుద్ధ పాఠశాల, న్యాయపీఠం, ద్రవ్యనిధి కేంద్రం (బ్యాంకు), వ్యవసాయ విజ్ఞాన కేంద్రం, వేదవిద్యాలయం, జ్యోతిష్య పాఠశాలను ఏర్పాటు చేశాడు.

రుద్రసేనాని తన ఎలుకుర్తి రాజధానిలో నాలుగు దేవాలయాలను నిర్మించాడు. రుద్రేశ్వరాలయం (తన పేరున), అన్యేశ్వరాలయం( భార్య అన్యమ్మ పేరున), లోకేశ్వరాలయం(కుమారుడు లోకిరెడ్డి పేరున), గణపేశ్వరాలయం(కుమారుడు గణపతిరెడ్డి పేరున). ఈ నాలుగు దేవాలయాలకు కలిపి వైజనాథేశ్వరదేవాలయంగా నామకరణం చేశారు. ఇంకా మాచపురం మరికొన్ని చోట్లలో రుద్రారెడ్డి ఆలయాలను కట్టించాడు. కానీ అవి ఇప్పుడు లేవు. కాగా రామప్పలో పెద్ద శిల్పకర్మాగారం ఉండేది. ఇక్కడి నుంచి దేశవ్యాప్తంగా వేలాది శిల్పాలు నిర్మించి వివిధ ఆలయాలకు తరలించేవారు. రామప్ప దేవాలయానికి ఈశాన్యంలో శాసన మంటపాన్ని గొప్పగా నిర్మించాడు. ఆ శాసనం ద్వారా కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని గొప్పతనంతో పాటు కాకతీయ రాజుల సేవలో తమజీవితాలను అంకితం చేసిన తమ రేచర్ల వంశీయుల



గురించి రుద్రసేనాని గొప్పగా చాటాడు. అలాగే రామప్ప దేవాలయాన్ని రాబోవు కాలాల్లో సమాదరించి ఆరాధించాలనీ శిరస్సు వంచి వినమ్రంగా కోరాడు. 'శరలోకేందు భూసంఖ్య(శా.శ. సంవత్సరం 1135) గల శ్రీముఖనామ సంవత్సర, మధుమాస వసంతశుక్ల అష్టమీ భానువారం (ఆదివారం) పుష్యమీ నక్షత్రాన (క్రీ.శ. 1213 మార్చి 31న) మహామతియైన అతడు (రుద్రసేనాని) రుద్రేశ్వరాలయ (రామప్ప దేవాలయం) సంప్రోక్షణము చేశాడు. గౌరీశసహితుడైన రుద్రేశ్వరునికి భోగార్ధము ఉప్పరపల్లి (గొడిశాల హుజురాబాద్), బొర్లపల్లి గ్రామాలను సమర్పించాడు. నా వంశీయులు గానీ, ఇతర పాలకులు గానీ, పాపభీతిగల ఏ పాలకులైనా.... నాతో స్థాపించబడిన ఈ ఆలయ సముదాయమును పోషించి రక్షించిన వారికి తలపై చేతులు జోడించి నమస్కరింతును. శతృవు చేత నిర్మింపబడినదైననూ, మతప్రాతిపదికన నిర్మించబడినదైననూ దానిని శ్రద్ధతో ఉద్ధరించిననూ, పోషించిననూ, శతృవుగా ఉండిననూ వారు శతృవులుగా ఎంచబడరు. ఈ ఆలయానికి ఇచ్చిన భూరి దానమును ఇతరులు లాగి వేసుకున్నచో.... అట్టివారు 60వేల సంవత్సరములు పేడలో పురుగువలే జీవింతురు. రాబోవు తరం పాలకులు ఈ మత ప్రాముఖ్యముగల ఆలయాన్ని ప్రేమతో కాపాడగలరు. అట్లుచేసి అభివృద్ధి కొంది సుఖింతురుగాక, ఋషితుల్యుడైన, ధన్యుడైన రుద్రసేనాని సుఖ, సంతోషముల దేలుచూ ఆతుకూరు (పాలంపేట) గ్రామమున సుస్థిరులై నిలిచిన కాటేశ్వర, కామేశ్వర, రుద్రేశ్వర(రామప్ప) ఆలయముల భోగార్ధము నడికుడి గ్రామమును దానంగా ఇచ్చినట్లు రుద్రసేనాని రామప్ప దేవాలయ (పాలంపేట) శాసనంలో వివరించాడు.

– తాళ్ళపల్లి యాదగిరిగౌడ్

# హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

### ఆర్‌టిసి ఎన్నికల్లో ఐక్య కూటమిని గెలిపించండి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్



**ప్రజాపక్షం /మంచిర్యాల :** ఆర్‌టిసి కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే శరణ్యమని, రానున్న ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాల ఆర్‌టిసి డిపో వద్ద నిర్వహించిన ఎన్నికల గేట్ మీటింగ్‌లో నాయకులు, కార్మికులను ఉద్దేశించి కలవేన శంకర్ మాట్లాడారు. కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, బదిలీలు, పని పరిస్థితులు, సంక్షేమం తదితర అంశాల్లో వారి ప్రయోజనాలను కాపాడేందుకు యూనియన్లు నిరంతరం కృషి చేస్తున్నాయని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో గుర్తింపు యూనియన్ల పాత్ర కీలకమని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఈదురు వెంకన్న పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కులు, భవిష్యత్ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఇయు, టిఎంయూ, ఎన్ఎంయూలకు పూర్తి మద్దతు ప్రకటించాలని కోరారు. సంఘటిత పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. ఆర్‌టిసి కార్మికుల సంక్షేమం కోసం యూనియన్లు మరింత బలపడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. కార్మికులంతా విభేదాలు వీడి ఐక్యంగా ఉంటూ తమ ప్రతినిధులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టిఎంయు రాష్ట్ర అధ్యక్షుడు ఎఆర్.రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు కోరారు. సమావేశం అనంతరం నాయకులు కార్మికులను నేరుగా కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమస్యలు, కార్మికుల అభిప్రాయాలను తెలుసుకుని యూనియన్ల తరఫున చేపట్టే కార్యాచరణను వివరించారు. గేట్ మీటింగ్‌లో నాయకులు మామిడిపల్లి శ్రీనివాస్, గోలి శంకర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# 'మహాలక్ష్మి 'తో ఆటోడ్రైవర్లకు ఇబ్బందులు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

### ఆటోడ్రైవర్ల సమస్యలపై ప్రదర్శన




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, రోజు కూలీ కూడా గిట్టుబాటు గాని పరిస్థితుల్లో ఆటో కార్మికులున్నారని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల ఆటో కార్మికుల సమస్యలపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సుభాష్‌నగర్ నిర్మల హృదయ పాఠశాల నుంచి పాత కలెక్టరేట్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం సిపి సాయిచైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ఆటో కార్మికులు ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులు, ఫైనాన్స్‌ల ద్వారా అప్పులు చేసి ఆటోలను ఖరీదు చేసి నడుపుతు పాఠశాలల విద్యార్థులకు, ప్రజలకు సేవచేస్తున్నారని, వీరి పట్ల ప్రభుత్వం, పోలీసులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. పోలీసులు విపరీతమైన ఆంక్షలు పెట్టడం ద్వారా ఆటోలు నడపలేని దుస్థితికి నెట్టబడుతున్నారని, స్కూల్ పిల్లల ఆటోలలో కనీసం పది మందికి అవకాశం కల్పించాలని, ఆటోకార్మికులను భయభ్రాంతులకు గురిచేసే పద్ధతుల్లో ట్రాఫిక్ పోలీసులు వ్యవహరించరాదని సిపిని కోరారు.

**సానుకూలంగా స్పందించిన సిపి...** ఈ సందర్భంగా సిపి కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటో కార్మికులు కూడా చట్టబద్దంగా వ్యవహరించాలని కోరారు. పోలీసుశాఖ కూడా మానవతా దృక్పథంతోనే వ్యవహరిస్తారన్నారు. పోలీస్ కమిషనర్ స్పందనకు ఎఐటియుసి తరఫున సిపికి ధన్యవాదాలు తెలిపారు. ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా




ప్రధాన కార్యదర్శి పిన్నెల హనుమాండ్లు, స్కూల్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రఫీఖాన్, నాయకులు నజీర్, ముజీబ్ జావీద్, హైమద్, గంగాధర్, సుభాష్, అవేజ్, శ్రీనివాస్, కరీం వివిధ స్కూళ్లకు సంబంధించిన ఆటోడ్రైవర్లు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'సర్'తో తొలగించిన అర్హుల ఓట్లు పునరుద్ధరించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

### నేడు వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఓటు హక్కు పరిరక్షణలో ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని, సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, అర్హులైన పౌరుల ఓట్లను పునరుద్ధరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం)జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డితో కలిసి నెల్లికంటి సత్యం మాట్లాడారు. సర్ పేరుతో ఓటర్ల జాబితాల సవరణ చేపడుతూ అర్హులైన పౌరుల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయన్నారు. ఇలాంటి పరిణామాలు ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. నల్లగొండ జిల్లాలో సుమారు 2లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణ చేపడుతున్నారని, తమకు అందిన సమాచారం ప్రకారం సుమారు 45 వేల మందికి నోటీసులు అందినట్లు తెలిపారు. మిగిలిన వారికి నోటీసులు అందకపోవడం, విచారణ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 1న నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో వామపక్ష, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, సిపిఐ(ఎం) నాయకులు హషం, పుచ్చాకాయల నర్సిరెడ్డి, నల్పరాజు సైదులు, సిపిఐ నాయకులు పబ్బు వీరస్వామి, టి.వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి కెఎస్.రెడ్డి, టిజెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.






**రామకృష్ణాపూర్ :** దేశంలో అత్యున్నత రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘంలోనే విభేదాలు బయటపడటం తీవ్ర ఆందోళనకరమని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సిఇసి జ్ఞానేష్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం రామకృష్ణాపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జ్ఞానేష్‌కుమార్ రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, మండల కార్యదర్శి వనం సత్యనారాయణ, నాయకులు మిట్టపల్లి పౌలు, కాదండి సాంబయ్య, మామిడి గోపి, ఎగుడ మొండి, నక్క వెంకటస్వామి, మండల శ్రీనివాస్, కారుకూరి రాయలింగు, ఎండి హుస్సేన్, గజ్జి రమేష్ పాల్గొన్నారు.

**జనగామ :** బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య అధ్యక్షతన వామపక్ష పార్టీల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ సిఇసి జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని గురువారం కలెక్టర్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆది సాయన్న, బాణాల వెంకటేశ్వర్లు, కచ్చగల్ల వెంకటేష్, సింగారపు రమేష్, బూడిద గోపి పాల్గొన్నారు.

**వరంగల్ :** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ అన్నారు. ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేర్లకంటి శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ప్రజల్లో ఆందోళన కలిగించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా అన్యాయంగా జాబితా నుంచి బయటపడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు తాత స్వాతి, సహాయ కార్యదర్శి ఎండి. యాకూబ్, ఎస్ నవీన్, నాసిర్, రవి, హంస, మౌనిక, శివ, సన్నీ, సుగుణాకర్, ప్రభాకర్, సత్యం, మహేందర్ పాల్గొన్నారు.






**మరిపెడ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యన్ని ఖూని చేస్తున్న సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలనీ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలనే డిమాండ్‌తో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, నాయకులు పోలెపాక వెంకన్న, అంజి, పి.వెంకన్న, వీరన్న, హనుమంతు, కలగూర నాగరాజు, వీరన్న, సత్యం, వీరేందర్ పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

### ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖల అధికారులతో ఎమ్మెల్యే బాలునాయక్ సమీక్ష

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా శాఖల పరిధిలో గతంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అర్అండ్‌బి పరిధిలో రహదారుల నిర్మాణం, మరమ్మతులు, వంతెనలు, కల్వర్టుల పనులను వేగవంతం చేయాలని, దెబ్బతిన్న రోడ్లను గుర్తించి మరమ్మతులు చేప్టటాలని, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గ్రామాలు, తండాల్లో సిసి రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజి తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యుత్‌శాఖ పరిధిలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, వీధిదీపాలు, విద్యుత్ సరఫరా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నియోజవకర్గంలోని దేవరకొండ పట్టణం, మండల కేంద్రాలు, గ్రామాలు, తండాల్లో ప్రజలకు అవసరమైన పనులను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఎంఎల్‌ఏ బాలునాయక్ అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఎల్‌ఏ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో పిఆర్‌టియు అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం : పింగిలి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్రంలో పిఆర్‌టియు అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా వెలుగొందుతుందని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిఆర్‌టియు సంఘం కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు పిఆర్‌టియు సంఘం పట్ల ఆకర్షితులై ఆయన సమక్షంలో పిఆర్‌టియులో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఆర్‌టియు సంఘం ఆవిర్భవించిన తరువాతనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఒక్కొక్కటిగా సాధ్యమైందన్నారు. రాబోయే కాలంలో మంచి పిఆర్‌సి ఇప్పించడంతోపాటుగా పెండింగ్ డిఏలు బిల్లులు ఇప్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, తీగల నరేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంకతి వెంకన్న, పులుసు శ్రీనివాస్, వంగపల్లి రమేష్, డి. శ్రీనివాస్, కార్తీక్ రెడ్డి, పద్మం మల్లయ్య తదితరులు సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

### రూ.3 లక్షలు స్వాధీనం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** గ్రామ శివారులోని ఇందిరమ్మ కాలనీ వద్దగల మామిడి తోటలో 17 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఓటి బీబీనగర్ పోలీసులు సమాచారం నిమిత్తం దాడి చేసి 17 మంది వ్యక్తులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. వారి వద్ద మూడు లక్షల 53,740 నగదు, మూడు కార్లు, రెండు బైకులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అందులో వివిధ ప్రాంతాలకు చెందిన చిలుకానగర్ ఉప్పల్ చెందిన గంట రమేష్, ఉప్పల్‌కు చెందిన మంత్రి శ్రీనివాస్, ఇందిరా నగర్‌కు చెందిన గచ్చిబౌలి, చెందిన మంత్రి శ్రీనివాస్, కట్టెకోల అశోక్, నిమ్మ శ్రీకాంత్ రెడ్డి, మేడిపెల్లికి చెందిన నేర్పుల వెంకటేష్, గాజుల రామారంకు చెందిన గోడ ఈశ్వర్, నాగోల్‌కు చెందిన గిరి, సికింద్రాబాద్‌కు చెందిన దేవుని సతీష్, ఆనంద్ మాడుగులపెల్లి నల్గొండకు చెందిన బి.సతీష్, శ్రీనివాస్, బాలాపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్, బోరబండకు చెందిన జావేద్ శంకర్ రెడ్డి, హయత్ నగర్‌కు చెందిన జి.మధు, ముత్యాలు, బీబీనగర్ మండలం గూడూరుకు చెందిన ఆర్.ముత్యాలు పేకాట ఆడుతుండగా పట్టుబడినట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తూ భువనగిరి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు.

## ఎల్ఎస్ బేకరీ సీజ్.. రూ.10వేల జరిమానా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డిమార్ట్ సమీపంలో ఉన్న ఎల్ఎస్ బేకరీ పై వినియోగదారులు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాకర్, మున్సిపల్ ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఇన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్‌తోపాటు మరికొంత మంది సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. బేకరీలో ఆహార పదార్థాల తయారీశాలను పరిశీలించి వాటికి వినియోగిస్తున్న పదార్థాలను పరిశీలించారు. బేకరీ మొత్తం అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన వస్తువులతో బేకరీ ఐటమ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వాటన్నింటిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. అపరిశుభ్రంగా ఉన్నందుకు గాను రూ.10వేల జరిమానా విధించడంతోపాటు బేకరీని సీజ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ బేకరీ, హోటల్స్‌లో కల్తీ జరిగినా, కుళ్ళిపోయిన ఆహారాలు విక్రయిస్తున్నా వినియోగదారులు గుర్తిస్తే తమకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ పరిధిలో, కమిషనర్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ , జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు (ఎంఎల్‌హెచ్‌పి) 12 పోస్టులను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పి కి అర్హత ఎంబిబిఎస్/బిఏఎంఎస్/స్టాఫ్ నర్సు మరియు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఉండాలని, ఎంబిబిఎస్/బిఏఎంఎస్ కు నెలకు వేతనం రూ. 40,000, స్టాఫ్ నర్సుకు రూ. 29,900 ఉంటుందని అర్హులైన అభ్యర్థులు సరైన ధృవపత్రాలతో 01/10/2026 నుండి 05/10/2026 సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం, రూమ్ నెంబ G17, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడిఓసి), రాయగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాలో నేరుగా సమర్పించావలెనని తెలిపారు.

# ఎరువులు, యూరియా కొరత రావొద్దు

### రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** రైతులకు అవసరమైన ఎరువులు, యూరియా సకాలంలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్లఐలయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై రైతులు, పిఎసిఎస్ సభ్యులు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల లభ్యత, విత్తనాలు, సాగునీరు, పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ సీజన్కు అవసరమైన ఎరువులు, యూరియాను ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పిఎసిఎస్ ల ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా, సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ సింగర్తి మల్లేశం, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు కళ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంగీత, పుష్ప రెడ్డి, స్వప్న రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కవిత గౌడ్, సునీత నాయక్ తదితరులు

**1,609 నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఓం శివ ఫంక్షన్ హాల్ లో అర్హులైన లబ్దిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. మండల పరిధిలో అర్హత పొందిన 1,609 కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

## హాజరు తగ్గితే చర్యలు తప్పవు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** విధులకు అలసత్వం వహించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ సెప్టెంబర్ మాస సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లాలోని ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ఈ సమీక్షలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి ప్రగతి, అధికారుల తనిఖీలు, స్పాట్ అసెస్‌మెంట్, పిఎంశ్రీ పనులు, మధ్యాహ్న భోజన నాణ్యత, భవిత కేంద్రాల పనితీరుపై ఆయన సమగ్ర సమీక్ష చేపట్టారు. జిల్లాలో ప్రస్తుతం విద్యార్థుల సగటు హాజరు కేవలం 69 శాతం మాత్రమే నమోదు కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 60 శాతం కంటే తక్కువ హాజరు నమోదైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వెంటనే నోటీసులు జారీ చేసి, లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సైతం సమయపాలన పాటించాల్సిందేనని తేల్చి చెప్పారు. నెలకు 15 రోజుల కంటే తక్కువ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు ఉన్న ఉపాధ్యాయుల నుంచి తక్షణమే వివరణ తీసుకోవాలని ఆదేశించారు. ఒకే ఉపాధ్యాయుడు వరుసగా మూడు నెలల పాటు ఇదే తీరును పునరావృతం చేస్తే, రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే నెల నుంచి మండల స్థాయిలోనే కాకుండా, ఉపాధ్యాయుల వారీగా అక్టోబర్ 1 నుండి జరిగే సమ్మెటివ్ పరీక్షల ఫలితాల మీద ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ హరి సింగ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, క్వాలిటి కోఆర్డినేటర్ హరికృష్ణ, జిల్లాలోని ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## చేనేత పరిశ్రమ లాభాల్లో పయనించడమే ధ్యేయం

### చేనేత ముఖ్య నాయకులతో యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** గ్లోబల్ వైడ్‌గా ఆన్‌లైన్ వ్యాపారంలో ఆకాశమే హద్దుతో సూపర్ పవర్ గా చేనేత కార్మికులు మార్కెట్ కు ధీటుగా ఎదగాలనీ భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నిస్వార్థంగా తన బలమైన ఆకాంక్షను వెలిబుచ్చి నిజమైన ఐఏఎస్ ఆఫీసర్ అనిపించుకున్నారు.టూరిస్ట్ ఎకానమి అండ్ కన్సల్ టెన్సి ప్రతినిధుల బృందం చేనేత కార్మికులు తమ కళా నైపుణ్యాలతో బహుళ ప్రయోజనాలు పొందేల ఇంటర్ నెట్ ,సోషల్ మీడియాను సరైన విధంగా వెబ్ సైట్ ఓపెన్ చేసి విస్తృతంగా మార్కెట్ ప్రమోట్ చేస్తూ స్థానిక ప్రయోజనాలు చేకూరేల కృషి చేయాలని అధికారిక హోదాలో చెప్పటం చిత్త శుద్ధికి నిదర్శనం.త్వరలో రాబోయే దసరా నవరాత్రి ఉత్సవాల్లో చేనేత వస్త్రాల కళా నైపుణ్యాల ఎక్స్ పో సన్నాహక సమావేశంలో ఆయన టూరిజం పార్కులో అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోచంపల్లి ప్రాశస్త్యం, చేనేత పరిశ్రమ,భూదానోధ్యమ చరిత్రను నిత్యం వచ్చే టూరిస్టులకు గైడ్ చేసే నేత కార్మికులకు ఆయన ప్రయోజనం చేకూర్చే విధంగా సూచనలు చేశారు.కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆయన పోచంపల్లి ఇక్కత్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటం శుభపరిణామమని అందరు కొనియాడుతున్నారు.నిజజీవితంలో ఉపయోగించే ప్రతీ వస్తువులో చేనేత బ్రాండ్ వస్త్రాలతో ఇనుమడించేవిధంగా కుటీర పరిశ్రమల ద్వారా స్వయం సమృద్ధి సాధించాలని అభిలాషించారు. ఆన్ లైన్ విధానం ద్వారా ప్రతీ ఒక్కరూ సొంత వెబ్ సైట్ ఓపెన్ చేసి ట్రెడ్ పోచంపల్లి ట్యాగ్ లైన్‌తో నాణ్యమైన వస్త్రాలతొ వినియోగదారులకు నమ్మక విశ్వాసం కలిగేల మార్కెటింగ్ చేసుకోవాలని బలమైన ఆకాంక్షను వ్యక్తం చేశారు. వీవర్స్ తో ముఖాముఖి చర్చలో కార్మికుల ఆర్థిక స్వావలంభన కోసం ఏం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని అడిగి ప్రశ్నించి తెలుసుకొని తగు సూచనలు చేశారు.ట్రైనింగ్ తీసుకున్న యువతీయువకులతో మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా క్రియేటివితో నూతన డిజైన్ ఆవిష్కరణలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని అధికారులను కార్మికులను వ్యాపారులను కోరారు. ఒక టూరిస్ట్ ప్రాంతాన్ని సందర్శించిప్పుడు విశేష అనుభూతితో తిరిగి వెళ్ళాలని సందేశం ఇచ్చారు.ఈ ప్రాంతం ఆ కళా వారసత్వం ముందుతరాలకు అందివ్వాలనే సంక ల్పం తన కార్మికుల క్షేమం కోరే చిన్న స్వార్థమని మన సుని ఆవిష్కరించారు. పోచంపల్లి చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ,చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత లవ కుమార్, హాండ్ లూమ్ ఏడి శ్రీనివాస్, రావు తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, కమీషర్ అంజన్ రెడ్డి ,నేత కార్మికులు, అధికారులు ముఖ్యనాయకులు ఆయన వెంట ఉన్నారు.



## సిఇసి జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఓటర్ల జాబితాలో మార్పులు, తదితర అంశాలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నేరేడుచర్లలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 అర్హత కలిగిన పౌరులకు ఓటు హక్కును కల్పిస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం కీలకమైన బాధ్యతను నిర్వహిస్తుందని, అయితే ప్రస్తుత పరిణామాలు ఎన్నికల వ్యవస్థపై అనేక సందేహాలకు తావిస్తున్నాయని అన్నారు. ఎస్ఐ ఆర్ ఫామ్6 తదితర అంశాలపై ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, అభ్యంతరాల ప్రక్రియపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన నిబంధనలు, నోటీసులు ప్రక్రియై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర క మిటి సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, పట్టణ సిపిఎం కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, టిడిపి మండల అధ్యక్షులు వెంకటయ్య, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## నిదానపల్లిలో భూ రీ-సర్వే పరిశీలన



**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల పరిధిలోని నిదానపల్లి గ్రామంలో చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమంపై రెవెన్యూ శాఖ మరింత వేగం పెంచింది.ఇందులో భాగంగా గ్రామంలో రెవెన్యూ జాయింట్ కలెక్టర్ కే.వెంకట రెడ్డి పర్యటించి, రీసర్వే తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, సరిహద్దుల గుర్తింపు తదితర అంశాలపై అన్నదాతలతో ప్రత్యక్షంగా చర్చించి వివరాలు సేకరించారు. రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా గ్రామంలోని సర్వే నంబర్లను పరిశీలించిన జేసీ వెంకటరెడ్డి, ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి ప్రతి రైతన్నకు ఎంతో విలువైనదని,ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శక పద్ధతిలో రీసర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లాల్ బహదూర్,ఆర్ ఐ శోభా రాణి, జిపిఓ లక్ష్మి ,సర్వేయర్ సోనీ, జూనియర్ అసిస్టెంట్ సుగుణాకర్, లైసెన్స్ సర్వేయర్ నవీన్,సర్పంచ్ నారపాక మాధవి యాదయ్య,మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎండిన పంటలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత,విద్యుత్ శాఖ వైఫల్యం కారణంగానే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు.జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన చిన్న మాదారం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి,నీరందక నిలువునా ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు, ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్న మాదారం విద్యుత్ సబ్ స్టేషన్‌ను స్వయంగా సందర్శించి,సరఫరా అవుతున్న విద్యుత్ వివరాలపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ పంటలు కాపాడుకోవడానికి రైతులకు అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుస్థితి ఒక్క గ్రామానికో, ప్రాంతానికో పరిమితం కాదని, ఉమ్మడినల్లగొండ జిల్లాతో పాటు కృష్ణా పరీవాహక ప్రాంతం, యావత్ తెలంగాణ అంతటా రైతులు తీవ్ర విద్యుత్, సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని స్పష్టం చేశారు. రైతుల ఈ దుస్థితికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, తాము చేసిన తప్పిదాలపై పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, బిజెపి నాయకులు వీరెల్లి చంద్రశేఖర్,గోలి అమరేందర్ రెడ్డి,పిల్లి రామరాజు యాదవ్,పాలకూర రవి తదితరులు ఉన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

### అధికారికంగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంపట్ల పార్టీ శ్రేణులు హర్షం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఉమ్మడి నల్లగొండ వరంగల్‌ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి పేరు ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. దీంతో పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన తండ్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణానంతరం సూర్యాపేట నియోజక వర్గ కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి ఆయన ఎనలేని కృషి చేస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయాల్లో రాణిస్తున్నాడు. తన తండ్రి 45 ఏండ్లు రాజకీయ ప్రస్థానంలో 9 సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి 5 పర్యాయాలు విజయం సాధించారు. తుంగతుర్తి నియోజక వర్గం నుండి నాలుగు పర్యాయాలు, సూర్యాపేట నియోజక వర్గం నుండి ఒక సారి గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి జనార్థన్ రెడ్డి క్యాబినెట్‌లో 1991/92 వరకు భూగర్భ జల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2008/09 వరకు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లో ఐటి, యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రిగా కొనసాగారు. వీరి పెదనాన్న దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని సుజాతనగర్ నుండి మూడు సార్లు, పాలేరు నియోజక వర్గం నుండి రెండు సార్లు మొత్తం 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై 201014 వరకు దివంగత ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కె. రోషయ్యతోపాటు కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్‌లో ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు. దీంతో ఆయనకు తెలంగాణ రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా మంచి పేరు ఉంది. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి రాంరెడ్డి కుటుంబం లాయల్‌గా ఉంటూ వస్తుంది.

**అధికారికంగా కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంపట్ల పార్టీ శ్రేణులు హర్షం...**

రాంరెడ్డి కుటుంబం గత 50 సంవత్సరాలకు పైబడి కాంగ్రెస్‌కి చేస్తున్న సేవలను గుర్తించడంతోపాటు సూర్యాపేట నియోజక వర్గంలో తన తండ్రి దామోదర్ రెడ్డి మరణానంతరం సర్వోత్తమ్ రెడ్డి చురుకుగా రాజకీయాల్లో ముందుకు వెళ్ళడం తండ్రికి తగ్గ తనయుడిగా ఎంతో పట్టుసాధించడం యువతలో ఆయనకు ఉన్న క్రేజ్‌ను అధిష్టానం గుర్తించి ఉమ్మడి నల్లగొండవరంగల్‌ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్‌సి అభ్యర్థిగా ఆయనను అధిష్టానం ప్రకటించడం ఆ కుటుంబానికి ఇచ్చిన గౌరవంగా పార్టీశ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. యువకల్లో ఆయనకు ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు.

**రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి బయోడేటా...**

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఎంబిఏ అండ్ ఎంఐఎం, బిఇ (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్) ఇంజనీర్‌గా పట్టాలు పొంది గోల్డ్ మెడల్ కూడా సాధించారు. 2002/2012 వరకు అమెరికా, కెనడా, యుకెలో క్యాప్టల్ వన్ ఫెనాన్షియల్ సర్వీస్‌ల్లో ఆయన సేవలందించారు. విద్యాధికుడిగా ఎంతగానో రాణించిన ఆయన ఇంగ్లీష్‌లో అనర్ఘళంగా మాట్లాడగలరు. తెలుగుతోపాటు ఇతర భాషాల్లో కూడా ఆయనకు మంచి పట్టు ఉంది. 2012లో ఆయన ఏఐసిసి మెంబర్‌గా కొనసాగారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో 14 సంవత్సరాలుగా ఆర్గనైజేషన్ పాలిటిక్స్‌లో కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుతం సూర్యాపేట నియోజక వర్గానికి పార్టీ పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారు.

**గెలుపు నల్లేరు మీద నడకే...**

పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీచేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకేనని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు వారి తండ్రి స్వస్థలం లింగాల గ్రామం కూడా ఖమ్మం జిల్లా కావడం ఈ రెండు జిల్లాల్లో వారి కుటుంబానికి మంచి పేరు ఉండడం కలిసి వచ్చే అంశాలుగా చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం ఉమ్మడి నల్లగొండ వరంగల్‌ఖమ్మం జిల్లాల్లో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉండగా 29 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండడంతోపాటు కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుండి మిత్రపక్షమైన సిపిఐ, భద్రాచలం అసెంబ్లీ స్థానం నుండి గెలుపొందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో కొనసాగడం, మొత్తం 5 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ ఎంపిలే ఉండడం సర్వోత్తమ్ రెడ్డి గెలుపు ఖాయమని బల్లా గుద్ది చెబుతున్నారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం అందరికి తెలిసిందే. ఈ ఎన్నికలే మరో రెండేండ్లలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు గీటు రాయిగా మారనుంది.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ:** పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే పెన్షన్ రూల్స్ వాలిడేషన్ చట్టం 2025ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది.ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు దేశవ్యాప్త పోరాట కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు ధర్నా,నిరసన ప్రదర్శన నిర్వహించారు.జిల్లా అధ్యక్షులు నూకల జగదీశ్ చంద్ర మాట్లాడుతూ పెన్షనర్ల హక్కులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా పెన్షన్ రూల్స్ వాలిడేషన్ చట్టం2025,యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)లోని వివక్షతతో కూడిన నిబంధనలు, 8వ వేతన సంఘం (8వ సీపీసీ) టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌లో పెన్షన్ రివిజన్‌కు సంబంధించిన అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.డి అబ్దుల్ ఖాదర్,జిల్లా ఆర్థిక కార్యదర్శి,కుకుడాల గోవర్ధన్,పాతూరి విద్యాసాగర్ రెడ్డి, గుండాల బిక్షమయ్య,రాపోలు వెంకటేశం,పులి కృష్ణమూర్తి,మిర్యాల కేశవులు పాల్గొన్నారు.





## ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

**ప్రజాపక్షం/రాయపర్తి :** మండల కేంద్రంలోని హెచ్‌పి పెట్రోల్ పంపు సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి గాయాలు అయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎంజిఎం హాస్పటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వ్యక్తి మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన వేముల సంతోష్‌గా గుర్తించారు.

## రెడ్‌క్రాస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



జిల్లా చైర్మన్‌గా చల్లూరి మధు , డిసిఓ వాల్యా నాయక్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికలు పూర్తయినట్లు డిస్టిక్ కో ఆపరేటివ్ ఆఫీసర్ డిసిఓ వాల్యా నాయక్ తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ శాఖకు సంబంధించిన ఎన్నికల్లో అన్ని పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డిసిఓ వాల్యా నాయక్ ప్రకటించారు. నూతన కార్యవర్గం జిల్లా చైర్మన్‌గా చల్లూరి మధు, వైస్ చైర్మన్ కె.శాంతి కిరణ్, కోశాధికారి కె.కృష్ణ మోహన్, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కాశెట్టి శ్రీనివాస్, జిల్లా కమిటీ మెంబర్స్ ఎస్.అనిల్, జి.హరీష్, పి.శ్రీనివాస్, కే.సాంబమూర్తి, ఎన్.శ్రీనివాసరావు, జి.సతీష్, ఏ.సమ్మయ్య, ఎం.ప్రత్యూష, కే.యుగేదేశ్వర్, బి.సతీష్ రెడ్డి, వి.పాపయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పలువురు అభినందనలు తెలిపారు. ఈ కమిటీ 29.9.2029 వరకు రెడ్ క్రాస్ అభివృద్ధి కోసం పని చేస్తుందని ఎన్నికల అధికారి తెలిపారు.

## ఖాకీ సేవలకు ఘన వీడ్కోలు



పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి సత్కారం

**ప్రజాపక్షం/ములుగు :** జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన వడ్డెబోయిన కాశ సత్యనారాయణ, బోదబోయిన పురుషోత్తంలకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ములుగు ఎస్‌పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ వారి సేవలను అభినందించారు. కాశ సత్యనారాయణ 1990లో ఏఆర్‌పిసిగా పోలీస్ శాకలో చేసి సుమారు 36 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. వరంగల్‌లో కానిస్టేబుల్‌గా 25 ఏళ్లు, మడికొండ డిటిసిలో ఇన్‌స్ట్రక్టర్‌గా ఏడేళ్లు సేవలందించి పలువురు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2015లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2020లో ఏఆర్ ఎస్‌ఐగా పదోన్నతి పొందారు, బెల్లంపల్లి, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించిన ఆయన ఇటీవల సేవా పతకం అందుకున్నారు. బోదబోయిన పురుషోత్తం 1990లో సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా చేరి ధర్మసాగర్, వరంగల్, హనుమకొండ, పస్రా, మహబూబాబాద్, మట్టెవాడ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, అనంతరం ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. భూపాలపల్లి, ములుగు, వెంకటాపురం, కొత్తగూడెం ప్రాంతాల్లో సేవలందించారు. 2021లో సేవా పతకం పొందారు. 2022 నుండి వాజేడు..వెంకటాపురం ప్రాంతంలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన సిబ్బంది అనుభవం, క్రమశిక్షణ, విధి నిబద్ధత పోలీస్‌శాఖకు ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్‌పి నలువాల రవీందర్, సిఐలు దారం సురేష్, ప్రతాప్, ముత్యం రమేష్, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్లు తిరుపతి, శ్రీకాంత్, ఎస్‌ఐ తిరుపతి, ఆర్ఎస్‌ఐ నిర్మల, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంను మర్యాదపూర్వకంగా కలిసిన బుడిగె సతీష్ గౌడ్

ప్రజాసేవలో ముందుంటూ ప్రజల మన్ననలు పొందుతున్న సతీష్ గౌడ్‌కు మంత్రి అభినందనలు



**ప్రజాపక్షం/గూడూరు:** రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ మండల పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ భేటి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలోకి వేగంగా తీసుకెళ్లాలని పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని మంత్రి సూచించారు. గూడూరు మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో బుడిగే సతీష్ గౌడ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించారు. ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిస్తూ విద్యా వైద్యం సహాయక కార్యక్రమాల్లో నిరంతరం ముందుంటున్న తీరును కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేస్తూ నియోజకవర్గ ప్రజలతో పాటు పార్టీ పెద్దల మన్ననలు పొందుతున్న సతీష్ గౌడ్ భవిష్యత్తులో ప్రజా సేవలో మరింత చురుగ్గా ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. ఈసందర్భంగా బుడిగె సతీష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వ సంక్షమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# గురుకులంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం

వేలేరులో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలో బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. మల్లికుదుర్ల గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను, వేలేరు మండల కేంద్రంలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్లికుదుర్ల గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల భూములను సర్వే చేశారో, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉందో సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే జరుగుతున్న ప్రాంతంలోని రైతులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం చేపడుతున్న రీ సర్వేను నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ వేగవంతం చేయాలని సూచించారు.

**గురుకులంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత**

అనంతరం వేలేరులోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి అల్పాహారం, భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులు, డార్మెట్రీలు, టాయిలెట్లు, వంటగదిని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ టైం ప్రకారం తరగతులు నిర్వహిస్తున్నారా అని పరిశీలించారు. టైం ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా డార్మెట్రీలకు మెష్ డోర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వసతులను మెరుగుపరచడంతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ**

పీహెచ్‌సీలో నాణ్యమైన వైద్య సేవలు వేలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సంఖ్య, విధులకు హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించడంతో పాటు మీ ప్రమాణం యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై ఆరా తీశారు. ల్యాబొరేటరీని సందర్శించి నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ కోమీ, ఎంపీడీవో కిషన్ నాయక్, ఎంఈఓ మొగిలిచెర్ల చంద్రమౌళి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేఘన, గురుకుల వైస్ ప్రిన్సిపాల్ సజన, సర్పంచ్ బిల్లా యాదగిరి, సర్వేయర్లు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## విద్యుత్ వ్యవస్థ మరింత పటిష్టం

నూతన సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గణపురం :** భవిష్యత్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను మరిం త బలోపేతం చేయాలని సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం గణపురం మండలంలోని గాంధీనగర్‌లో ప్రతిపాదిత నూతన సబ్‌స్టేషన్ కోసం గుర్తించిన స్తలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేసి పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్ళాలని అధికారులకు సూచించారు. విద్యుత్ మౌళిక వసతులను బలోపేతం చేసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ పనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, సిబ్బంది తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని వరుణ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో గణపురం ఏఈ కె.వెంకటరమణ, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దోచిన భూములు ఉద్యమకారులకు పంచాలి

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎందరో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని తొమ్మిది ఏండ్లు అధికారం చలాయించిన కెసిఆర్ వారి కుటుంబ సభ్యులు, సమీప బంధువులు లెక్కకు మించి దోచుకున్న ఆస్తులను తెలంగాణ ఉద్యమకారులకు పంచాలని. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ డిమాండ్ చేసారు. బుధవారం హనుమకొండ జిల్లా కేంద్రం బాలసముద్రంలోని తన నివాసంలో ఉద్యమ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు వేల కోట్లకు విలువైన వందల ఎకరాల భూములను దోచుకున్నారని, వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టి ప్రతి ఒక్కరూ పది ఎకరాల నుండి 700 ఎకరాల ఫామ్ హౌస్‌లు కాకతీయుల కట్టడాలకు దీటుగా ఎత్తైన ప్రహరీలలూ నిర్మించుకున్నారని అన్నారు. వివిధ సంఘాల నాయకులు చిల్లా రాజేంద్ర ప్రసాద్, దారం జనార్ధన్, సాయిని నరేందర్, బొమ్మినేని పాపిరెడ్డి, దొమ్మాటి ప్రవీణ్‌లు మాట్లాడుతూ రాష్ట్రాన్ని దోచుకున్నందుకే ప్రజలు 2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీని ఘోరంగా ఓడించారని పార్లమెంట్ ఎన్నికలలో గుండు సున్నా ఇచ్చారన్నారు. కుటుంబం, కొంతమంది మంత్రులపై ప్రస్తుతం ప్రభుత్వం విచారణ ప్రారంభించడం అభినందనీయమని, ఈ విచారణ రాజకీయ ఆరోపణలతోనే ఆగిపోకుండా నియమిత కాలంలో విచారణ పూర్తి చేసి దోషులకు శిక్షలు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. భూములను స్వాధీనం చేసుకుని ఉద్యమకారులకు పంచి తగిన విధంగా గౌరవించాలని వారు కోరారు.



# ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానోత్సవ సభ



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** ఉపాధ్యాయ వృత్తిలో మూడు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించిన పిఆర్ టియు టిఎస్ ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎర్ర తిరుపతిరాధలదంపతుల ఉద్యోగ విరమణ అభినందన సన్మానోత్సవ సభ ఘనంగా జరిగింది. బుధవారం ఎంపీపీఎస్ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎ.రాజేశ్వరి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని దామెర గ్రామం ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో ఈ సభ నిర్వహించారు. తొలుత ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఏ.రాజేశ్వరి అధ్యక్షోపాన్యసం చేస్తూ ఎర్ర తిరుపతి 30 సంవత్సరాల ఉపాధ్యాయ ప్రస్తానంలో విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఎర్ర తిరుపతి రాధ దంపతులకు అభినందన సన్మానోత్సవ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సభకు ఎల్కతుర్తి మండల విద్యా వనరుల అభివృద్ధి అధికారి సిహెచ్ సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎర్ర తిరుపతి రాధ దంపతులను శాలువా గుచ్చాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కరించడం గర్వకారణం అని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా పిఆర్ టియు టిఎస్ ఎల్కతుర్తి మండల ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఎదురైన ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎర్ర తిరుపతి కృషి చేశారని తెలిపారు. అనంతరం ఎర్ర తిరుపతి రాధా దంపతులను శాలువాలు పుష్పగుచ్చాలు జ్ఞాపకలతో ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెర సర్పంచ్ పద్మ చేరలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సాతూరి రాజేశ్వరి, జడ్పీహెచ్ఎస్ దామర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, సదానందం ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు అలివేణి, బావుపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మనోహర్ నాయక్, ఉపాధ్యాయులు ఎం.జయప్రద, టీ.లక్ష్మి కుటుంబసభ్యులు బంధుమిత్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## వాగ్దేవి విద్యాసంస్థల్లో ఘనంగా 'వరల్డ్ హార్ట్ డే' వేడుకలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వాగ్దేవి విద్యాసంస్థలు, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే.. 2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఫార్మసీ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా కేఎంసి పిఎంఎస్ఎస్‌వై సూర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఈ నెల 28 నుండి 30 వరకు మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. తొలిరోజు కేఎంసి గేటు నుండి ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సి మమతారెడ్డి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ద్వారా ప్రాణాలను కాపాడే విధానం, థ్రాంబోలైటిక్స్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫార్మా.. డి, బిఎస్‌సి బయోమెడికల్ సైన్సెస్, ఎంఎస్‌సి న్యూట్రిషన్ సైన్సెస్, నర్సింగ్ విద్యార్థులు శిక్షణలో పాల్గొని కార్డియాలజీకి సంబంధించిన మెళకువలను నేర్చుకున్నారు. అనంతరం రోగులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు వాగ్దేవి కళాశాలల ఫౌండర్, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సిహెచ్ దేవేందర్ రెడ్డి, వైస్ కరస్పాండెంట్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ వాహినీదేవి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి మోహన్‌దాస్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ మాధవరావు, సిటీ సర్జన్ డాక్టర్ సర్దాజ్, వైద్యులు, వాగ్దేవి విద్యాసంస్థల అధ్యాపకులు పాల్గొన్నారు.

# కందిపప్పు మిల్లు ఏర్పాటుకు స్థల పరిశీలన

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/పర్వతగిరి :** పర్వతగిరి మండలంలోని కొంకపాక, పర్వతగిరి మార్కెట్ యార్డులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం క్షేత్రస్థాయి అధికారులతో సందర్శించారు. వీవోల సభ్యులతో కలిసి ఆర్గానిక్ పప్పు దినుసులు, మిల్లెట్స్, మిల్లు, అరటి, మోదుగు ఆకులతో విస్తరులు, టిఫిన్ ప్లాట్, తదితర ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కంది, ఇతర పప్పు దినుసుల మిల్లును ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా పంటలకు విలువ జోడించడంతో పాటు మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే అంశంపై అధికారులతో చర్చించారు. మిల్లు ఏర్పాటుకు అవసరమైన స్థలం, వివో బిల్డింగ్‌కు స్థల పరిశీలన, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్, ఉట్టి తండా అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత సరిగా పాటించకపోవడంపై సంబంధిత అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులకు యూనిఫాం తప్పనిసరిగా ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. శుభ్రత పరిశుభ్రత తప్పనిసరిగా ఉండేలా ఆయాలు చూడాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ టీచర్లకు, కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయని అంగన్‌వాడీ సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఉట్టి తండ లోని బుద్ధి మాధ్యమం తో ఉన్న పిల్లలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పలకరించి వారిని భవిత సెంటర్ల కు పంపించాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమం లో డీఆర్డీవో నాగ పద్మజా, జిల్లా సంక్షేమ అధికారి నాగమణి, పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో తదితరులు పాల్గోన్నారు.



## పట్టభద్రులూ ఓటరుగా నమోదు..

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం



**ప్రజాపక్షం/ములుగు :** వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రులు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సూచించారు. మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటరు నమోదు ప్రక్రియపై వివరించారు. 01/11/2023ను అర్హత తేదీగా పరిగణిస్తూ పట్టభద్రుల ఓటర్ల జాబితాను నూతనంగా రూపొందించే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. అర్హులైన వారు ఫారం 18 ద్వారా దరకాస్తు చేసుకోవాలని, సంబంధిత ధృవపత్రాలను నిర్ణీత అధికారి ద్వారా ధృవీకరించి సమర్పించాలని సూచించారు. పాత ఓటర్ల జాబితాలో పేరు ఉన్నప్పటికీ ప్రస్తుత నూతన జాబితాలో నమోదు కోసం తిరిగి దరఖాస్తు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన పట్టభద్రులు సంబంధిత తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, నియమిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చున్నారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించి నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని కోరారు. సమావేశంలో డిఆర్ఓ వి.రవికుమార్, ఎన్నికల విభాగం డిటిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**ప్రజాపక్షం/గూడూరు:** గొర్రెలను మేపుతూ ప్రమాదశాత్తు విద్యుత్ తీగ తగిలి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన గూడూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఊట్ల గ్రామానికి చెందిన చంద యెల్లమ్మ (55) భర్త ఐలయ్య రోజులాగే వ్యవసాయ పనులతో పాటు గొర్రెలను మేపేందుకు ఊరి శివారులోకి వెళ్లారు సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో గొర్రెలను తోలుకుంటూ వస్తుండగా పూనం శ్రీకాంత్ కౌలుకు చేస్తున్న పోలంలోని బోరుబావి సమీపంలో ప్రమాదం జరిగింది. అక్కడ లింగాల వెంకన్నకు చెందిన బొర్‌వెల్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్న సర్వీస్ వైరును యెల్లమ్మ అనుకోకుండా తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న గూడూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కసారిగా మెల్లమ్మ మృతి చెందడంతో ఊట్ల గ్రామంలో విషాధఛాయలు అలముకున్నాయి.

# రహదారి భద్రతా చర్యలు వేగవంతం



పాఠశాలల బస్సులలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**ప్రజాపక్షం/జనగామ :** జిల్లాలో రహదారి భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. పాఠశాలల బస్సులలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలని, స్టేషన్‌ఘనపూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం ఎఫ్‌ఓబి పనుల్లో వేగం పెంచాలన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులతో జిల్లా రహదారి భద్రత కమిటి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి సూచికలు పాటించాలని, వాహనాల వేగ నియంత్రణ క్షుణ్ణంగా పరిశీలించాలని, జాతీయ రహదారి 163పై ఎల్ఈడి లైటింగ్ ఏర్పాటు, రహదారికి సూచికల అప్‌గ్రేడేషన్, పట్టాణానికి సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కోమల్లా టోల్ ప్లాజా వద్ద అనధికార పార్కింగ్‌ను తొలగించాలని, కరుణాపురం ప్రాంతంలో మద్యం దుకాణాల వద్ద పార్కింగ్ సమస్యలను పరిష్కరించి, రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అనధికార పార్కింగ్‌ను తొలగించాలన్నారు. డిసిపి రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ పెంబర్తి వై జంక్షన్ వద్ద అవసరమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు నవాబుపేట కల్వర్ట్ వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహన వేగాన్ని నియంత్రించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ గోపిరాం, కిరణ్‌ప్రకాష్, స్టేషన్ ఘనపూర్ ఎసిపి భీంశర్మ, ఆర్టీ సభ్యులు చిలువేరు అభిగౌడ్, నేషనల్ హైవేస్ హెచ్‌ఎంఆర్ఈ మదుసూధన్‌రెడ్డి, జనగామ, స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, విద్యాశాఖ ఏడి శ్రీనివాస్, డిఎంహెచ్ఓ వాణిశ్రీ, డిపిఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**బాలల భద్రత, ఆరోగ్యం, హక్కులపై పాఠశాలలకు పోస్టర్ల పంపిణీ**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, పరిశుభ్రత, పాఠశాల భద్రత, బాలల హక్కులు, శరీర భద్రత పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన పోస్టర్లు, బ్యానర్లను ప్రతి పాఠశాలకు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ప్రతి పాఠశాలకు 15 చొప్పున పంపిణీ చేసినందున విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు.

**మత్తు పదార్థాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు**

మత్తు పదార్థాల నియంత్రణకు పకడ్బందిగా చర్యలు చేపట్టడంతో పాటు వాటి రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిసిపి రాజమహేంద్రనాయక్‌తో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై మీసక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలకు 100 మీటర్ల దూరంలో పాన్‌షాపులు ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో వచ్చే మార్పులను గమనించాలన్నారు. డిసిపి రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ గోపిరాం, కిరన్ ప్రకాష్, ఎసిపి భీం శర్మ, ఆర్‌డిఏ సభ్యులు చిలువేరు అభిగౌడ్, నేషన్ హైవేస్ హెచ్‌ఎంఆర్ఈ మధుసూదన్ పాల్గొన్నారు.




## నేలమట్టం చేద్దాం (మొదటి పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలో నూతనంగా మంజూరైన నేత బజారు, రూ.5 కోట్లతో పెద్దూరులో నిర్మించనున్న ఇందిరా మహిళా శక్తి భవన్, రూ.15 కోట్లతో రెండు ఆర్‌డిఒ, 4 తహశీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన, రూ.16 కోట్లతో కొనరావుపేట, సిరిసిల్లలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం, రూ.99 కోట్లతో వేములవాడ ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 200 కోట్లతో సిరిసిల్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.10 కోట్లతో రుద్రంగిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవ చింతనతో పాటు, తమ పూర్వీకులు నిజాం రజాకార్లపై చేసిన వీరోచిత పోరాటానికి సిరిసిల్ల ప్రజలు వారసులని పేర్కొన్నారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయమని, అయితే పదేళ్ల టిఆర్‌ఎస్ హయాంలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందని అన్నారు. మనిషి నాగరికతకు మొదటి అడుగు వస్త్రమని, వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా సిరిసిల్ల అని పేర్కొన్నారు. 2009 నుంచి 2023 వరకు అరడజను సార్లు జరిగిన ఎన్నికల్లో కెటిఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదని, కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదని ప్రజలు ఆలోచించాలని అన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు కనీసం వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాలేని పరిస్థితి గత పాలనలో ఉండేదని అన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ రూపొందించాలని స్థానిక నాయకులు కోరగా, విదేశాల్లో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడంతో పాటు సంబంధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. 2004, 2006, 2008 సంవత్సరాల్లో మూడుసార్లు కరీంనగర్ జిల్లా ప్రజలు కెసిఆర్‌ను ఎంపిగా గెలిపించినప్పటికీ 2009లో కెసిఆర్ పాలమూరుకు వలస వెళ్లారని అన్నారు. గత పాలకులపై అవినీతి ఆరోపణలు చేస్తూ, కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు చొరబడినట్లు సిరిసిల్లలో కెటిఆర్ చొరబడ్డాడని విమర్శించారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని, అవి ఎలా వచ్చాయని, అవి అతని ఆస్తులు కావని నిరూపిస్తే తన పేరు మార్చుకుంటానని సవాలు విసిరారు. గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని మానేరు ఇసుకను దోచుకున్నారని ఆరోపిస్తూ, నేరెళ్ల బాధితులు ఇందుకు సజీవ సాక్ష్యమని అన్నారు. మిడ్‌మానేరు డ్యాం ముంపులో ఇళ్లు కోల్పోయిన కెసిఆర్ కుటుంబ సభ్యులు ఇళ్ల స్థలాలు పొందలేదా అని ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కెటిఆర్‌కు పచ్చనోట్లుగా మారాయని ఆరోపించారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో నేత కార్మికుల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేశామని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి,



రాజ్యసభ సభ్యులు వేమూరి నరేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్‌మోహన్ రావు, లక్ష్మీ కాంతరావు, డాక్టర్ సంజయ్, శ్రీగణేష్, నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, వివిధ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com